# చైతన్యరథం
సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



డేటా అనలటిక్స్‌తో
## సమర్థ పౌర సేవలు
- వివరాలు 4 లో.



ఫీడర్ కాలువ దగ్గర కృష్ణమ్మ ప్రవాహానికి సీఎం సాష్టాంగ నమస్కారం



ఉత్సాహంగా, ఉద్వేగంగా సాగిన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం



స్థానికులు, రైతులు, నిర్వాసితులతో కలిసి స్విచ్ నొక్కి గేట్లు ఎత్తిన ముఖ్యమంత్రి



సాంప్రదాయ నృత్యాలతో కృష్ణమ్మకు స్వాగతం పలికిన గిరిజన బిడ్డలు



# కరవు సీమకు కృష్ణమ్మ

- భగీరథ ప్రయత్నంతో 30 ఏళ్ల కల సాకారం..
- వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ ప్రారంభించిన ముఖ్యమంత్రి
- నల్లమల కొండల్ని చీల్చుకుని నల్లమల సాగర్‌కు కృష్ణమ్మ పరుగు
- తొలిదశతో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు.. 4 లక్షలమందికి తాగునీరు
- జలహారతి అనంతరం కృష్ణా జలాలకు సీఎం సాష్టాంగ నమస్కారం
- దోర్నాల బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగం

2



## 30ఏళ్ల నాటి కల.. వెలిగొండ సాక్షాత్కారం

ప్రాజెక్టు ప్రారంభోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి లోకేష్

3

మూడు దశాబ్దాలుగా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలు ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల సాకారమైంది. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జాతికి అంకితం చేశారు. దోర్నాల మండలం గంటవానిపల్లె వద్ద నల్లమల కొండల్లోని జంట సొరంగాల నుంచి వెలువడిన కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, జలహారతి ఇచ్చి స్వాగతించారు. అనంతరం ప్రాజెక్టు తొలిదశ ప్రారంభోత్సవానికి సూచికగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.కరవునేలను తాకిన కృష్ణా జలాలకు ముఖ్యమంత్రి సాష్టాంగ నమస్కారం చేశారు. శ్రీశైలం జలాశయంలోని కొల్లంవాగు నుంచి గ్రావిటీ ద్వారా తరలించిన కృష్ణా జలాలు వెలిగొండ జంట సొరంగాల మీదుగా గంటవానిపల్లె ఆక్విడెక్టుకు చేరుకుని నల్లమల సాగర్‌వైపు పరుగులు తీశాయి.

రాజకీయ విలువలకు
## మానవ రూపం రోశయ్య

విశాఖలో కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి లోకేష్



6

ఒక్క వ్యక్తి చేసిన దానం..
## నేడు వేలమందికి నీడనిచ్చే మహావృక్షం

హరే కృష్ణ గోకుల్ ట్రస్ట్, ప్రేమ ఉదయం, ఏజ్ కేర్ ఫౌండేషన్ కార్యక్రమాల్లో మంత్రి లోకేష్



8

విద్య, వైద్య రంగాలపై
## మరింత దృష్టి సారిస్తాం



- సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు చిరునామా ఏఐజీ హాస్పిటల్స్
- నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్న దేవాలయం ఏఐజీ
- వైద్యవృత్తి అనేది చాలా పవిత్రమైనది
- పట్టుదల, క్రమశిక్షణతో గ్యాస్ట్రోఎంటరాలజీలో నాగేశ్వర్ రెడ్డి నెం.1గా ఎదిగారు
- ట్రిలియన్ డాలర్ ఎకనామిక్ రీజియన్‌గా విశాఖను తీర్చిదిద్దుతాం
- ఏఐజీ ఆసుపత్రికి శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి లోకేష్

7

# కరవు సీమకు కృష్ణమ్మ

- భగీరథ ప్రయత్నంతో 30 ఏళ్ల కల సాకారం..
- వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ ప్రారంభించిన ముఖ్యమంత్రి
- నల్లమల కొండల్ని చీల్చుకుని నల్లమల సాగర్‌కు కృష్ణమ్మ పరుగు
- తొలిదశతో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు.. 4 లక్షలమందికి తాగునీరు
- జలహారతి అనంతరం కృష్ణా జలాలకు సీఎం సాష్టాంగ నమస్కారం
- దోర్నాల బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగం



మార్కాపురం (చైతన్య రథం): మూడు దశాబ్దాలుగా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలు ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల సాకారమైంది. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జాతికి అంకితం చేశారు. దోర్నాల మండలం గంటవానిపల్లె వద్ద నల్లమల కొండల్లోని జంట సొరంగాల నుంచి వెలువడిన కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, జలహారతి ఇచ్చి స్వాగతించారు. అనంతరం ప్రాజెక్టు తొలిదశ ప్రారంభోత్సవానికి సూచికగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కరవునేలను తాకిన కృష్ణా జలాలకు ముఖ్యమంత్రి సాష్టాంగ నమస్కారం చేశారు. శ్రీశైలం జలాశయంలోని కొల్లంవాగు నుంచి గ్రావిటీ ద్వారా తరలించిన కృష్ణా జలాలు వెలిగొండ జంట సొరంగాల మీదుగా గంటవానిపల్లె ఆక్విడెక్టుకు చేరుకుని నల్లమల సాగర్‌వైపు పరుగులు తీశాయి. నల్లమల కొండలను చీల్చుకుని కాలువల్లో ప్రవహించిన కృష్ణమ్మకు స్థానిక మహిళలు, ప్రజలు పుష్పాలతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం పవిత్ర జలాలను సీఎం చంద్రబాబు మంత్రులు, అధికారులు, ప్రజా ప్రతినిధులపై స్వయంగా చల్లారు. అక్విడెక్టు వద్ద రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి స్విచ్ నొక్కి జలాలను దిగువకు వదిలారు.

## 30 ఏళ్ల క్రితం భూమిపూజ.. నేడు ప్రారంభం

వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం తన జీవితంలో భావోద్వేగ సందర్భమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 1996 మార్చి 5న ముఖ్యమంత్రిగా తానే ప్రాజెక్టుకు భూమిపూజ చేశానని, సరిగ్గా 30 ఏళ్ల తర్వాత 2026 ఆగస్టు 31న ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభిస్తున్నానని చెప్పారు. సీఎం మాట్లాడుతూ.. "ఆ రోజు చేసిన సంకల్పం.. ఈరోజు నల్లమల సాగర్‌లో జలసిరిగా మారింది. ఇది భగీరథ ప్రయత్నం. కొండలు అడ్డు వచ్చినా తొలిచి ముందుకు వెళ్లాం. కరువు నేలకు కృష్ణమ్మను తీసుకొచ్చాం. శ్రీశైలం మల్లన్న సన్నిధి నుంచి బయలుదేరిన కృష్ణమ్మ.. మార్కాపురం చెన్న కేశవుడు కొలువైన నేలకు జలహారతి ఇస్తోంది. ప్రజలు ఇచ్చిన తీర్పుతోనే వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించుకుని జల సిరులతో ఈ ప్రాంత అభివృద్ధికి రెక్కలు తొడిగాం. వెలిగొండ బంగారు కొండ అవుతుంది. ఈ ప్రాంత ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుంది. మాట ఇచ్చాం.. ప్రాజెక్టు పూర్తి చేసి కృష్ణమ్మను తరలించాం. ఇక సంపద సృష్టిస్తాం. మార్కాపురం గడ్డకు, కరువుతో పోరాడిన రైతన్నలకు, ఫ్లోరైడ్ బాధలు భరించిన కుటుంబాలకు, నీటి కోసం ఎదురు చూసి అలసిపోయిన తరాలకు కృష్ణా జలాలతో కొత్త ఊపిరి ఇస్తున్నాం" అని ముఖ్యమంత్రి భావోద్వేగంతో ప్రకటించారు.

## నిర్వాసితుల త్యాగాలకు పాదాభివందనం

వెలిగొండ ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు, గ్రామాలను త్యాగం చేసిన 11 గ్రామాల ప్రజలకు పాదాభివందనం చేస్తున్నానని సీఎం ప్రకటించారు. రైతుల త్యాగం లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. "ప్రాజెక్టు వల్ల లబ్ధి పొందేవారు ఎంత సంతోషంగా ఉంటారో.. నిర్వాసితులు కూడా అంతే సంతోషంగా ఉండాలి. కేవలం 48 రోజుల్లో 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల పరిహారం అందించాం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ నిర్వాసితుల బాధలు, అవసరాలను గుర్తించి అదనంగా మరో రూ.169 కోట్లు చెల్లిస్తున్నాం. కటాఫ్ తేదీని పెంచి 18 ఏళ్లు నిండిన యువతకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున అందించాం. రూ.10,200 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వెలిగొండ ప్రాజెక్టులో ఇప్పటివరకు రూ.7,983 కోట్లు ఖర్చు చేసి మొదటి దశను పూర్తి చేశాం. 18.8 కిలోమీటర్ల మేర జంట సొరంగాలు, 21.8 కిలోమీటర్ల ఫీడర్ కాలువల పనులు పూర్తి అయ్యాయి. తొలిదశలో భాగంగా నల్లమల సాగర్‌కు 10.70 టీఎంసీ నీటిని తరలిస్తాం. 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందుతుంది. వెలిగొండ పూర్తయితే ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 30 మండలాల్లో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందుతుంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 3.36 లక్షల ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 84 వేల ఎకరాలు, కడప జిల్లాలో 27 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. తీగలేరు కాలువ కింద 62 వేల ఎకరాలు, గొట్టిపడియ కాలువ కింద 9,500 ఎకరాలు, తూర్పు ప్రధాన కాల్వ కింద 3.70 లక్షల ఎకరాల ఆయకట్టు సుస్థిరం అవుతుంది. కృష్ణమ్మ రాకతో పశ్చిమ ప్రకాశంలో ఫ్లోరైడ్ అనే పదం గత చరిత్రగా మిగిలిపోతుంది. వెలిగొండ అంటే ఫ్లోరైడ్ కష్టాలకు ముగింపు. కరువు నేలపై కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్ర" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉత్సాహంగా ప్రకటించారు.












చైతన్యరథం

## పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు..

# 2019లో గ్రహణం.. 2024లో విముక్తి

- విలువైన నిర్మాణ కాలాన్ని వృధా చేశారు..
- ప్రాజెక్టు పూర్తికాకుండా జాతికి అంకితం పెద్ద మోసం
- ఫేక్ ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొడతాం.
- మంచి చేసిన ప్రభుత్వానికి అండగా ఉండాలి
- 2028లో రెండోదశ పూర్తి చేసే బాధ్యత నాదీ..
- ఇక మార్కాపురంలోనూ కృష్ణా పుష్కరాలు..
- దోర్నాల బహిరంగ సభలో సీఎం చంద్రబాబు
- సంప్రదాయ పంచెకట్టుతో మురిపించిన ముఖ్యమంత్రి



మార్కాపురం (చైతన్య రథం): “2019లో గొడ్డలి పార్టీ అధికారంలోకి రావడంతో వెలిగొండ ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. విలువైన నిర్మాణ కాలాన్ని వృథా చేశారు. నిర్వాసితుల కోసం జీవో ఇచ్చి అరకొరగా చెల్లింపులు చేశారు. ఎన్నికలకు నెల రోజుల ముందు ప్రాజెక్టును పూర్తి చేశామని చెప్పడం, రూ.4 వేల కోట్ల పనులు పెండింగ్‌లో ఉండగానే జాతికి అంకితం చేశామని ప్రకటించడం ప్రజలను మోసం చేయడమే. ఫేక్ డ్రామాలు, సినిమా సెట్టింగులతో ప్రజల్ని, రైతుల్ని మోసం చేసిన వ్యక్తుల్ని ఏంచేయాలి. రెండు సొరంగాలు మొత్తం తిరిగానని చెప్పుకుంటున్న వ్యక్తులు ఈ ప్రాజెక్టు నుంచి నీళ్లు ఎందుకు ఇవ్వలేదు. పనులు చేసేశామని చెప్పి బుకాయించటం తప్పు. ఫేక్ మాటలు చెప్పే వ్యక్తుల్ని, మోసం చేసిన వారి గురించి ఈప్రాంత ప్రజలు నిలదీయాలి. గొడ్డలి పార్టీ హయాంలో సొరంగాల్లో టీబీఎం యంత్రం ఇరుక్కు పోవడంతో పనులు పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే సమస్యలను పరిష్కరించి పనులు పూర్తి చేసి ఇప్పుడు కృష్ణా జలాలను అందించింది. చరిత్రను ఎవరూ తిరగ రాయలేరు. ఫేక్ ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొడతాం. చెడును ఖండించాలి. మంచి చేసిన ప్రభుత్వానికి అండగా ఉండాలి” అని సీఎం పిలుపునిచ్చారు.



### మార్కాపురంలోనూ 2028 కృష్ణా పుష్కరాలు

వెలిగొండ ప్రాజెక్టు మొత్తం పూర్తికావడానికి మరో రూ.1,900 కోట్ల పనులు చేయాల్సి ఉందని చంద్రబాబు తెలిపారు. వెలిగొండ ఫేజ్-2ను కూడా 2028 నాటికి పూర్తి చేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించారు. మార్కా పురం జిల్లాను ఏర్పాటు చేశామని, రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌లో మార్కాపురాన్ని భాగం చేశామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతాన్ని సమానంగా అభివృద్ధి చేయడమే ఎన్డీఏ విధానమని, రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి సాధి స్తామని స్పష్టం చేశారు.

దేశం ఎదుర్కొంటున్న నీటి సమస్యలకు నదుల అనుసంధానమే పరిష్కారమని చంద్రబాబు అన్నారు. పోలవరం రాష్ట్రానికి జీవనాడి అని, 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని చెప్పారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లికి తరలిస్తున్నామని, తదుపరి వంశధార వరకూ తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. దక్షిణ భారతదేశంలో గోదావరి-కావేరి అనుసంధానం జరగాలని, మహానది-గంగానదులను అనుసంధానిస్తే దేశం సుభిక్షంగా మారుతుందని ఆకాంక్షించారు. వచ్చే మూడేళ్లలో 36 ప్రాజెక్టులను పూర్తి చేసేలా ఇరిగేషన్ క్యాలెండర్ రూపొందించామని చెప్పారు. ప్రతి వర్షపు నీటి చుక్కను పొదుపు చేసి భూగర్భజలంగా మార్చుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 2028లో జరిగే కృష్ణా పుష్కరాలను మార్కాపురంలోనూ వైభవంగా నిర్వహించుకుందామని చంద్రబాబు అన్నారు. గోదావరి జలాలు నల్లమల సాగర్ వరకూ రావాలని, అందుకోసం ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని తెలిపారు. ఓట్లు ఆశించి కాదు.. మార్పు ఆశించి పనిచేస్తున్నామని.. ఎన్నికల కోసం కాదు.. ప్రజల జీవితాలను మార్చేందుకు, భవిష్యత్ తరాల అభివృద్ధి కోసం పనిచేస్తున్నామని సీఎం స్పష్టం చేశారు.

### సంప్రదాయ పంచెకట్టుతో ఉల్లాసంగా..

తెలుగు సంప్రదాయ పంచె కట్టుతో వెలిగొండ సొరంగాల ద్వారా వచ్చిన కృష్ణా జలాలకు జల హారతి ఇచ్చారు. కృష్ణా జలాలు పసుపు కుంకుమలు చల్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పవిత్ర జలాలను మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులపై చల్లి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఫీడర్ కాలువ వద్ద కృష్ణమ్మ ప్రవాహానికి ముఖ్యమంత్రి సాష్టాంగ నమస్కారం చేశారు. సంప్రదాయ నృత్యాలతో కృష్ణా జలాలకు గిరిజన మహిళలు సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. బహిరంగ సభా వేదికపై ఏర్పాటు చేసిన ర్యాంపుపై కండువా తిప్పుతూ రైతులకూ, ప్రజలకూ ముఖ్యమంత్రి అభివాదం చేశారు. దివంగత పూలసుబ్బయ్య కుటుంబ సభ్యుల్ని ఆత్మీయంగా పలకరించి సన్మానించారు. ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసేందుకు పనిచేసిన అధికారులు, ఉద్యోగాలు, జల వనరుల శాఖ మంత్రి రామానాయుడును సీఎం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమానికి మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పి నారాయణ, కందుల దుర్గేష్, కొలుసు పార్థసారధి, అనగాని సత్యప్రసాద్, గుమ్మిడి సంధ్యారాణి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి సహా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.




## 30ఏళ్ల నాటి కల.. వెలిగొండ సాక్షాత్కారం

### ప్రాజెక్టు ప్రారంభోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి లోకేష్

అమరావతి (చైతన్య రథం): వలసల కష్టాలకు సెలవు చెబుతూ.. అభివృద్ధికి స్వాగతం పలుకుతున్న మార్కాపురం జిల్లా ప్రజలకు వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవ శుభాకాంక్షలు తెలిపారు విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్. ఈమేరకు  ఎక్స్ వేదికపై పోస్టు పెడుతూ.. “కరవు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేలా వెలిగొండ ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చింది. ప్రాజెక్టు నిర్మాణానికి సహకరిస్తూ త్యాగాలు చేసిన నిర్వాసితులకు ధన్యవాదాలు. 30 ఏళ్ల కలను నిజం చేస్తూ వెలిగొండ ప్రాజెక్టును ఇవాళ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. కరవుతోపాటు ఫ్లోరైడ్ సమస్యతో అల్లాడుతున్న మార్కాపురం ప్రాంత ప్రజలకు రక్షిత మంచి నీరు అందించి ఫ్లోరైడ్ సమస్య నుంచి విముక్తి కల్పించనున్నారు. తాగు, సాగు నీరు అందించడంతోపాటు ఈ ప్రాంతంలో ఉద్యాన సాగును అభివృద్ధి చేయనున్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో ప్రజా ప్రభుత్వం ఉక్కు సంకల్పంతో పని చేస్తోంది. ప్రజలకు మంచి చేయడం ద్వారా వారి అభిమానాన్ని పొందడమే మేం కోరుకునే క్రెడిట్. ‘వెలిగొండ జలసిరులు-అభివృద్ధికి రెక్కలు’.. ఇది నినాదం కాదు... కూటమి ప్రభుత్వ విధానం” అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# డేటా అనలటిక్స్‌తో సమర్ధ పౌర సేవలు



- **ప్రభుత్వ నిర్వహణా కార్యక్రమాలపై విస్తృత ప్రచారం**
- **ప్రజా భాగస్వామ్యంతోనే సానుకూల ఫలితాలు**
- **రియల్ టైమ్ గవర్నెన్స్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష**

అమరావతి (చైతన్య రథం): ప్రజలు వ్యక్తం చేసే అభిప్రాయాల ఆధారంగా ప్రభుత్వ శాఖలు అందిస్తున్న పౌరసేవలు మరింత మెరుగుపరచాలని, మార్పులు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం రియల్ టైమ్ గవర్నెన్స్‌పై సీఎం సమీక్ష నిర్వహించారు. వెలిగొండ, అల్లూరి విమానాశ్రయ ప్రారంభోత్సవంలాంటి కార్యక్రమాలకు ప్రజా భాగస్వామ్యం పెద్దఎత్తున వచ్చిందని... దీనిని ఇతర అంశాలకూ వర్తింప చేయాలని సీఎం సూచించారు. ప్రత్యేకించి మహిళలపై నేరాలు, గంజాయి నియంత్రణ సహా వివిధ అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీఎం సూచించారు. ఇప్పటివరకు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో తాను 20సార్లు పాల్గొన్నానని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో పరిశుభ్రత అంశాలపై ప్రజల్లో మరింత లోతైన అవగాహన కల్పించాలన్నారు.

రాష్ట్రంలో శానిటేషన్ నిర్వహణపై ఎలాంటి రాజీ లేదని తేల్చి చెప్పారు. సంక్షేమ హాస్టళ్లలో మెరుగ్గా శానిటేషన్ నిర్వహించాలని నిర్దేశించారు. ప్రతీ నెలా మొదటి ఆదివారం విద్యార్ధుల తల్లిదండ్రుల్ని ఆహ్వానించి హాస్టళ్లలో పరిస్థితులు, ఆహారం, తాగునీరు తదితర అంశాలపై వివరించాలని ముఖ్యమంత్రి సూచించారు. అన్న క్యాంటీన్ల ద్వారా దాతలు అన్నార్తులకు సాయం అందించే అంశాన్ని కూడా గుర్తించాలని పేర్కొన్నారు. జిల్లాలవారీగా, నియోజకవర్గాలవారీగా ఎప్పటికప్పుడు సమీక్షించుకుని లోటుపాట్లను సవరించుకోవాలని సీఎం నిర్దేశించారు. బాధ్యులకు రాష్ట్ర, జిల్లాస్థాయిలో ర్యాంకులు ఇవ్వాలని స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి అయ్యి కృష్ణా నదీ జలాలు రావటంతో ప్రజల్లో ఎంతో ఆనందం వ్యక్తమైందని.. ప్రతీ కార్యక్రమంలోనూ ప్రజల భాగస్వామ్యంతో నిర్వహిస్తే సానుకూల ఫలితాలు వస్తాయన్నారు.

## ఆన్ లైన్ సేవలు మరింత విస్తృతం

అన్ని ప్రభుత్వ శాఖలూ ఆన్ లైన్‌లో సేవలు అందించాలని సమీకృత సేవల విధానం ద్వారా తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు. రెవెన్యూ సహా వివిధ విభాగాలు అన్ని ధృవపత్రాలనూ ఆన్ లైన్‌లో జారీ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అవేర్ ద్వారా రాష్ట్రంలో సాగు స్థితిపై ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి రైతులకు సూచనలు జారీ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రకృతి సేద్యం పెంచేందుకు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని స్పష్టం చేశారు. ఉద్యాన పంటలు కాపాడుకోడానికి ప్రస్తుతం ఉన్న నీటి వనరుల్ని సద్వినియోగం చేసుకోవాలని సీఎం సూచించారు. భూమిని నిరుపయోగంగా ఉంచకుండా సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. 5.7 లక్షల ఎకరాల్లో ప్రతీ ఎకరాను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే దరఖాస్తుల పరిష్కారంపై కూడా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. సమీక్షకు సీఎస్ సాయిప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరు అయ్యారు.



## నేడు మొగల్తూరుకు సీఎం చంద్రబాబు

***పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి హాజరు***


అమరావతి (చైతన్య రథం): పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరులో పర్యటించనున్నారు. ఉదయం 9.45 గంటలకు అమరావతినుంచి బయల్దేరి పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరుకు చేరుకోనున్నారు. 11 గంటలకు నర్సాపురం చేరుకుని గోదావరి గట్టు సమీపంలోని 2, 3 వార్డులతోపాటు పొన్నపల్లిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పెన్షన్ పంపిణీ చేయనున్నారు. పెన్షన్ లబ్ధిదారులతో మాట్లాడనున్నారు. అనంతరం మొగల్తూరు ప్రజావేదిక సభకు హాజరై ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పార్టీ కేడర్ సమావేశంలోనూ ముఖ్యమంత్రి పాల్గొంటారు. సాయంత్రం 5.20 గంటలకు సీఎం అమరావతికి చేరుకోనున్నారు.





## టీడీపీ నేత అప్పసాని కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరైన మంత్రి లోకేష్

మంగళగిరి (చైతన్య రథం): తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేష్ కుమారుడి వివాహ రిసెప్షన్ వేడుకకు విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో జరిగిన వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొని నూతన దంపతులు నాగ సత్యేంద్ర, స్రవంతిలను ఆశీర్వదించారు. పుష్పగుచ్ఛం అందించి వారికి శుభాకాంక్షలు తెలిపారు.






# విశాఖలో ఏఐజీ హాస్పిటల్స్‌కు

# మంత్రి లోకేష్ శంకుస్థాపన

## రూ.2వేల కోట్ల పెట్టుబడి, వెయ్యి పడకల సామర్థ్యంతో నిర్మాణం

విశాఖపట్నం (చైతన్య రథం): ఆసియాలోనే ప్రసిద్ధి చెందిన ఏఐజీ ఆసుపత్రి రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ మేరకు విశాఖ ఆనందపురం మండలం ఎండాడ వద్ద ఏఐజీ హాస్పిటల్స్ నిర్మాణానికి సంస్థ ఛైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డితో కలిసి విద్య, ఐటీ మంత్రి నారా లోకేశ్ భూమిపూజ, శంకుస్థాపన చేశారు. ముందుగా ఎండాడ వద్ద వేదిక ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు ఏఐజీ హాస్పిటల్స్ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆసుపత్రి నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆసుపత్రికి సంబంధించి రూపొందించిన ఏవీని వీక్షించారు.

### రూ.2వేల కోట్ల పెట్టుబడి, 9వేల మందికి ఉద్యోగ అవకాశాలు


విశాఖలో నెలకొల్పనున్న ఏఐజీ ఆసుపత్రి ద్వారా సంస్థ దశలవారీగా ఐదేళ్లలో 2వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది.తద్వారా 9వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. పూర్తిస్థాయి నిర్మాణం పూర్తయ్యే నాటికి ఆసుపత్రి సామర్థ్యం వెయ్యి పడకలకు చేరనుంది. విశాఖలో 9 ఎకరాల్లో ఆసుపత్రి క్యాంపస్, 2.5ఎకరాల్లో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయనుంది. ఒకే క్యాంపస్‌లో వైద్యసేవలు, శిక్షణ, పరిశోధన, రోగులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన అన్ని సదుపాయాలతో కూడిన కంప్లీట్ హెల్త్ కేర్ ఎకో సిస్టమ్‌ను నెలకొల్పనుంది. మొదటి దశ నిర్మాణాలను 650 పడకల సామర్థ్యంతో 2028 అక్టోబర్ నాటికి పూర్తి చేయనున్నారు. రెండో దశ నిర్మాణాలను 350 పడకల సామర్థ్యంతో రెండేళ్లలో పూర్తిచేయనున్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పిటల్స్‌లో అందించే పూర్తిస్థాయి వైద్య సేవలను ప్రతిబింబించేలా 8 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో 50కి పైగా వైద్య ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయనున్నారు.




కార్యక్రమంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, విశాఖ ఎంపీ ఎం శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే గణబాబు, ఏఐజీ హాస్పిటల్స్ వైస్ ఛైర్మన్ పీవీఎస్ రాజు, డైరెక్టర్ జీవీ రావు, సీఈవో సామ్ రిజ్వీ, విశాఖ ఏఐజీ హాస్పిటల్స్ విశాఖ డైరెక్టర్ కే.రాకేష్, కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, విశాఖ పోలీసు కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి, ఏఐజీ హాస్పిటల్స్ సీవోవో కాప్రీ జలోట తదితరులు పాల్గొన్నారు.





# రాజకీయ విలువలకు మానవ రూపం రోశయ్య

- రోశయ్య విగ్రహం.. 'ది స్టాట్యూ ఆఫ్ స్టేట్స్‌మన్'గా నిలవాలి
- సమాజ శ్రేయస్సుకు ఆయన సేవ భావితరాలకు తెలియాలి
- ఆయన జీవిత చరిత్ర తెలిసేలా మ్యూజియం ఏర్పాటుచేయాలి
- విశాఖలో మాజీ సీఎం కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి లోకేష్
- రోశయ్య కుటుంబసభ్యులతో మంత్రి లోకేష్ ప్రత్యేక భేటీ



విశాఖపట్నం, సిరిపురం సర్కిల్ (చైతన్య రథం): రాజకీయ విలువలకు మానవ రూపం, నిజాయతీకి నిలువెత్తు ప్రతిరూపం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య అని మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. విశాఖపట్నంలోని సిరిపురం సర్కిల్‌వద్ద ఏర్పాటుచేసిన రోశయ్య కాంస్య విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించి.. ఆ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడారు.

## 'ది స్టాట్యూ ఆఫ్ స్టేట్స్‌మన్'

"యువగళం పాదయాత్రలో ఆర్యవైశ్యులు మా ఆత్మగౌరవాన్ని గౌరవించాలని కోరారు. అందుకే తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకైన పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని అమరావతిలో రికార్డు సమయంలో ఏర్పాటు చేసుకున్నాం. అది ఒక చరిత్ర. భూమి మేం ఇచ్చాం. నిధులు ఆర్యవైశ్య సోదరులే సమకూర్చి ఏర్పాటుచేశారు. మీరు కోరుకుంటే ఐక్యత తో నిలబడతారనే దానికి ఇది నిదర్శనం. ఇప్పుడు విశాఖపట్నంలో రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం కూడా చరిత్రలో నిలిచిపోయే రోజు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య పెద్దల ఆమోదంతో 'స్టాట్యూ ఆఫ్ సాక్రిఫైస్' అని పేరు పెట్టుకున్నాం. అదేవిధంగా రోశయ్య విగ్రహాన్ని చూసిన వెంటనే గుర్తొచ్చే పదం 'స్టేట్స్‌మన్'. అందుకే ఈ విగ్రహాన్ని 'ది స్టాట్యూ ఆఫ్ స్టేట్స్‌మన్' అని పిలుద్దాం" అని మంత్రి లోకేష్ సభలో ప్రతిపాదించారు.

## వ్యక్తిగత విభేదాలకు దూరం.. రాజకీయ విలువలకు ప్రతిరూపం

"రాజకీయ విలువల గురించి మాట్లాడాలంటే గుర్తొచ్చే పేర్లలో రోశయ్య ఒకరు. నాకు ఎంతో ఇష్టమైన నాయకుడు, గొప్ప స్టేట్స్‌మన్ రోశయ్య. క్రమశిక్షణ, నిజాయతీ, సబ్జెక్టుపై పట్టు, మాటల్లో మంచితనం, విమర్శల్లో పదును ఆయన ప్రత్యేకతలు. పదవులు శాశ్వతం కాదు.. ప్రజలకు చేసిన సేవే శాశ్వతమని నమ్మిన వ్యక్తి రోశయ్య. అధికారం ఉన్నప్పుడు అహంకారం ఉండదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉండేవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో రోశయ్య మాట్లాడుతుంటే అందరూ సైలెంట్‌గా వినేవారు. ప్రభుత్వం, ప్రతిపక్షం మధ్య ఒక వారధిగా ఉండేవారు. చంద్రబాబు, వైఎస్సార్ మధ్య ఎప్పుడైనా వాడివేడిగా వాదన జరిగినప్పుడు రోశయ్య నిలబడి కాస్త చల్లబరిచేవారు. మరుసటి రోజు చంద్రబాబుకి ఫోన్ చేసి 'చాలా చక్కగా వాదనలు జరిగాయి.. ఇవాళ చర్చ కొనసాగిద్దాం' అని చెప్పేవారు. రాజకీయ విభేదాలున్నా వ్యక్తిగత గౌరవాన్ని కాపాడిన నాయకుడు రోశయ్య' అని కీర్తించారు.

## నేటి తరానికి ఆయనే స్ఫూర్తి

"ఒక పల్లెటూరిలో సాధారణ కుటుంబంలో పుట్టి.. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకుండా ఆచార్య ఎన్జీ రంగా శిష్యుడిగా రాజకీయాల్లోకి వచ్చారు రోశయ్య. పల్లెటూరు నుంచి ఢిల్లీ వరకు ఎదిగిన గొప్ప వ్యక్తి ఆయన. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయం లో ముఖ్యమంత్రులు మారినా ప్రతి కేబినెట్‌లో రోశయ్య కొనసాగేవారు. మొదటి నుంచి చివరి వరకు కాంగ్రెస్ పార్టీలోనే ఉండి కమిట్మెంట్‌తో పనిచేశారు. ఆస్తులు, రాజకీయ నేపథ్యం లేకపోయినా కష్టం, క్రమశిక్షణ, విలువలుంటే రాజకీయాల్లో ఉన్నతస్థాయికి ఎదగవచ్చని రోశయ్య నిరూపించారు. ఆయన ఒక రాజకీయ పాఠశాల. నేటి తరానికి ఆయనే స్ఫూర్తి" అని మంత్రి లోకేష్ ఉద్ఘాటించారు.

## భావి తరాలకు ఆయన జీవిత చరిత్ర తెలియాలి

"విగ్రహాలు కట్టడం వలన ఏం ఉపయోగమని చాలామంది అపోహ పడుతుంటారు. కానీ నేను యువగళం పాదయాత్ర చేసే సమయంలో తెలుగు జాతి కోసం త్యాగాలు చేసిన ఎందరో మహానుభావుల గురించి విగ్రహాలను చూసే తెలుసుకున్నాను. గొప్ప వ్యక్తులకు విగ్రహాలు ఏర్పాటు చేయడం గొప్ప నివాళి. అయితే అక్కడితో ఆగకూడదు. వారి జీవిత చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాలి. రోశయ్య జీవితంలో ఎదుర్కొన్న కష్టాలు, నష్టాలు, విజయాలు నేటి తరాలకు తెలియాలి. ఆయన జీవిత చరిత్రపై పుస్తకాలు, ప్రత్యేక వీడియోలు రూపొందించి యువతకు చేరువ చేయాలి. వీటితోపాటు రోశయ్య జీవిత చరిత్ర తెలిపేలా ఒక మ్యూజియం ఏర్పాటు చేయాలి. ఆర్యవైశ్య పెద్దలంతా కలిసి ఆలోచించి మ్యూజియం కోసం స్థలం ఏర్పాటుచేయండి. కేవలం 18 నెలల్లో మ్యూజియం పూర్తి చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా దేశానికి అంకితం చేద్దాం. నేటి తరానికి కూడా బాల్యం నుంచే రోశయ్య జీవిత చరిత్ర తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. అందుకే పాఠ్యాంశాలలో ఆయన జీవిత చరిత్ర, రాజకీయ విలువలు, సమాజ సేవ గురించి ఒక అధ్యాయం పెట్టించే బాధ్యత నాది. అలానే ఆయన అవలంబించిన రాజకీయ విలువలపై టీడీపీ క్యాడర్ ట్రైనింగ్‌లో కూడా ఒక చాప్టర్ పెట్టించే బాధ్యత పల్లా శ్రీనివాసరావుది. ప్రభుత్వం, ఆర్యవైశ్య పెద్దలు కలిసి రోశయ్య జీవితాన్ని భవిష్యత్ తరాలకు అందించేలా కృషి చేద్దాం" అని పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందని, ఇంతటి గొప్ప వ్యక్తి విగ్రహాన్ని ఆవిష్కరించే అవకాశం నాకు దక్కడం నా అదృష్టంగా భావిస్తున్నాని లోకేష్ పేర్కొన్నారు.

విగ్రహావిష్కరణకు ముందు రోశయ్య కుటుంబసభ్యులు పైడా కృష్ణ ప్రసాద్, పైడా రమాదేవి, పైడా మౌర్య, కొణిజేటి శివసుబ్బారావు, కేఎస్ఎన్ మూర్తిలతో మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సమాజ శ్రేయస్సుకు రోశయ్య చేసిన త్యాగాలు, అందించిన సేవలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహకారం అందిస్తామని కుటుంబసభ్యులకు మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, ఎంపీ ఎం శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ దూండి రాకేష్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.









# విద్య, వైద్య రంగాలపై
# మరింత దృష్టి సారిస్తాం

- సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు చిరునామా ఏఐజీ హాస్పిటల్స్
- నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్న దేవాలయం ఏఐజీ
- వైద్యవృత్తి అనేది చాలా పవిత్రమైనది
- పట్టుదల, క్రమశిక్షణతో గ్యాస్ట్రోఎంటరాలజీలో నాగేశ్వర్‌రెడ్డి నెం.1గా ఎదిగారు
- ట్రిలియన్ డాలర్ ఎకనామిక్ రీజియన్‌గా విశాఖను తీర్చిదిద్దుతాం
- ఏఐజీ ఆసుపత్రికి శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి లోకేష్




విశాఖపట్నం (చైతన్య రథం): విద్య, వైద్య రంగాలపై ప్రజాప్రభుత్వం ఎక్కువ దృష్టిసారిస్తుందని, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు చిరునామా ఏఐజీ హాస్పిటల్స్ అని, నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ఏఐజీ కృషిచేస్తోందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విశాఖ ఆనందపురం మండలం ఎండాడ వద్ద ఏఐజీ హాస్పిటల్స్‌కు శంకుస్థాపన అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ.. జీవితంలో విద్య, వైద్యం అనేది చాలా కీలకం. అందుకే నేను ఏరికోరి విద్యాశాఖను ఎంచుకున్నాను. సమాజంలో మనం ఆశించే మార్పు విద్య ద్వారానే సాధ్యం. విద్య, వైద్య రంగాలపై ఎక్కువ శ్రద్ధ పెడతాం. ఇందుకు అందరం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. మన కంటికి కనిపించే దేవుడు వైద్యుడు. వైద్యవృత్తి అంటే అందరూ హైఫై అనుకుంటారు. వాస్తవంగా డాక్టర్లు తమ జీవితంలో ఎన్నో త్యాగాలు చేస్తారు. ఇంట్లో వివాహం జరుగుతున్నా అత్యవసరం అయితే వెళ్లాల్సిందే. వైద్యవృత్తి అనేది చాలా పవిత్రమైన వృత్తి. కరోనా సమయంలో నేను ప్రత్యక్షంగా చూశాను. లైఫ్ రిస్క్ చేసి డాక్టర్స్ పనిచేశారు. కరోనా వస్తే చనిపోతామని తెలుసు. అప్పటికి ఇంకా వ్యాక్సిన్ కూడా రాలేదు. అయినా డాక్టర్స్ ఎవరూ వెనకడుగు వేయలేదు. ప్రజల ప్రాణాలు కాపాడారు. అప్పుడే మీపై గౌరవం పెరిగింది. ఒక కమిట్‌మెంట్‌తో మేం కూడా మీకు అండగా నిలబడతాం" అన్నారు.

## కమిట్‌మెంట్‌తో పనిచేసే వ్యక్తి నాగేశ్వర్ రెడ్డి

నాగేశ్వర్ రెడ్డికి, నాకు మధ్య ఎంతో అనుబంధముంది. ఆయన ఎప్పుడు కలిసినా విమానంలోనే కలిసేవారు. సింగపూర్‌కు ఓవర్ నైట్ కాన్ఫరెన్స్‌కు వెళ్లి, ఆ కార్యక్రమం పూర్తిచేసుకుని తిరిగి వచ్చేవారు. కనీసం హోటల్‌కు కూడా వెళ్లేవారు కాదు. కమిట్‌మెంట్‌తో పనిచేసే వ్యక్తి నాగేశ్వర్ రెడ్డి. ఏఐజీ గురించి మాట్లాడితే ముందు ఒక అల్లరి పిల్లాడి గురించి మీకు చెప్పాలి. ఆ అల్లరి పిల్లాడు విశాఖపట్నంలోనే పుట్టాడు, ఇక్కడే పెరిగారు. చిన్న వయసులో ఆ కుర్రాడు చేసిన చిలిపి పనులు కొన్ని మీకు చెప్పాలి. పెట్రోల్ బర్న్ అవడంవల్లే కార్ రన్ అవుతుందని ఎవరో చెబితే ఆ కుర్రాడు విన్నాడు. అది నిజమో కాదో తెలుసుకోడానికి గ్యారేజీలో కారు ట్యాంక్‌లోని పెట్రోల్ తీసి కింద పోసి నిప్పు అంటించాడు. చుట్టపక్కల వాళ్లు వచ్చి ఆ మంటలను ఆర్పేశారు. ఆ అల్లరి పిల్లాడు చేసిన ఇంకో చిలిపి పని గురించి మీకు చెప్పాలి. వాళ్ల నాన్నకు బట్టతల ఉంది. బార్బర్‌కి డబ్బులు ఇవ్వడం ఎందుకు వేస్ట్ అని నాన్న పడుకున్నప్పుడు వెంట్రుకలు కట్ చేశాడు. వైజాగ్‌లో టింఫనీ హిల్స్‌లోనే ఆ కుర్రాడు ఉండేవాడు. టింఫనీ హిల్స్ ఏరియాలో స్లోప్ ఎక్కువ ఉంటుంది. కారు గేర్ వేసి ఉండటం వల్లే ఆ స్లోప్‌లో పార్క్ అవుతుందని ఎవరో చెప్పారు. అది నిజమో కాదో తెలుసుకోడానికి గేర్ తీసేశాడు. ఆ కారు కిందకు వెళ్లి డ్యామేజ్ అయింది. ఇంట్లో ఏసీ లేకపోతే చిన్న తమ్ముడిని ఫ్రిడ్జ్‌లో పెట్టి డోర్ వేసి మర్చిపోయాడు ఆ అల్లరి పిల్లాడు. ఆ అల్లరి తట్టుకోలేక ఆ కుర్రాడిని వాళ్ల తాతగారు హైదరాబాద్ హెచ్ పీఎస్‌లో జాయిన్ చేశారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఆ కుర్రాడి జీవితాన్ని మార్చింది. అల్లరి పిల్లాడు క్రమశిక్షణ కలిగిన కుర్రాడిగా మారాడు. ఆయనే డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి" అని లోకేష్ తన ప్రసంగంతో నవ్వులు పూయించారు.

## పట్టుదల, క్రమశిక్షణతో గ్యాస్ట్రోఎంటరాలజీలో నాగేశ్వర్ రెడ్డి నెం.1గా ఎదిగారు

"అక్కడి నుంచి మొత్తం ప్రయాణం మారిపోయింది. కర్నూలు మెడికల్ కాలేజీలో మెడిసిన్ చేశారు. కుటుంబం అంతా పాథాలజీలో నిపుణులు కాబట్టి ఆయన కూడా పాథాలజీ వైపు వెళ్లాలని అనుకున్నారు. కానీ వాళ్ల తండ్రి ఒప్పుకోలేదు. ఇంటర్నల్ మెడిసిన్ చదివించారు. ఆ తర్వాత అసలు ఎవరికీ తెలియని గ్యాస్ట్రో ఎంటరాలజీ చదివారు. ఎవరికీ తెలియని గ్యాస్ట్రోఎంటరాలజీకి గుర్తింపు తీసుకురావాలనే పట్టుదలతో పనిచేశారు. గ్యాస్ట్రోఎంటరాలజీలో నేడు ప్రపంచంలో నెం.1 స్థానం సంపాదించిన గొప్ప డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి" అని మంత్రి లోకేష్ ప్రశంసించారు.

## సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు చిరునామా ఏఐజీ

"ఏఐజీ మరొక కార్పోరేట్ ఆసుపత్రి కాదు. ప్రపంచస్థాయి వైద్యం నిరుపేదలకు ఎలా అందించాలని ఆలోచించే వ్యక్తి నాగేశ్వర్ రెడ్డి. నా రక్తపరీక్షలన్నింటికీ నేను ఏఐజీకే వెళ్తాను. సాంకేతిక వినియోగంతోపాటు పరిశోధనలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు చిరునామా ఏఐజీ. నిరుపేదలకు అద్భుతమైన వైద్యం అందిస్తున్న దేవాలయం ఏఐజీ. నాగేశ్వర్ రెడ్డికి పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ ఇచ్చినా తక్కువే. ఆయన నిరంతరం ప్రజల గురించే ఆలోచిస్తారు. కేవలం ధనవంతులు గురించి కాదు.. నిరుపేదల గురించి ఆలోచిస్తారు. నగదు ఉన్నా లేకపోయినా అందరికీ నాణ్యమైన వైద్యం అందించాలనేదే ఆయన ఆలోచన" అన్నారు.

## ట్రిలియన్ డాలర్ ఎకనామిక్ రీజియన్‌గా విశాఖను తీర్చిదిద్దుతాం

ప్రభుత్వపరంగా ఏఐజీ హాస్పిటల్స్‌కు అన్ని విధాల సహకారం అందిస్తాం. విశాఖకు వచ్చినందుకు సాదరంగా ఆహ్వానం పలుకుతున్నాం. ఇది భవిష్యత్ నగరం. ట్రిలియన్ డాలర్ ఎకనామిక్ రీజియన్‌గా విశాఖను తీర్చిదిద్దుతాం. మీరు సరైన సమయంలో సరైన ప్రాంతాన్ని ఎంచుకున్నారు. అందరం కలిసి కట్టుగా నాణ్యమైన వైద్యసేవలు అందిద్దాం. ఇది కేవలం పెట్టుబడి మాత్రమే కాదు..జీవితాలనే మార్చివేసే సందర్భం. ఏఐజీకి 32 ఏళ్ల చరిత్ర ఉంది. 1400 పడకలు, 350 ఐసీయూ పడకలు, 600మంది డాక్టర్లు, 10లక్షల మంది రోగులకు చికిత్స అందించారు. విశాఖలో రూ.2వేల కోట్ల పెట్టుబడి, వెయ్యి పడకల సామర్థ్యంతో కేర్, ట్రైనింగ్, రీసెర్చ్‌తో పూర్తి స్థాయి హెల్త్ కేర్ ఎకోసిస్టమ్‌ను నిర్మిస్తున్నారు. అవుట్ పేషంట్ బ్లాక్ రోజుకు 5వేల కెపాసిటీతో ఏర్పాటు చేస్తున్నారు. 50స్పెషాలిటీలు నెలకొల్పుతున్నారు. 9వేల మందికి ఉద్యోగాలు కల్పించనున్నారు. వెయ్యిమంది వైద్యులు సేవలు అందిస్తారని ఈ సందర్భంగా మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి ఎన్నో అవార్డులు అందుకున్నారు. ఆయనకున్న నాలెడ్జ్, కమిట్‌మెంట్ అలాంటిది. ఆయనతో నాకు మంచి అనుబంధం ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో అసెంబ్లీలో ఉండగా నేను అనారోగ్యానికి గురయ్యాను. డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి నాకు మంచి వైద్యం అందించి ప్రాణాలు నిలిపిన పరిస్థితి. ఆయన చేసిన సేవలకు గాను మూడు పద్మ అవార్డులు అందుకున్నారు. పరిశోధనకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. విశాఖకు ఏఐజీ ఆసుపత్రి రావడం చాలా ఆనందంగా ఉంది. రాష్ట్రంలో విద్య, వైద్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఏఐజీ హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ డి నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. "ఈ రోజు విశాఖపట్నం వైద్యచికిత్స రంగంలో చారిత్రక ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నాం. ఇది భావోద్వేగ సమయం. నేను విశాఖ కేజీహెచ్ ఆసుపత్రిలో జన్మించాను. నా జీవితంలోని తొలి ఆరేళ్లు ఇక్కడే గడిచాయి. నా బాల్య స్మృతులు ఇక్కడే ఉన్నాయి. విశాఖ బీచ్‌లు, అప్పట్లో ఇక్కడ ఉన్న టెన్నిస్ క్రీడా సౌకర్యాలు, అప్పటి వాతావరణం.. అన్నీ నాకు ఎంతో ఇష్టం. హైదరాబాద్‌లో ఏఐజీ హాస్పిటల్‌ను ప్రారంభించి, దానిని అభివృద్ధి చేసిన తర్వాత, విశాఖపట్నానికి రావాలని కోరిక ఉండేది. ఇక్కడికి తిరిగి వచ్చి ఏదైనా చేయాలని ఉండేది. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ సహకారంతో అది సాకారమైంది. ఏఐజీ హైదరాబాద్ తక్కువ సమయంలోనే ప్రపంచ అగ్రశ్రేణి ఆసుపత్రుల్లో ఒకటిగా నిలిచింది. గత మూడేళ్లుగా ప్రపంచంలోని ప్రముఖ మ్యాగజైన్‌లు న్యూస్ వీక్, టైమ్.. మమ్మల్ని ప్రపంచంలోని అత్యుత్తమ ఆసుపత్రుల్లో ఒకటిగా పేర్కొన్నాయి. ముఖ్యంగా గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగంలో హార్వార్డ్, స్టాన్ ఫోర్డ్‌వంటి ప్రముఖ సంస్థలతో కలిసి మేం 5వ స్థానంలో ఉన్నాం. మా బృందం సమిష్టి కృషివల్లే ఇది సాధ్యమైంది. అన్ని వర్గాల రోగులకు సమానమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగాం. మేం ఎప్పుడూ టార్గెట్లు నిర్ణయించలేదు. ఏఐజీ హాస్పిటల్స్‌కు నైతిక విలువలే పునాది. ఆ తర్వాత మేం పరిశోధనపై దృష్టి పెట్టాం. విశాఖలో మేం ఒక సాధారణ కార్పోరేట్ ఆసుపత్రిని నిర్మించడం లేదు. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే ఆసుపత్రిని నిర్మించబోతున్నాం. ఇక్కడికి వచ్చే రోగులకు ఖర్చు ఒక సమస్యగా మారకుండా చూసుకుంటాం. రోగులకు కేవలం చికిత్స అందించడమే కాకుండా, నైతిక విలువలకు కట్టుబడి చికిత్స అందించే ఆసుపత్రిగా దీనిని తీర్చిదిద్దుతాం. ఈ ఆసుపత్రి చికిత్స అందించడంతో పాటు పరిశోధనలు నిర్వహిస్తుంది. పెద్ద సంఖ్యలో వైద్యులు, టెక్నీషియన్లు, నర్సులకు శిక్షణ అందిస్తుంది. ఇందుకోసం మాకు తగినంత స్థలం కూడా ఉంది. ఇక్కడ శిక్షణ పొందిన వారు భవిష్యత్తులో ఈ రంగంలో నిష్ణాతులుగా ఎదుగుతారు. విశాఖపట్నంలోని ఈ ప్రాంతం దేశవ్యాప్తంగా ఆరోగ్య సేవలకు ఒక ప్రధాన కేంద్రంగా మారుతుంది. ప్రస్తుతం ప్రజలు వైద్య చికిత్స కోసం ఢిల్లీ, ముంబై, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్తున్నారు. ఇకపై వారు విశాఖపట్నానికి వస్తారు. విశాఖపట్నాన్ని ఒక మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం" అని ప్రకటించారు.






చైతన్యరథం

## ఒక్క వ్యక్తి చేసిన దానం..

# నేడు వేలమందికి నీడనిచ్చే మహావృక్షం

- సివిల్ సొసైటీ, ప్రభుత్వం, అధికారులు కలిసి పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు
- విశాఖ అభివృద్ధి మన బాధ్యత.. ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఏదీ చేయబోం
- హరే కృష్ణ గోకుల్ ట్రస్ట్, ప్రేమ ఉదయం, ఏజ్ కేర్ ఫౌండేషన్ కార్యక్రమాల్లో మంత్రి లోకేష్
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన మంత్రి లోకేష్




విశాఖపట్నం, ఆనందపురం (చైతన్య రథం): ప్రేమ ఉదయం అండ్ ఏజ్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలంలోని గంభీరం వద్ద నిర్వహించిన పలు కార్యక్రమాల్లో రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ముందుగా హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆలయాన్ని సందర్శించిన మంత్రి నారా లోకేష్‌కు నిర్వాహకులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కిచెన్‌ను పరిశీలించారు. హరే కృష్ణ వైకుంఠం కల్చరల్ కాంప్లెక్స్ నిర్మాణాని భూమి పూజ, శంకుస్థాపన చేశారు. ఆలయానికి సంబంధించిన ప్రత్యేక ఏవీనీ మంత్రి లోకేష్ తిలకించారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి లోకేష్‌ను నిర్వాహకులు సత్కరించారు.

అనంతరం ప్రేమ గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ నూతన కాలేజీ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించి, నూతన కాలేజీ భవనాలను పరిశీలించారు.

అనంతరం ఏజ్ కేర్ ఫౌండేషన్/ స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ జెరియాట్రిక్ అండ్ పాలియేటివ్ కేర్ సెంటర్‌ను మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. డోనర్ గ్యాలరీని సందర్శించారు. ఏజ్ కేర్ ఫౌండేషన్ భవనంలోని 4వ అంతస్తు, 5వ అంతస్తును మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. అనంతరం సంస్థకు సహకరిస్తున్న ముఖ్య దాతలతో బోర్డ్‌రూమ్ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ... "దివంగత పద్మశ్రీ డాక్టర్ ఎస్‌వీ ఆదినారాయణరావు సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, ఒక వ్యక్తి చేసిన దానం నేడు అనేకమందికి ఉపయోగపడే మహావృక్షంగా మారిందని మంత్రి నారా లోకేష్ అన్నారు. ఆదినారాయణరావు కుటుంబం సమాజ సేవ కోసం ఆరు ఎకరాల భూమిని కేటాయించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ భూమిలో కాలేజీ, హరేకృష్ణ మిషన్ ద్వారా మధ్యాహ్న భోజన కార్యక్రమం, వృద్ధుల సంరక్షణ కేంద్రం వంటి సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

### విలువలతో కూడిన విద్యే నిజమైన అభివృద్ధి

"సమాజంలో తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేసే పరిస్థితులు బాధాకరం. ఇటువంటి రోజుల్లో ఈ ఫౌండేషన్ ద్వారా వృద్ధులకు అత్యాధునిక కేర్ సెంటర్ నిర్మించడం అభినందనీయం. నేను మీకు చేయగలిగింది ఒకటే. పిల్లలకు అంగన్‌వాడీ స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు కేవలం విద్యను అందించడం కాకుండా విలువలు, నైతికతతో కూడిన విద్య అందించాల్సిన బాధ్యత విద్యాశాఖ మంత్రిగా నాపై ఉంది" అన్నారు.

### విలువలు లేని వికసిత్ భారత్.. వికసిత్ భారత్ కాదు

"చాగంటి కోటేశ్వరరావుకు కేబినెట్ ర్యాంక్‌తో అడ్వైజర్ బాధ్యతలు అప్పగించినా, ఆయన ప్రభుత్వం నుంచి ఎలాంటి సదుపాయాలు తీసుకోలేదు. పిల్లలకు విలువలు నేర్పే పుస్తకాలను రూపొందించి వాటిని ప్రభుత్వ పాఠశాలల్లో అందించాలని మాత్రమే ఆయన కోరారు. 'అమ్మకి చెప్పలేని పని ఏదీ చేయొద్దు' అనే చాగంటి కోటేశ్వరరావు మాట ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా ఉండాలి" అని మంత్రి లోకేష్ ఆకాంక్షించారు.

### వృద్ధులకు గౌరవంగా జీవించే అవకాశం కల్పించాలి

"వృద్ధులను గౌరవంగా చూసుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా వృద్ధులకు రూ.4,000, వికలాంగులకు రూ.6,000 పెన్షన్ అందిస్తోంది. వృద్ధులు సమాజంలో గౌరవంగా జీవించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన" అని పేర్కొన్నారు.

### దాతల సేవలకు అభినందనలు

"సేవా కార్యక్రమాలకు విరాళాలు అందించిన దాతలందరూ సమాజానికి మార్గదర్శకులు. సుమారు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో 100 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయం. పాలియేటివ్ కేర్ సెంటర్ రాష్ట్రంలోనే ప్రత్యేకమైనదిగా నిలుస్తుంది. ఇది దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే ఆదర్శంగా నిలిచేలా అందరం కలిసి పనిచేయాలి. సివిల్ సొసైటీ, ప్రభుత్వం, అధికారులు కలిసి పనిచేస్తే ఎలాంటి అద్భుతాలు సృష్టించవచ్చో ఈ ప్రాంగణం ఒక చక్కటి ఉదాహరణ. యువత కూడా ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి" అని మంత్రి పిలుపునిచ్చారు.

### విశాఖపట్నం అభివృద్ధి మన బాధ్యత

రాష్ట్ర విభజన తర్వాత విశాఖపట్నానికి ఎంతో చేయాల్సిన బాధ్యత మనపై ఉంది. విశాఖ ఎకనామిక్ రీజియన్ దేశంలోనే తొలి వన్ ట్రిలియన్ డాలర్ల ఎకనామిక్ రీజియన్‌గా మారుతుందని

- (మిగతా వివరాలు 9లో)










చైతన్యరథం



## ఒక్క వ్యక్తి చేసిన దానం..

# నేడు వేలమందికి నీడనిచ్చే మహావృక్షం

*(8వ పేజీ తరువాయి)*

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో విశాఖపట్నం అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని అన్నారు.

### డేటా సెంటర్ల విషయంలో అపోహలు వద్దు

"ప్రజల ప్రయోజనాలకు, ప్రకృతి ప్రయోజనాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమం చేపట్టదు. అభివృద్ధి వేగంగా జరుగుతున్నప్పుడు వచ్చే అపోహలను తొలగించి ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది. డేటా సెంటర్ల విషయంలో కూడా కొన్ని అపోహలున్నాయి. నేను వ్యక్తిగతంగా ఇంటెల్ డేటా సెంటర్‌ను పరిశీలించాను. విశాఖలో ఏర్పాటు కానున్న డేటా సెంటర్ల విషయంలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తాం. నీటి వినియోగాన్ని తగ్గించే ఎయిర్ కూలింగ్ వంటి సాంకేతికతలకు ప్రాధాన్యం ఇస్తాం" అని లోకేష్ వివరించారు.

### దేశంలో విశాఖను నంబర్ వన్ సిటీగా నిలబెడతాం

"విశాఖపట్నం వేగంగా రూపాంతరం చెందుతోంది. ఏఐజీ హాస్పిటల్‌కు శంకుస్థాపన చేసుకున్నాం. రెండేళ్లలో 650 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తవుతుంది. హైదరాబాద్‌ను చంద్రబాబు అభివృద్ధి చేసిన విధంగా విశాఖపట్నం అభివృద్ధిలో కూడా ఒక కొత్త బెంచ్‌మార్క్ సృష్టించబోతున్నాం. విశాఖపట్నం నంబర్ వన్‌గా ఉండాలి. దేశంలోని మోడల్ సిటీల్లో ఒకటిగా విశాఖను అభివృద్ధి చేస్తాం" అని స్పష్టం చేశారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం చాలా ముఖ్యమని, ప్రభుత్వం ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని మంత్రి లోకేష్ అన్నారు. ప్రభుత్వం అన్ని విషయాల్లో పర్ఫెక్ట్ అని చెప్పడం లేదని, ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని అవసరమైన చోట సరిదిద్దుకుంటూ ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీ ఎం శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, విష్ణు కుమార్ రాజు, ఫ్రీ పోలియో సర్జికల్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ ఛైర్మన్ రొక్కమ్ శశి ప్రభ, విశాఖ హరే కృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షులు నిస్కించన భక్త దాస, ఫౌండేషన్ బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


























## సీఎం చంద్రబాబు వెలిగొండ టూర్ సైడ్ లైట్స్:

ఉత్సాహంగా, ఉద్వేగంగా సాగిన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం

సంప్రదాయబద్ధంగా పంచెకట్టులో వెళ్లి కృష్ణమ్మకు స్వాగతం పలికిన సీఎం చంద్రబాబు

కృష్ణా జలాల్లో దిగి కృష్ణమ్మకు పూజలు చేసి, హారతి ఇచ్చిన ముఖ్యమంత్రి.

కృష్ణమ్మ పవిత్ర జలాలను నేతలు, అధికారులపై చల్లి సంతోషాన్ని వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు

ఫీడర్ కాలువ దగ్గర కృష్ణమ్మ ప్రవాహానికి సీఎం సాష్టాంగ నమస్కారం.

స్థానికులు, రైతులు, నిర్వాసితులతో కలిసి స్విచ్ నొక్కి గేట్లు ఎత్తిన ముఖ్యమంత్రి.

సాంప్రదాయ నృత్యాలతో కృష్ణమ్మకు స్వాగతం పలికిన గిరిజన బిడ్డలు.

వేదిక ర్యాంప్‌పై కలియతిరిగి రైతులు, ప్రజలకు అభివాదం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు.

ఆనందంతో కండువాను గాల్లో తిప్పుతూ రైతుల సంతోషంలో భాగం పంచుకున్న సీఎం.

పూలసుబ్బయ్య కుటుంబ సభ్యులకు చంద్రబాబు ఆత్మీయ పలకరింపు, సన్మానం.

ఉద్యోగులు, అధికారులు, ప్రజా ప్రతినిధులను స్వయంగా పిలిచి శిలాఫలకం వద్ద ఫోటోలు దిగిన సీఎం.

ఇరిగేషన్ మంత్రి రామానాయుడిని ప్రత్యేకంగా అభినందనందించిన చంద్రబాబు.

ఓట్లు ఆశించి కాదు... మార్పు ఆశించి పని చేస్తానంటూ చంద్రబాబు వ్యాఖ్యలు.

తదుపరి ఎన్నికల కోసం కాదు... తదుపరి తరం కోసం పని చేస్తానన్న సీఎం.

ఇప్పుడు మార్కాపురం టైం స్టార్ట్ అయ్యింతంటూ శుభాకాంక్షలు తెలిపిన సీఎం.

మార్కాపురం ఇక అన్ స్టాపబుల్... అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపు.













యర్రగొండపాలెం నియోజకవర్గం గంటవానిపల్లి సమీపంలో వెలిగొండ ఫీడర్ కెనాల్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు కృష్ణాజలాలకు జలహారతి ఇచ్చారు. నీళ్లలోకి దిగి కృష్ణమ్మకు హారతి ఇచ్చి పసుపు, కుంకుమ, చీరను సమర్పించారు. జలహారతి ఇచ్చే ప్రదేశం వద్ద గిరిజన మహిళలు, చిన్నారులు లంబాడా నృత్యం చేశారు. కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటిరవికుమార్, డీబీవీ స్వామి, ఆనం రామనారాయణరెడ్డి, కందుల దుర్గేష్, అనగాని సత్యప్రాద్, కొలుసు పార్థసారథి, ఎంపీ శ్రీనివాసరెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, జిల్లా ప్రజాప్రతినిధులు, నేతలు, అధికారులు పాల్గొన్నారు.


















# డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి.. వైద్య రంగానికే ఆదర్శం

**- స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు**

విశాఖపట్నం (చైతన్యరథం): ఏఐజీ ఆసుపత్రుల అధినేత డాక్టర్ నాగేశ్వరరెడ్డి వైద్య రంగానికే ఆదర్శంగా నిలుస్తున్నారని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. విశాఖపట్నం జిల్లా భీమిలి నియోజకవర్గం పరిధిలోని ఎండాడలో ప్రతిష్టాత్మక ఏఐజీ ఆసుపత్రి నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌తో కలిసి స్పీకర్ అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడికి ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ డి. నాగేశ్వర్ రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా స్వాగతం పలికారు.

అనంతరం ఏర్పాటు చేసిన సభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి 1994లో హైదరాబాద్‌లో ఏఐజీ ఆసుపత్రిని స్థాపించారని, ఆ తర్వాత 2018లో గచ్చిబౌలిలో అత్యాధునిక ఏఐజీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను నిర్మించి ఎన్నో లక్షల మంది ప్రజలకు విశేష వైద్య సేవలు అందిస్తున్నారని కొనియాడారు. కర్నూలు మెడికల్ కాలేజీలో వైద్య విద్యను అభ్యసించిన డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి అంతర్జాతీయ స్థాయిలో ప్రపంచ ప్రఖ్యాత గ్యాస్ట్రోఎంటరాలజీ నిపుణుడిగా పేరు తెచ్చుకుని ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. వైద్య రంగంలో ఆయన చేసిన అసమాన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం మూడు అత్యున్నత పద్మ పురస్కారాలను ప్రదానం చేసిందని, ఈ ఘనత సాధించిన ఏకైక వైద్యుడు డాక్టర్ నాగేశ్వర్ రెడ్డేనని కొనియాడారు.

కేవలం వైద్య సేవలకే పరిమితం కాకుండా ఏఐజీ సంస్థ రీసెర్చ్ రంగానికి కూడా అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని స్పీకర్ పేర్కొన్నారు. అలాగే ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి తరచూ యూట్యూబ్ వేదికగా ఆరోగ్య సూత్రాలను, చిట్కాలను ప్రజలకు ఎంతో విపులంగా వివరిస్తూ సేవలందిస్తున్నారని అభినందించారు.

గతంలో తనకు ఆరోగ్యం బాగోలేనప్పుడు స్నేహితులు, శ్రేయోభిలాషుల సలహా మేరకు తాను ఏఐజీ ఆసుపత్రిలోనే డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి వద్ద చికిత్స తీసుకున్నానని, నేటికీ వారి పర్యవేక్షణలోనే వైద్య సేవలు పొందుతున్నానని స్పీకర్ గుర్తుచేసుకున్నారు. అటువంటి విశిష్టమైన ఏఐజీ ఆసుపత్రి ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలకు అత్యున్నత వైద్య సేవలు అందించేందుకు విశాఖపట్నంలో శంకుస్థాపన జరుపుకోవడం ఎంతో శుభపరిణామమని హర్షం వ్యక్తం చేశారు. ఈ విశేష కార్యక్రమంలో పాల్గొనేందుకు తనను ఆహ్వానించినందుకు ఏఐజీ ఆసుపత్రి యాజమాన్యానికి, డాక్టర్ నాగేశ్వర్ రెడ్డికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



# వెలిగొండ ప్రారంభోత్సవం చారిత్రాత్మక ఘట్టం

**సీఎం చంద్రబాబు దూరదృష్టితో 30 ఏళ్ల కల సాకారం: మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

అమరావతి (చైతన్యరథం): వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక చారిత్రాత్మక ఘట్టమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. దాదాపు 30 ఏళ్లుగా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలు ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్ట్ కలను నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృఢ సంకల్పం, దూరదృష్టితో సాకారం చేశారని పేర్కొన్నారు.

వెలిగొండ ప్రాజెక్ట్ ఫేజ్-1ను ప్రారంభించి కృష్ణా జలాలను విడుదల చేయడం, ఫీడర్ కెనాల్ గేట్లను ఎత్తి నల్లమలసాగర్‌కు 10.7 టీఎంసీల నీటిని విడుదల చేయడం రాష్ట్ర సాగునీటి చరిత్రలో కీలక మైలురాయిగా మంత్రి అభివర్ణించారు. ప్రాజెక్ట్ పూర్తి నిల్వ సామర్థ్యం 53.85 టీఎంసీలు కాగా, వెలిగొండ ద్వారా 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. తొలి దశలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, సుమారు 4 లక్షల మందికి తాగునీరు అందనున్నాయని తెలిపారు.

ప్రాజెక్ట్ కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచిందని మంత్రి అన్నారు. కేవలం 48 రోజుల్లోనే నిర్వాసిత కుటుంబాలకు రూ.762 కోట్ల పరిహారం పంపిణీ చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్ట్ కేవలం ఒక సాగునీటి ప్రాజెక్ట్ మాత్రమే కాదని, రైతుల ఆశలు, ప్రజల ఆకాంక్షలకు ప్రతీక అని మంత్రి అన్నారు. కరువు ప్రాంతాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడం ద్వారా వ్యవసాయ రంగం బలోపేతం కావడంతో పాటు ఈ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి వెలిగొండ ప్రాజెక్ట్ దోహదపడుతుందని తెలిపారు. రైతుల సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి సీఎం చంద్రబాబు చూపుతున్న చొరవ, దూరదృష్టి రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తోందన్నారు. వెలిగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తున్న సీఎం చంద్రబాబుకి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.




# మచిలీపట్నం అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్

- **విద్య, ఉద్యోగ, ఉపాధి కేంద్రంగా మారుస్తాం**
- **స్థానిక ఎన్నికల్లో కూటమి జెండా ఎగరేయాలి**
- **ప్రతి సమస్య పరిష్కరించేలా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామన్న మంత్రి కొల్లు రవీంద్ర**



మచిలీపట్నం (చైతన్యరథం): మచిలీపట్నం నియోజకవర్గ 30 సంవత్సరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాలుగా తమ దృష్టికి వచ్చిన సమస్యలన్నీ పరిష్కరించామన్నారు. తాజా గ్రీవెన్స్‌లో 29 అర్జీలు వస్తే 21 పరిష్కరించాం. మిగిలిన వాటిని ఆయా అధికారులకు పంపించాం. ఇప్పటి వరకు 505 గ్రీవెన్సులు రాగా 413 అర్జీలు పరిష్కరించాం. మిగిలిన వాటిని కూడా త్వరలోనే పరిష్కరిస్తాం. నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట వేశాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ దాదాపు అమలు చేశామని మంత్రి తెలిపారు.

**మౌలిక సదుపాయాలకు పెద్దపీట**

మచిలీపట్నం నియోజకవర్గంలో 60 డివిజన్లు, 34 పంచాయతీలున్నాయి. కొన్ని పంచాయతీలను అర్బన్లో కలపాలనే ప్రతిపాదన కారణంగా ఎన్నికలు నిలిచిపోయాయి. అదే సమయంలో ప్రస్తుతం ఒకే మండలంగా ఉన్న గ్రామీణ ప్రాంతాన్ని రెండు మండలాలుగా విభజించాలని ప్రతిపాదనలు పంపించాం. మచిలీపట్నం మేయర్ ఎన్నికలు కూడా పూర్తి చేయాలని నిర్ణయించాం. మచిలీపట్నం మున్సిపాలిటీలో రోడ్ల నిర్మాణానికి హామ్ పథకం ద్వారా రూ.74 కోట్లు మంజూరు చేశారు. అమృత్ పథకం ద్వారా రూ.75 కోట్లు, డ్రైనేజీలకు రూ.13 కోట్లతో పనులు జరుగుతున్నాయి. ఎస్టీపీల నిర్మాణానికి మరో రూ.75 కోట్లు చొప్పున మొత్తంగా రూ.250 కోట్లు ప్రతిపాదించాం. మచిలీపట్నంలోని ప్రతి ప్రాంతానికి సిమెంటు రోడ్లు, తాగునీటి కుళాయిలు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. గ్రామీణ ప్రాంతంలో ఉపాధి హామీ, స్కీ పథకాల ద్వారా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నాం. తాళ్లపాలెం వద్ద ఒక బ్రిడ్జి, బందరుకోట - పోలాటితిప్ప - పల్లెతుమ్మలపాలెంలో రెండు బ్రిడ్జిలు నిర్మాణం జరుగుతున్నాయి. వీలైనంత త్వరగా బ్రిడ్జిలు పూర్తి చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేస్తామని చెప్పారు.

**అన్ని స్థానాల్లోనూ కూటమి జెండా ఎగరాలి**

స్థానిక సంస్థల ఎన్నికల్లో మచిలీపట్నం నియోజకవర్గంలోని అన్ని డివిజన్లు, అన్ని గ్రామ పంచాయతీల్లో కూటమి జెండా ఎగిరేలా కార్యకర్తలు చిత్తశుద్ధితో పని చేయాలి. ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామీణాభివృద్ధిని గాలికి వదిలేశారు. మచిలీపట్నంలో కనీసం ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా నాశనం చేశారు. కూటమి అధికారంలోకి రాగానే అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చాం. బందరు పోర్టు, ఫిషింగ్ హార్బర్ త్వరలోనే పూర్తి చేయబోతున్నాం. 5000 ఎకరాలతో మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తున్నాం. పోర్టు సమీపంలో షిప్ బిల్డింగ్ సంస్థ రాబోతోంది. డేటా సెంటర్ కేబుల్స్ విశాఖపట్నం - చెన్నై - హైదరాబాద్ కనెక్టివిటీ మచిలీపట్నం మీదుగా జరగబోతోంది. లిథియం సంస్థ ప్రతినిధులు కూడా మచిలీపట్నంలో పెట్టుబడి పెట్టబోతున్నారు. 300 ఎకరాల్లో ఫుడ్ పార్కు ఏర్పాటు కోసం భూములు అడిగారు. బందరును ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేయాలని సన్నాహాలు చేస్తున్నామన్నారు.

**బందరు చరిత్రను సువర్ణాక్షరాలతో లిఖిస్తాం**

మచిలీపట్నం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ రూపొందించాం. విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసి ప్రణాళికతో రాబోయే 30 సంవత్సరాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు వెళ్తున్నాం. ఒకప్పుడు ఎడ్యుకేషన్, పోర్టు ద్వారా లావాదేవీలకు కేంద్రంగా ఉన్న మచిలీపట్నం.. జగన్ రెడ్డి నిర్లక్ష్యంతో నాశనమైపోయింది. అందుకే ప్రత్యేక మైన ప్రణాళికతో అభివృద్ధిపై దృష్టి పెట్టాం. బందరులో క్రిటికల్ మినరల్ పార్కు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపించాం. కడప సమీపంలో లిథియం నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించారు. వాటిని తవ్వి తీసేందుకు భారీ పెట్టుబడితో పరిశ్రమ ఏర్పాటు కాబోతోంది. రాష్ట్ర వ్యాప్తంగా అధ్యయనం చేసి అందుబాటులో ఉన్న ఖనిజాలను వెలికి తీయడమే కాకుండా.. వేల్యూ యాడెడ్ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# అర్హులైన పేదలందరికీ ఇళ్లు



- **రాష్ట్రంలో ఇప్పటికే లక్ష ఇళ్లు మంజూరు.. మరో 4 లక్షల మంజూరుకు చర్యలు**
- **రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**
- **కోటబొమ్మాళి మండలంలో ఇళ్లస్థల పట్టాలు పంపిణీ**

కోటబొమ్మాళి (చైతన్యరథం): అర్హత కలిగిన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇల్లు మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం కోటబొమ్మాళి మండలంలోని శ్రీ కొత్తమ్మతల్లి ఆలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరి దరఖాస్తును పూర్తిస్థాయిలో పరిశీలించి, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారిని పారదర్శకంగా ఎంపిక చేసి ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ ఇల్లు లేకుండా ఉండకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు.

**రాష్ట్రంలో మరో 4 లక్షల ఇళ్ల మంజూరుకు చర్యలు**

రాష్ట్రంలో ఇప్పటికే లక్ష ఇళ్లను మంజూరు చేశామని మంత్రి తెలిపారు. మరో నాలుగు లక్షల ఇళ్లను మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణానికి కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించకుండా ఇతర అవసరాలకు మళ్లించారని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి అన్నారు. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం వెనుకడుగు వేయబోదని స్పష్టం చేశారు.

**తొలగించిన పింఛన్ల పునరుద్ధరణకు చర్యలు**

భర్తను కోల్పోయిన మహిళలకు వితంతు పింఛన్లతో పాటు, గత ప్రభుత్వ హయాంలో వివిధ కారణాలతో తొలగించబడిన అర్హులైన పింఛన్లను కూడా సెప్టెంబర్ నుంచి దశలవారీగా పునరుద్ధరించే కార్యక్రమానికి శ్రీకారం చుడతామని మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**కోటబొమ్మాళిలో 1,200 దరఖాస్తులు**

కోటబొమ్మాళి మండల పరిధిలో ఇళ్ల స్థలాలు, ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించగా సుమారు 1,200 దరఖాస్తులు అందాయని మంత్రి తెలిపారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, భూమి, కుటుంబ పరిస్థితులు, అర్హత తదితర అంశాలను నిబంధనల ప్రకారం పరిశీలించిన అనంతరం అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు.

సుమారు 50 మందికి ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ

అనంతరం కోటబొమ్మాళి మండలానికి చెందిన అర్హులైన నిరుపేద కుటుంబాలకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. కురుడు పంచాయతీ ఏరకయ్యపేట గ్రామానికి చెందిన 44 మంది, దంత గ్రామానికి చెందిన ఐదుగురు లబ్ధిదారులు కలిపి సుమారు 50 మందికి మంత్రి చేతుల మీదుగా పట్టాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరిప్రసాద్, తహశీల్దార్ సి.హెచ్.ఎన్.వి.కె. ప్రసాద్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకొత్తమ్మతల్లి ఆలయ కమిటీ చైర్మన్ గోవిందరావు, కమిటీ సభ్యులు, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్. కోదండం, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- **వారి కష్టాలు, అవసరాలు తెలుసుకోవడానికే 'ప్రజా దర్బార్'**
- **రామచంద్రపురంలో వినతులు స్వీకరించిన మంత్రి వాసంశెట్టి సుభాష్**



రామచంద్రపురం (చైతన్యరథం): ప్రజల కష్టాలు, సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి త్వరితగతిన పరిష్కారం చూపటానికి వేదికగా ప్రజా దర్బార్ ఉపయోగపడుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. సోమవారం డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, పట్టణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మొత్తం 39 అర్జీలు అందాయి. రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, రహదారుల నిర్మాణం, తాగునీటి సౌకర్యాలు, విద్యుత్ సమస్యలు, డ్రైనేజీ వ్యవస్థ, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలకు సంబంధించిన వినతులను ప్రజలు సమర్పించారు.

ప్రతి అర్జీని మంత్రి సుభాష్ స్వయంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి వద్దకే ప్రభుత్వం చేరువ కావాలన్నదే కూటమి ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. ప్రజల కష్టాలు, అవసరాలను తెలుసుకోవడానికి ప్రజా దర్బార్ వేదికగా నిలుస్తోందని, ప్రతి వినతిని బాధ్యతగా స్వీకరించి పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారులు పాల్గొన్నారు.

# తాడిగడపలో పేరుకుపోయిన చెత్త వెంటనే తొలగించాలి



**స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్**

తాడిగడప (చైతన్యరథం): కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గం తాడిగడప మున్సిపాల్టీ పరిధిలోని డంప్ యార్డ్ ప్రదేశంలో పేరుకుపోయిన చెత్త (లెగసీ వేస్ట్)ని వెంటనే తొలగించాలని అధికారులను స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆదేశించారు. తాడిగడప మున్సిపాల్టీకి చెందిన డంప్ యార్డ్ ప్రాంతాన్ని ఆయన సోమవారం సాయంత్రం సందర్శించి ఆ ప్రాంతం మొత్తాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న లెగసీ వేస్ట్ ని త్వరితగతిన తొలగించాలని మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్, ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. లెగసీ వేస్ట్ తొలగింపునకు సంబంధించి వారికి సూచనలు, సలహాలు ఇచ్చారు. దీనిని తొలగించిన తరువాత పట్టణంలో వచ్చే చెత్తని విజయవాడ జవహర్ ఆటోనగర్ ఐలా (ఆటోనగర్ ఇండస్ట్రియల్ లోకల్ అథారిటీ) వారు చూపించిన ప్రదేశానికి తరలించాలని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ ఎప్పటికప్పుడు ఐలా వారితో సంప్రదించి, వారి సమన్వయంతో చెత్తని తరలించాలని చైర్మన్ పట్టాభిరామ్ ఆదేశించారు.

## 36వ రోజూ విజయవంతంగా 'ఇంటింటికీ తెలుగుదేశం'

**- 1,56,586 ఇళ్లను సందర్శించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు**

**- మొత్తంగా 95.79 లక్షల ఇళ్లకు చేరుకున్న కార్యక్రమం**



అమరావతి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత దగ్గరగా చేర్చడం, ప్రభుత్వ పనితీరుపై ప్రజల స్పందనను నేరుగా తెలుసుకోవడం లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం – 2 ఏళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం 36వ రోజు సోమవారం కూడా రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగింది. 36వ రోజు రాష్ట్రవ్యాప్తంగా 1,56,586 ఇళ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 95.79 లక్షల ఇళ్లను సందర్శించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రతి కుటుంబాన్ని ప్రత్యక్షంగా కలుస్తూ, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వివరిస్తున్నారు. రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్యతరగతి వర్గాలకు అందుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను తెలియజేస్తున్నారు. అదే సమయంలో ప్రజల సమస్యలు, అభిప్రాయాలను నేరుగా సేకరించి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండటంతో ఈ కార్యక్రమం మరింత ఉత్సాహంగా, ప్రజా భాగస్వామ్యంతో విస్తృతంగా కొనసాగుతోంది. టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు సాధారణ ప్రజలు కూడా పెద్ద ఎత్తున భాగస్వామ్యం వహిస్తున్నారు.

## సీఎం చంద్రబాబు భగీరథ సంకల్పం..

# మూడు దశాబ్దాల 'వెలిగొండ' కల సాకారం

- రెండేళ్లలో క్లిష్టమైన పనులు పూర్తి
- సవాళ్లు, అవరోధాలను అధిగమించి నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలు
- గతంలో పూర్తి కాకుండానే జాతికి అంకితం పేరిట జగన్ డ్రామాలు
- ప్రాజెక్ట్‌ల పూర్తి.. ప్రతి ఎకరాకు నీరు ప్రభుత్వ లక్ష్యం
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



మార్కాపురం (చైతన్యరథం): వెలిగొండ ప్రాజెక్టు ఎన్నో సవాళ్లు, అవరోధాలను అధిగమించి నేడు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే వేగవంతంగా పూర్తి చేసి కృష్ణా జలాలను నల్లమల సాగర్‌కు తీసుకువచ్చామని ఆయన పేర్కొన్నారు. మార్కాపురం జిల్లా దోర్నాల మండలం గంటవాని పల్లె వద్ద పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు సాకారం కావడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషించారని తెలిపారు. 1995లో కోర్టు సమస్యలు, అనుమతులు పరిష్కారమైన అనంతరం 1996లో ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగిందని, అయితే మూడు దశాబ్దాలు గడిచినా ప్రాజెక్టు పూర్తి కాకపోవడం బాధాకరమన్నారు. 2024లో తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించి, 2026లోపు ప్రాజెక్టును పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని చెప్పారు.

ప్రాజెక్టు పనులపై ముఖ్యమంత్రి ప్రతి 15 నుంచి 20 రోజులకు ఒకసారి సమీక్షలు నిర్వహిస్తూ నిరంతరం పర్యవేక్షించారని మంత్రి తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వెలిగొండ ప్రాజెక్టుకు నిధుల కొరత లేకుండా చూడాలని ఆర్థిక శాఖకు ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నారు.

### కఠినమైన పనులను రెండేళ్లలో పూర్తి చేశాం

వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలు ప్రాంతానికి చేరేందుకు అత్యంత క్లిష్టమైన పనులను రెండేళ్లలో పూర్తి చేసినట్లు మంత్రి వివరించారు. కొల్లం వాగు వద్ద సుమారు 1.80 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగింపు చేపట్టి, అవసరమైన హైడ్రాలిక్ రెగ్యులేటర్లు, సుమారు 3,250 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రాజెక్టులో అత్యంత క్లిష్టమైన సొరంగ పనుల్లో భాగంగా 4,924 మీటర్ల సొరంగ నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేశామని చెప్పారు. సొరంగాలకు అవసరమైన లైనింగ్ పనులను కూడా వేగవంతం చేసి 6,988 మీటర్ల లైనింగ్ పనులను లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేసినట్లు తెలిపారు.

### టీబీఎం తొలగింపు

వెలిగొండ సొరంగంలో సుమారు 11.8 కిలోమీటర్ల వద్ద నిలిచిపోయిన టీబీఎంను బయటకు తీసుకురావడం అత్యంత క్లిష్టమైన సవాలుగా నిలిచిందని మంత్రి చెప్పారు. గతంలో ఐదేళ్లపాటు నిలిచిపోయిన టీబీఎంను న్యాయపరమైన సమస్యలను పరిష్కరించి, ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వంతో రెండేళ్లలోనే బయటకు తీసుకువచ్చామని తెలిపారు. సుమారు 1,900 టన్నుల బరువున్న టీబీఎంను 175 మీటర్ల మేర సొరంగం బయటకు తీసుకురావడం ద్వారా సొరంగ పనులకు మార్గం సుగమమైందని, ఫలితంగానే నేడు కృష్ణా జలాలు వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ముందుకు సాగుతున్నాయని మంత్రి వివరించారు.

### ఫీడర్ కెనాల్స్ రూ.462 కోట్లతో పునరుద్ధరణ

నల్లమల సాగర్‌కు నీటిని తరలించే ఫీడర్ కెనాల్స్ పరిస్థితి గతంలో దారుణంగా ఉండేదని మంత్రి తెలిపారు. కాల్వల్లో పెద్ద గుంతలు ఏర్పడి, వాటి ద్వారా నిర్ణీత సామర్థ్యంలో నీటిని తరలించే పరిస్థితి లేకపోయిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఫీడర్ కెనాల్స్ అభివృద్ధి, లైనింగ్ పనులకు రూ.462 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు. పనులు ప్రారంభించిన అనంతరం 5.3 కిలోమీటర్ల సీసీ వర్క్, 11 కిలోమీటర్ల లైనింగ్ పనులు పూర్తి చేశామని చెప్పారు. దీంతో నల్లమల సాగర్‌కు నీటిని సమర్థవంతంగా తరలించే పరిస్థితి ఏర్పడిందన్నారు.

### నిర్వాసితుల త్యాగాలకు కృతజ్ఞతలు

వెలిగొండ ప్రాజెక్టు కోసం తమ భూములు, ఆస్తులను త్యాగం చేసిన నిర్వాసితులకు మంత్రి నిమ్మల రామానాయుడు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వారి త్యాగాలు, సహకారం లేకుండా ఇంతటి మహత్తరమైన ప్రాజెక్టు సాకారం కావడం సాధ్యం కాదన్నారు.

వెలిగొండ ప్రాజెక్టు పూర్తితో ఈ ప్రాంత రైతులకు సాగునీటి భరోసా లభించిందన్నారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రైతుల కలను కూటమి ప్రభుత్వం సాకారం చేసిందని, రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నిమ్మల రామానాయుడు తెలిపారు.

వెలిగొండ ప్రాజెక్టు కోసం తమ భూములు, ఆస్తులను త్యాగం చేసిన నిర్వాసితుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు నిర్వాసితులకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం నిర్వాసితుల సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు.

వెలిగొండ నిర్వాసితులకు పునరావాసం, పునరావాస ప్యాకేజీ (ఆర్‌అండ్‌ఆర్) కింద సుమారు రూ.900 కోట్ల నిధులను చెల్లించినట్లు మంత్రి తెలిపారు. నిర్వాసితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ నిధులను అందించామని చెప్పారు.

నిర్వాసితుల నుంచి వచ్చిన వినతులు, ఫిర్యాదులను కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. నిర్వాసితులకు ఇప్పటికే అందించిన రూ.900 కోట్లకు అదనంగా మరో రూ.169 కోట్లను కూడా అందించేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. నిర్వాసితుల పట్ల ముఖ్యమంత్రి చూపుతున్న చిత్తశుద్ధికి వారి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

### వెలిగొండ ఘనత చంద్రబాబుదే

ముఖ్యమంత్రి చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించి జాతికి అంకితం చేయడంతో కృష్ణా జలాలు నల్లమల సాగర్‌కు చేరుతున్నాయని మంత్రి తెలిపారు. గతంలో ప్రాజెక్టుల ప్రారంభం పేరుతో కేవలం ప్రచార కార్యక్రమాలు నిర్వహించారని విమర్శించారు. అయితే నేడు వెలిగొండ ప్రాజెక్టు ద్వారా వాస్తవంగా నీరు ప్రవహిస్తూ రైతుల భూములను తడుపుతోందని పేర్కొన్నారు. మాటలతో కాదు.. నీటితోనే అభివృద్ధిని చూపిస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని మంత్రి అన్నారు.

### జలవనరులపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తి విషయంలో కూటమి ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. గత ఏడాది హంద్రీనీవా ప్రాజెక్టుకు రూ.3,850 కోట్లు ఖర్చు చేసి సుమారు 725 కిలోమీటర్ల మేర కృష్ణా జలాలను తరలించేలా పనులను ముందుకు తీసుకెళ్లినట్లు చెప్పారు.

ప్రస్తుతం వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలను తరలిస్తున్నామని తెలిపారు. గోదావరి వరద జలాలను రాష్ట్రంలోని అవసరమైన ప్రాంతాలకు తరలించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.

2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి గోదావరి జలాలను రాష్ట్రవ్యాప్తంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.

### ప్రతి ఎకరాకు నీరు..ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. రిజర్వాయర్లు, కాలువలు, ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా జలాలను తరలిస్తూ వ్యవసాయ రంగానికి భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తితో ప్రకాశం, నెల్లూరు, కడప, తదితర ప్రాంతాల్లో సాగునీరు, తాగునీటి అవసరాలకు మరింత భరోసా ఏర్పడుతుందని మంత్రి పేర్కొన్నారు.

ప్రజలకు మేలు చేసే అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని మంత్రి కోరారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతుల భూములను సస్యశ్యామలం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.

## దద్దనాల ప్రాజెక్టుకు నీరు విడుదల

*- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి స్థానిక నేతల కృతజ్ఞతలు*



బనగానపల్లె (చైతన్యరథం): మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా బనగానపల్లె పట్టణంలోని ఎస్సార్‌బీసీ కెనాల్ నుండి దద్దనాల( జుర్రేరు) ప్రాజెక్టుకు నీటిని విడుదల చేశారు. మంత్రి ఆదేశాలకు అనుగుణంగా ఎస్ఆర్బీసీ నుండి ఎత్తిపోతల పథకం మోటార్లను ఆన్‌చేసి దద్దనాల ప్రాజెక్టులోనికి నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కొండు నడిపి భూషన్న, యాగంటి దేవస్థానం చైర్మన్ బండి మౌలీశ్వర రెడ్డి, బత్తుల నారాయణ రెడ్డి, సంగు సంకేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుతో స్వయంగా మాట్లాడి ఎస్ఆర్బీసీ నుండి నీటిని విడుదల చేయించారని ఆయా నేతలు ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పడమటిపల్లెల్లో వర్షాలు లేక పంటలు ఎండిపోతున్న క్రమంలో దద్దనాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేస్తే 2000 ఎకరాలకు సాగునీరు, 15 గ్రామాలకు తాగునీటి సమస్య తీరుతుందన్నారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో ఎస్ఆర్బీసీ కాలువకు నీటిని విడుదల చేయించిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి నియోజవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుడి భాస్కర్ రెడ్డి, గోపినాథ్, జయ నాయక్, కాంతు రెడ్డి, ప్రసన్న కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కరువు ప్రాంతాలకు కృష్ణా జలాలు

- చంద్రబాబు చిత్తశుద్ధితో ఫలించిన స్వప్నం
- వెలిగొండ ప్రారంభోత్సవంలో మంత్రి రామనారాయణ రెడ్డి

మార్కాపురం (చైతన్యరథం): దశాబ్దాలుగా ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కలను సాకారం చేసిన మహానేత చంద్రబాబు నాయుడు అని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. మార్కాపురం జిల్లా దోర్నాల మండలం గంటవాని పల్లె వద్ద సోమవారం సీఎం చంద్రబాబు చేతుల మీదుగా వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం సందర్భంగా జరిగిన సభలో మంత్రి రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి.. నేడు ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేసిన ఘనత చంద్రబాబుకు దక్కిందన్నారు. కృష్ణా జలాలను నల్లమలసాగర్‌కు తరలించి కరువు నేలలను పచ్చని పంట పొలాలుగా మార్చే చారిత్రాత్మక ఘట్టం ఇది. ఆనాడు సంకల్పం.. నేడు సాకారం.. వెలిగొండ ప్రాజెక్టు రూపంలో చంద్రబాబు దార్శనికతకు నిదర్శనం. దశాబ్దాల కలను నిజం చేసి, తరతరాలకు ఉపయోగపడే జలవనరును అందించిన చంద్రబాబుకి కృతజ్ఞతలు. వెలిగొండ జలాలతో పంటలు పండాలి.. రైతుల జీవితాల్లో వెలుగులు నిండాలి.. ఇదే చంద్రబాబు సంకల్పం.



వెలిగొండ ప్రాజెక్టు పూర్తితో మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు. కడప జిల్లాల్లోని కరువు ప్రాంతాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించి సస్యశ్యామలం చేయడమే చంద్రబాబు లక్ష్యం. ఈ ప్రాంత రైతాంగం భవిష్యత్తును మార్చే జీవనాడి వెలిగొండ ప్రాజెక్టు. వెలిగొండ పూర్తి కావడంతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వ్యవసాయం, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. నిర్వాసిత కుటుంబాలకు కేవలం 48 రోజుల్లోనే పరిహారం అందించి మానవతా దృక్పథాన్ని చాటుకున్న ప్రభుత్వం ఈ కూటమి ప్రభుత్వం. ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యానికి తావులేకుండా నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి వెలిగొండను ముందుకు తీసుకెళ్లిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానిదే. రైతు సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టులే చంద్రబాబు అభివృద్ధి పాలనకు నిదర్శనమని మంత్రి రామనారాయణ రెడ్డి అన్నారు.

# చంద్రబాబు చిత్తశుద్ధికి నిదర్శనం 'వెలిగొండ'

- కరువు ప్రాంతాలకు నీరందించే అపర భగీరథుడు చంద్రన్న
- మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం (చైతన్యరథం): వెలిగొండ ప్రాజెక్ట్‌ను పూర్తిచేసి జాతికి అంకితం చేయటం సీఎం చంద్రబాబు చిత్తశుద్ధికి నిదర్శనమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నంలో సోమవారం ఆయన మాట్లాడుతూ 1996లో నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టు మళ్లీ ఈ రోజు ఆయన చేతుల మీదుగానే ప్రారంబించుకోవడం ఆనందంగా ఉందన్నారు. వెలిగొండ ప్రాజెక్టుతో కొత్తగా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందనుంది. సాగు, తాగునీటి కోసం అవస్తలు పడుతున్న ప్రాంతాలన్నీ సస్యశ్యామలం కానున్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లా తలరాతను మార్చే ప్రాజెక్టు ఈ వెలిగొండ. కరువు ప్రాంతాలకు సాగునీరు అందించే అపర భగీరథుడు చంద్రబాబు. గత పాలకులు పనులు పూర్తి చేయకుండానే ప్రారంభోత్సవాల పేరుతో ప్రజల్ని దగా చేశారు. ఐదు సంవత్సరాల జగన్ రెడ్డి పాలనలో వెలిగొండ ప్రాజెక్టు సహా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల్ని గాలికి వదిలేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక మళ్లీ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేపట్టి పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లా వరకు తాగు, సాగునీటి కష్టాలు తీర్చేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ నెల 2న ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకంలో భాగంగా పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను ఉత్తరాంధ్రలోని అనకాపల్లికి తీసుకెళుతున్నాం. ఎంతో కష్టంతో కూడుకున్న పనుల్ని కూడా చిత్తశుద్ధితో పూర్తి చేయడం చంద్రబాబుకే సాధ్యమైంది. జగన్ పాలనలో ఐదు సంవత్సరాలు సాగునీటి ప్రాజెక్టుల్ని గాలికి వదిలేశారు. నేడు అన్నీ పూర్తి చేసి అన్ని ప్రాంతాలకు సాగునీరు అందిస్తున్నాం.

**బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు**

స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు పునరుద్ధరించేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నాం. ఎన్టీఆర్ బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు ప్రారంభిస్తే.. చంద్రబాబు 34 శాతం చేశారు. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక కుట్ర పూరితంగా 24 శాతానికి తగ్గించాడు. కోర్టుల్లో సరైన వాదనలు వినిపించకుండా మోసం చేశాడు. ఫలితంగా 16,800 మందికి అవకాశాలు నాశనమయ్యాయి. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. అసెంబ్లీ ఎన్నికల్లో చర్చించి.. తీర్మానం కూడా చేశాం. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం సీట్లు కేటాయించాలని నిర్ణయించామని మంత్రి రవీంద్ర చెప్పారు.



# అప్పటి వైసీపీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అండతో భూకబ్జా

- వైసీపీ నాయకుల చెరలో పీర్ల మాన్యం భూములు
- ఎన్‌హెచ్ 716 విస్తరణలో అన్యాయం.. స్థలానికి పరిహారం ఇవ్వకుండా వేధింపులు
- రైస్ మిల్లు పేరుతో తమ్ముడి స్థలం కబ్జా.. ప్రశ్నిస్తే చంపేస్తామని బెదిరింపులు
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో బాధితుల వినతులు
- అర్జీలు స్వీకరించిన మంత్రి మండిపల్లి, ఏపీ గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు

అమరావతి (చైతన్యరథం): తన స్థలాన్ని కబ్జా చెరనుంచి విడిపించాలంటూ వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన కదిరి పెద్ద కుల్లాయిరెడ్డి విన్నవించుకున్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి జనం తరలి వచ్చారు. అర్జీదారుల నుంచి రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఏపీ గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా కదిరి పెద్ద కుల్లాయిరెడ్డి అర్జీ ఇచ్చి తమ గ్రామంలోని సర్వే నెంబర్లు 591, 592లలో తనకు 14 సెంట్ల స్థలం ఉందన్నారు. ఈ స్థలంలో కదిరి నరసింహారెడ్డి అనే వ్యక్తి దౌర్జన్యంగా ప్రవేశించి రేకుల షెడ్డు నిర్మించి ఆక్రమించుకున్నాడు. అప్పటి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సహకారంతో భయభ్రాంతులకు గురిచేసి తీవ్ర బెదిరింపులకు దిగాడు. ఈ ఆక్రమణపై గతంలో స్థానిక పోలీసులకు, జిల్లా అధికారులకు పలుమార్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేసినప్పటికీ ఎవరూ సరైన చర్యలు తీసుకోలేదు. కొంతమంది సహకారంతో అతను యథేచ్ఛగా దౌర్జన్యాలు కొనసాగిస్తున్నాడు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని అభ్యర్థించారు.

నంద్యాల మండలం కానాల గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ మస్జిద్ విజ్ఞప్తి చేస్తూ..బనగానపల్లె మండలం పలుకూరు గ్రామ పొలిమేరలోని సర్వే నంబర్ 141లో 11.20 ఎకరాల చందమామ పీర్ల మాన్యం భూములు ఉన్నాయి. పీర్ల మాన్యానికి సంబంధించి ముజవర్గంగా మేము గతంలో నిరంతరం పీర్లకు అవసరమైన సేవలు అందిస్తూ వస్తున్నాము. పీర్లకు సంబంధించిన ఈ భూములను స్థానిక వైఎస్సార్ నాయకులు అక్రమంగా స్వాధీనం చేసుకున్నారు. ఆ భూముల్లోకి మమ్ములను రానివ్వడం లేదు. దీనివల్ల పీర్లకు చేయాల్సిన సేవలు సరిగ్గా చేయలేకపోతున్నాం. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు. తగు చర్యలు తీసుకుని పీర్ల మాన్యం భూములు కాపాడాలని కోరారు.

తిరుపతి జిల్లా రేణిగుంట మండలం శ్రీనివాసపురం గ్రామానికి చెందిన శారద విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నెం. 118లోని సొంత ఇంట్లో గత 30 సంవత్సరాలుగా పన్నులు, కరెంటు బిల్లులు సక్రమంగా చెల్లిస్తూ నివాసం ఉంటున్నామని తెలిపారు. ఎన్‌హెచ్-716 నాలుగు వరుసల విస్తరణ పనుల్లో తమ నివాస గృహం పూర్తిగా పోతోంది. భూసేకరణ విభాగంలో పనిచేస్తున్న అధికారి మధ్యవర్తుల ద్వారా పరిహారం మొత్తంలో కొంత శాతం లంచంగా డిమాండ్ చేశారు. దీనిని తాము వ్యతిరేకించడంతో కక్ష పెంచుకున్నారు. తమ ఇంటికి ఆనుకుని ఉన్న ఇతరులందరికీ ఇళ్ల స్థలానికి, నిర్మాణానికి కలిపి ఒకేసారి పూర్తి నష్టపరిహారం అందించారు. కానీ, లంచం ఇవ్వలేదన్న కారణంతో తమకు కేవలం నిర్మాణానికి మాత్రమే పరిహారం ఇస్తామని, స్థలానికి ఇవ్వబోమని వేధిస్తున్నారు. పూర్తి పరిహారం ఇవ్వకుండానే రోడ్డు కాంట్రాక్టర్లు రోజూ జేసీబీలతో వచ్చి ఇల్లు కూల్చివేస్తామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన దూదేకుల చిన్న దస్తగిరి విజ్ఞప్తి



చేస్తూ..తమ తండ్రి దివంగత దూదేకుల గనిగాపల్లె దస్తగిరి తన ఆస్తిని ఇద్దరు కుమారులమైన తమకు సమానంగా పంచారని తెలిపారు. తమ అన్న దూదేకుల పెద్ద దస్తగిరి తన వాటా స్థలంలో రైస్ మిల్లు నిర్మించుకోగా, తన వాటా స్థలం ఖాళీగా ఉంది. తన అనుమతి లేకుండా ఖాళీ స్థలాన్ని రైస్ మిల్లు వాహనాలు, సామగ్రి ఉంచడానికి తమ అన్న అక్రమంగా వాడుకోవడం మొదలుపెట్టాడు. ఈ అన్యాయంపై కోర్టును ఆశ్రయించాను. కోర్టు నియమించిన రెవెన్యూ సర్వే అధికారి, న్యాయాధికారి వచ్చి స్థలాన్ని పరిశీలించి నివేదిక సమర్పించగా.. న్యాయస్థానం అన్ని ఆధారాలు పరిశీలించి తనకే అనుకూలంగా తీర్పు ఇచ్చింది. కోర్టు తీర్పును సైతం లెక్కచేయకుండా తమ అన్న దౌర్జన్యంగా స్థలాన్ని వాడుకుంటున్నాడు. వివాదం వద్దని స్థలానికి 3 గేట్లు వేసి తాళాలు వేసుకుంటే, ఆ తాళాలు పగలగొట్టి మరీ లోపలికి ప్రవేశిస్తున్నాడు. అడగడానికి వెళ్తే తనపై బెదిరింపులకు దిగుతూ లోపలికి రానివ్వడం లేదు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. దాంతో మరింత రెచ్చిపోయిన మా అన్న, వదిన నా స్థలాన్ని వారి పేరు మీద రాయాలని, బదులుగా పనికిరాని స్థలం ఇస్తామని బెదిరిస్తున్నారు. నేను ఒప్పుకోకపోవడంతో చంపేస్తామని బెదిరిస్తూ, నాకు సంబంధించిన ఇతర స్థలాల వద్దకు కూడా వచ్చి గొడవలు సృష్టిస్తున్నారు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం డి. చెర్లపల్లి గ్రామానికి చెందిన నారాయణప్ప విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలోని సర్వే నెంబర్ 156లో తమ నివాస ఇంటికి ఆనుకుని ఖాళీ స్థలం ఉందన్నారు. ఈ స్థలానికి సంబంధించి తమ తండ్రి దివంగత రామన్న పేరిట 1961 నాటి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ (డాక్యుమెంట్ నం. 1465/1961) తమ వద్ద పక్కా ఆధారంగా ఉంది. తమ స్థలానికి ఎడమవైపున నివాసముంటున్న చల్లా పిల్లన్న, చల్లా రంగయ్య, చల్లా నారాయణస్వామి, చల్లా పిల్లన్న అనే ఉమ్మడి కుటుంబీకులు తమ ఇంటి పక్కనున్న ఖాళీ స్థలాన్ని అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనిని తాము ప్రశ్నించగా తమపై దాడులకు దిగారు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన యానంరెడ్డి వెంకట శేషారత్నం విజ్ఞప్తి చేస్తూ.. తమ తండ్రికి సంబంధించిన 3.15 ఎకరాల భూమిని పంపకాలు చేయకుండా, తమ సంతకాలు లేకుండానే తమ ఆఖరి చెల్లెలు దౌర్జన్యంగా ఆమె పేరు మీదకు మార్చుకున్నట్లు ఫిర్యాదు చేశారు. తమ తల్లి కూడా బతికున్నప్పుడు ముగ్గురు కుమార్తెలకు ఆస్తిని సమానంగా పంచాలని స్పష్టంగా కోరారు. తమ అభ్యంతరాలు, అధికారుల పరిశీలన అనంతరం 11-06-2017న ఈ 3.15 ఎకరాల భూమిని వివాదాస్పద భూమిగా ఆర్డీవో నమోదు చేశారు. అయినప్పటికీ సమస్య ఇంకా పరిష్కారం కాలేదు. తగు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండలం రాయంపల్లి గ్రామానికి చెందిన వి. హనుమంతరెడ్డి విజ్ఞప్తి చేస్తూ..మచ్చుకోట గ్రామం పరిధిలోని సర్వే నెంబర్ 330లో తమకు సంబంధించిన భూమి ఉందన్నారు. దానికి ఆనుకుని ఉన్న భూమిని తాము స్థిరంగా సాగు చేస్తూ పంటలు పండిస్తున్నాము. ఆ భూమి సాగులో ఉన్నప్పటికీ, తమకు ఎలాంటి సమాచారం లేకుండా దాదాపు 3.06 ఎకరాల భూమిని "బంజరు భూమి"గా తప్పుడు రికార్డులు సృష్టించి వేరే వ్యక్తులు అక్రమంగా పట్టా చేయించుకున్నారు. ఈ అక్రమ పట్టా వల్ల తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. ఈ సమస్యపై పలుమార్లు అధికారులు ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజ గ్రామానికి చెందిన మైలా బాబూరావు విజ్ఞప్తి చేస్తూ..తమకు చిలకలూరిపేట మండలం, పసుమర్రు గ్రామంలోని సర్వే నెంబర్ 640 లో 1.00 ఎకరా భూమి ఉందన్నారు. గతంలో ఎఫ్-లైన్ దరఖాస్తు చేసుకోగా, మండల సర్వేయర్ హద్దుదారులందరి సమక్షంలో 29-08-2020న సర్వే నిర్వహించారు. తనకు 1 ఎకరా భూమి ఉన్నట్లుగా తహశీల్దార్ ఎండార్స్‌మెంట్ జారీ చేసి, పట్టాదారు పాస్ పుస్తకం అందించారు. అనంతరం ప్రభుత్వం జారీ చేసిన భూమి యాజమాన్య పత్రం ప్రకారం సర్వే నెం. 640 లో 0.81 సెంట్లు, సర్వే నెం. 640-2 లో 0.19 సెంట్లు.. మొత్తం 1.00 ఎకరా తన పేరిట స్పష్టంగా నమోదై ఉంది. అయితే, ఏపీ సర్వే, సరిహద్దుల చట్టం 1923 ప్రకారం భూమి యజమానినైన నాకు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా రీ-సర్వే నిర్వహించి, భూమి తక్కువగా ఉందంటూ సెక్షన్ 9(2) ఫారం-34 నోటీసులు జారీ చేశారు. తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ప్రకాశం జిల్లా జె. పంగులూరు మండలం జాగర్లమూడివారిపాలెం గ్రామానికి చెందిన ఉప్పుటూరి సుందరరావు విజ్ఞప్తి చేస్తూ..ముప్పవరం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 297/3లో తమ తల్లి ఉప్పుటూరి హనుమాయమ్మ వీలునామా ద్వారా తనకు 1.40 ఎకరాల భూమి సంక్రమించింది. ఈ భూమిపై 1998లోనే జాగర్లమూడిపాలెం సొసైటీలో రూ. 15,000 రుణం కూడా పొందాను. 2013లో అప్పటి డిప్యూటీ తహశీల్దార్ సహకారంతో, తన మేనల్లుడు ధూళిపాళ్ళ వెంకట ఉదయ భాస్కర్‌తో కలిసి ఆయన తండ్రి ధూళిపాళ్ళ రామాంజనేయులు తన సంతకాలు, వేలిముద్రలు ఏవీ లేకుండానే లంచాలు ఇచ్చి దొంగ పాస్ పుస్తకం పుట్టించారు. తన పేరిట ఉండాల్సిన మొత్తం 1.40 ఎకరాల భూమిని అక్రమంగా వారి పేరిట ఆన్‌లైన్ చేయించుకున్నారు. సదరు భూమి మీదుగా వెళ్లిన బెంగళూరు హైవే విస్తరణ పరిహారంలో భాగంగా వచ్చిన సుమారు రూ. 75,00,000 (రూ. 75 లక్షలు) మొత్తాన్ని తన ప్రమేయం లేకుండానే కాజేశారు. అంతేకాకుండా అక్రమ రికార్డులతో రైతు భరోసా పథకం లబ్ధిని కూడా పొందుతున్నారు. గత ఆరు నెలలుగా న్యాయం కోసం రెవెన్యూ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎలాంటి పరిష్కారం దక్కలేదు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం చౌడువాడ గ్రామానికి చెందిన లక్ష్మి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామ పరిధిలో తమ తండ్రి దివంగత పిట్టా సూరి పేరు మీద 1.42 ఎకరాల పొలం ఉందన్నారు. తమ తండ్రి మరణించిన తర్వాత రామచంద్రరావు, మోహన్ అనే వ్యక్తులు ఆ భూమిని ఆక్రమించుకున్నారు. అంతేకాకుండా ఎటువంటి హక్కులు లేకుండానే నకిలీ పత్రాలు సృష్టించి దొంగ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

వీటితో పాటు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని పలువురు కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థిక తోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

## జగన్ క్రిమినల్, విధ్వంస, అవినీతి

# క్రెడిట్ ఎవ్వరూ చోరీ చేయలేరు

### మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఎద్దేవా

- వెలిగొండ ప్రారంభోత్సవ వేళ సాక్షి పేపర్‌లో 'క్రెడిట్ చోరీ' అంటూ తప్పుడు కథనాలు దుర్మార్గం
- ఇతరులు చేసిన అభివృద్ధిని తానే చేశామని చెప్పుకోవడం జగన్‌కు అలవాటు
- వెలిగొండ ప్రాజెక్టు కోసం చంద్రబాబు హయాంలోనే రూ.3,600 కోట్లు ఖర్చు
- జగన్ ఐదేళ్లలో చేసిన ఖర్చు కేవలం రూ.840 కోట్లే
- రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వాల్లో రూ.2300 కోట్లు, రాజశేఖరరెడ్డి హయాంలో రూ.1200
- నిర్వాసితులకు కనీస పునరావాసం, నష్టపరిహారం ఇవ్వకుండా గాలికొదిలేసిన జగన్
- వైసీపీ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమా?
- విజయసాయిరెడ్డి, సజ్జల పరస్పర ఆరోపణలతో బయటపడుతున్న జగన్ నికృష్ట పాలన

అమరావతి (చైతన్యరథం): లక్షలాది ఎకరాలకు సాగునీరు, అనేక ప్రాంతాలకు తాగునీరు అందించే మహత్తరమైన వెలుగొండ ప్రాజెక్టును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తుంటే ఓర్వలేక సాక్షి పత్రిక 'వెలిగొండలో క్రెడిట్ చోరీ' అంటూ విషం చిమ్మడం దుర్మార్గమని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మండిపడ్డారు. జగన్ రెడ్డి క్రిమినల్, విధ్వంస, అవినీతి క్రెడిట్‌ను ఎవ్వరూ చోరీ చేయలేరని ఎద్దేవా చేశారు. వాస్తవాలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించడమే సాక్షి మీడియా పనిగా పెట్టుకుందని విమర్శించారు. ఒకరు చేసిన కష్టాన్ని, చేసిన పనిని మరొకరు తమ ఖాతాలో వేసుకోవడాన్నే క్రెడిట్ చోరీ అంటారని, మరి వెలిగొండ విషయంలో ఆ పని ఎవరు చేశారో ప్రజల ముందు నిజాలు ఉంచుతున్నామని మంత్రి తెలిపారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు చరిత్రను పరిశీలిస్తే ఈ ప్రాజెక్టుకు ఎవరు శంకుస్థాపన చేశారు, ఎవరి హయాంలో పనులు ముందుకు సాగాయి, ఎవరి హయాంలో పనులు నిలిచిపోయాయో ప్రజలకు స్పష్టంగా తెలుసన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే వెలిగొండ ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇచ్చి పనులు వేగవంతం చేశారని, నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టు పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి మిగిలిన పనులను పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుందని మంత్రి చెప్పారు. సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి ప్రజలకు నీరు అందించే స్థాయికి తీసుకొచ్చిన ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి, రాజకీయ దురుద్దేశంతో విమర్శలు చేయడం సాక్షి



దిగజారుడు జర్నలిజానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు అసలైన రూపకల్పన చేసి, నాంది పలికింది తెలుగుదేశం వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్టీ రామారావు. మార్కాపురం పరిసర ప్రాంతాల్లోని కరవు పీడిత 30 మండలాలకు కృష్ణా జలాలను తరలించాలనే సదుద్దేశంతో 1983లోనే జీవో నెం. 409 ద్వారా వెలుగొండ డీపీఆర్‌కు ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత 1996లో చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టును వేగంగా ముందుకు నడిపించేందుకు ప్రణాళికలు రచించారు. ఈ ప్రాజెక్టుపై ఇప్పటివరకు జరిగిన సుమారు రూ.8,000 కోట్ల ఖర్చు లెక్కలను పరిశీలిస్తే క్రెడిట్ చోరీ ఎవరిదో స్పష్టమవుతుందన్నారు. చంద్రబాబు ఆధ్వర్యంలో సుమారు రూ.3,600 కోట్లు ఖర్చు చేసి ప్రాజెక్టులో అత్యధిక శాతం పనులను ముందుకు తీసుకెళ్లారు. రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల్లో సుమారు రూ.2,300 కోట్లు వెచ్చించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో 'జలయజ్ఞం' పేరుతో రూ.1,200 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో సొరంగం పనులకు రూపాయి ఖర్చు చేయకుండా కేవలం మట్టి పనులకే వెచ్చించి దాన్ని 'ధనయజ్ఞం'గా మార్చారు. వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల కాలంలో ప్రాజెక్టుకు ఖర్చు చేసింది కేవలం రూ.840 కోట్లు మాత్రమే. మొత్తం రూ.8,000 కోట్లలో కేవలం రూ.840 కోట్లు ఖర్చు పెట్టిన జగన్మోహన్ రెడ్డి వెలిగొండను తామే పూర్తి చేశామని ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటు. ఒక మంచి కార్యక్రమం జరుగుతుంటే బురదజల్లి డైవర్ట్ చేయడమే సాక్షి పత్రిక నైజం. వెలిగొండపై చేసిన ఖర్చు, చేసిన పనులపై ఆధారాలతో సహా బహిరంగ చర్చకు మేము సిద్ధం... వైఎస్సార్‌సీపీ నాయకులకు ఆ దమ్ముందా అని మంత్రి మండిపల్లి సవాల్ విసిరారు.

**నిర్వాసితులను గాలికొదిలేసి క్రెడిట్ చోరీ అంటారా?**

ప్రాజెక్టు నిర్మాణం అంటే కేవలం కాల్వలు తవ్వడం, చెరువులు కట్టడం మాత్రమే కాదు. భూములు కోల్పోయిన నిర్వాసితులకు పునరావాసం (ఆర్ అండ్ ఆర్) కల్పించడం, పరిహారం చెల్లించడం, ఇళ్లు కట్టించి ఉపాధి చూపించడం ప్రభుత్వాల బాధ్యత. ఐదేళ్ల పాలనలో జగన్మోహన్ రెడ్డి వెలిగొండ నిర్వాసితులకు ఏం చేశారో సమాధానం చెప్పాలి. కనీస బాధ్యతలే నెరవేర్చకుండా ఇప్పుడు "క్రెడిట్ చోరీ" అనడం దొంగే దొంగ అన్నట్లుగా ఉందని మండిపడ్డారు. నేడు వెలిగొండ తొలిదశ కింద నాలుగు జిల్లాల పరిధిలోని లక్షా పదివేల ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తుంటే ఓర్వలేకపోతున్నారు. ఆ నాలుగు జిల్లాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే, తమ మండల కేంద్రాల్లోకి వచ్చి జగన్ హయాంలో వెలిగొండకు ఏం చేశారో బహిరంగ చర్చకు రావాలి. రాబోయే వందేళ్ల వరకు రైతు తలెత్తుకుని బతకాలనే లక్ష్యంతో నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టిన విజనరీ లీడర్ చంద్రబాబు నాయుడు. పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని కృష్ణాకు తీసుకొచ్చి, అక్కడి నుంచి పెన్నా వరకు తీసుకెళ్లే బృహత్తర ప్రణాళికను అమలు చేస్తున్నారు. జగన్ సొంత నియోజకవర్గమైన పులివెందులలో వేలాది ఎకరాల్లో చీనీ, అరటి, బొప్పాయి తోటలతో సస్యశ్యామలంగా ఉందంటే దానికి కారణం 2014-19 మధ్య చంద్రబాబు నాయుడు అందించిన సాగునీరే. రాయలసీమకు సంబంధించిన 110 ప్రాజెక్టులను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. 'నాడు-నేడు' పేరుతో రూ.11,000 కోట్లు కార్యకర్తలకు దోచిపెట్టారు తప్ప స్కూళ్లను బాగు చేయలేదు. ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో పనులు చేయకుండా మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరుతో కాంట్రాక్టర్లతో కలిసి ప్రజాధనాన్ని లూటీ చేశారు. కేంద్రంతో సత్సంబంధాలు ఉన్నాయని చెప్పుకుంటూ ఢిల్లీ చుట్టూ తిరిగిన జగన్.. 'జల్ జీవన్ మిషన్', 'అమృత్' పథకాల ద్వారా రాష్ట్రానికి ఏమైనా మేలు చేశారా? కనీసం మ్యాచింగ్ గ్రాంట్లు కూడా ఇవ్వలేక కేంద్ర నిధులను వృథా చేసిన అసమర్థ నాయకుడు జగన్. చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన వెంటనే జల్ జీవన్ మిషన్ పనులకు టెండర్లు పిలిచారు. రాయచోటి, పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లె, పలమనేరు, పుంగనూరు నుంచి కుప్పం వరకు ప్రతి పల్లెకూ తాగునీరు అందించే బాధ్యతను చిత్తశుద్ధితో భుజానకెత్తుకున్నారు. ఒక్క ఎకరాకు నీళ్లివ్వని, కేంద్ర నిధులు ఖర్చు చేయలేని అసమర్థ పాలన సాగించిన వైఎస్సార్‌సీపీ నాయకులకు సాగునీటి ప్రాజెక్టుల గురించి, మా ముఖ్యమంత్రి విజన్ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని మంత్రి మండిపల్లి స్పష్టం చేశారు.

**సంక్షోభంలోనూ రైతును ఆదుకుంటున్న చంద్రబాబు**

2019లో దురదృష్టవశాత్తు టీడీపీ ప్రభుత్వం రాకపోవడమే నేడు రాష్ట్రంలో ఇరిగేషన్ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభానికి ప్రధాన కారణం. ఆనాడే చంద్రబాబు నాయుడు సీఎంగా కొనసాగి ఉంటే ప్రాజెక్టులన్నీ పూర్తయి, ప్రపంచాన్ని భయపెడుతున్న 'సూపర్ ఎల్ నినో' వంటి తీవ్ర వర్షాభావ పరిస్థితులను కూడా రాష్ట్రం సమర్థంగా ఎదుర్కొనేది. గత టీడీపీ హయాంలో చేపట్టిన నీటి సంరక్షణ కార్యక్రమాల వల్లే ఈరోజు గ్రామాల్లో భూగర్భ జలాలు కొంతైనా మిగిలి ఉన్నాయి. రాయలసీమలో 1,100 నుంచి 1,200 అడుగులకు భూగర్భ జలాలు పడిపోయి కరువు విలయతాండవం చేస్తున్నా, భయపడకుండా ప్రజలకు అండగా నిలిచి కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. జలహారతి, కాల్వల అనుసంధానం ద్వారా చిన్న చిన్న వాగులు, వంకలను లింక్ చేస్తూ భూగర్భ జలాలు అడుగంటకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నాం. గతంలో చంద్రబాబు నాయుడు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా ఎస్సీ, ఎస్టీ రైతులకు 90%, బీసీ రైతులకు 50% సబ్సిడీ ఇచ్చి రాయలసీమలో మామిడి, బొప్పాయి, చీనీ తోటలు కళకళలాడేలా చేశారు. కానీ వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో డ్రిప్ ఇరిగేషన్‌ను, సబ్సిడీలను పూర్తిగా గాలికొదిలేసి రైతాంగాన్ని నిలువునా ముంచారు. జగన్ చేసిన ఆ తప్పులన్నింటినీ సరిదిద్ది మళ్లీ రాయలసీమలో ఉద్యాన రంగాన్ని గాడిన పెడుతున్నాం. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి వ్యవసాయం, హార్టికల్చర్ రంగాల్లో భారీ పెట్టుబడులు తెస్తున్నాం. త్వరలోనే రూ.లక్ష కోట్ల పెట్టుబడితో ఉమ్మడి రాయలసీమ నాలుగు జిల్లాలతో పాటు మార్కాపురం పరిధిని దేశంలోనే అతిపెద్ద 'హార్టికల్చర్ హబ్'గా తీర్చిదిద్దే బృహత్తర ప్రాజెక్టును అమలు చేయనున్నాం. కేంద్ర పథకాలను గత ప్రభుత్వంలా వెనక్కి పంపకుండా, రాష్ట్ర వాటా మ్యాచింగ్ గ్రాంట్లను సకాలంలో చెల్లిస్తూ 175 నియోజకవర్గాల్లోనూ తాగునీరు, సాగునీరు అందించే బాధ్యతను చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకుంది. ప్రభుత్వం ఏదైనా మంచి ప్రాజెక్టు ప్రారంభిస్తుంటే మీడియాలో తప్పుడు రాతలు రాయడం, బురదజల్లడం వైఎస్సార్‌సీపీకి అలవాటుగా మారిందని మంత్రి మండిపల్లి విమర్శించారు.

**మీ దోపిడీని మీ వాళ్లే వెల్లడిస్తున్నారు..**

ఒకరిపై విమర్శలు చేసే ముందు వైఎస్సార్‌సీపీ నేతలు తమ సొంత అసమర్థతను, చేసిన తప్పులను సరిదిద్దుకోవాలని మంత్రి సూచించారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో జగన్మోహన్ రెడ్డి చుట్టూ ఉన్న నాలుగు స్తంభాలు విజయసాయి రెడ్డి, సజ్జల రామకృష్ణ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు ఏకమై రాష్ట్రాన్ని, ఇసుక, మైనింగ్, లిక్కర్ వంటి సమస్త సహజ వనరులను నిలువునా దోచేశారు. ఇప్పుడు అధికారం పోయేసరికి వారిలో మొదటి వికెట్ విజయసాయి రెడ్డి రూపంలో పడిపోయింది. ఆ ముఠా అంతర్గత కుమ్ములాటల్లో వాస్తవాలు ఒక్కొక్కటిగా బట్టబయలవుతున్నాయి. తాజాగా విజయసాయి రెడ్డి స్వయంగా బయటకు వచ్చి జగన్ పాలన ఎంత నికృష్టంగా సాగిందో, సజ్జల రామకృష్ణ రెడ్డి డి-ఫాక్టో సీఎంగా రాష్ట్రాన్ని ఎలా నాశనం చేశారో చెప్పారు. దానికి సజ్జల బదులిస్తూ విజయసాయి రెడ్డికి టీటీడీ బోర్డు మెంబర్ పదవి, రాజ్యసభ సీట్లు, బ్యాంకుల సలహాదారు పదవులతో పాటు విశాఖను, ఉత్తరాంధ్ర జిల్లాలను ఏలుకోమని రాసిచ్చామని బయటపెట్టారు. రాష్ట్రాన్ని, ప్రజల ఆస్తులను పంచుకోవడానికి మీ అబ్బా జాగీరా అని ప్రశ్నిస్తున్నాం. అసెంబ్లీకి రారు. కానీ మండలికి వచ్చి ఛైర్మన్ పోడియంను ఎలా చుట్టుముట్టాలి, ప్లకార్డులు ఎలా ప్రదర్శించాలి, సభ్యులను ఎలా దూషించాలి అనే అరాచక స్క్రీన్ ప్లే మొత్తం సజ్జల డైరెక్షన్‌లోనే నడిచింది. ప్రజలు తమను మర్చిపోయారేమోనన్న భయంతోనే ఇంకా విపరీత చేష్టలకు పాల్పడుతున్నారని మంత్రి మండిపల్లి దుయ్యబట్టారు.

**స్థానిక ఎన్నికల్లో తరిమికొడతారు..**

పంచాయతీ, మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడొస్తుందా, ఈ అరాచక శక్తులను చీపుర్లతో ఎప్పుడు తరిమికొడదామా అని రాష్ట్ర మహిళలు, ప్రజలు వేచి చూస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌ల నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమం నిర్విఘ్నంగా ముందుకు సాగుతున్నాయి. జగన్ రాజకీయ చరిత్ర అయిపోయింది, ఆయన గురించి మాట్లాడాల్సిన అవసరం కూడా మాకు లేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే వైఎస్సార్‌సీపీకి సరైన సమాధానం చెప్తారు. వెలిగొండ ప్రాజెక్టును అడ్డుకుంటామంటూ వైఎస్సార్‌సీపీ నేతలు పగటివేషాలు వేస్తున్నారు. ఇప్పటికే చంద్రబాబు నాయకత్వంలో వెలిగొండ నీరు ఆ ప్రాంత భూములను తాకింది. మాట ఇచ్చిన విధంగానే గోదావరి జలాలను ఉత్తరాన వంశధార నుంచి దక్షిణాన పెన్నా వరకు అనుసంధానించే బాధ్యతను చంద్రబాబు నెరవేరుస్తారు. వైఎస్సార్‌సీపీ లాంటి ఎన్ని దుష్టశక్తులు వచ్చినా ఈ అభివృద్ధి యజ్ఞాన్ని ఆపడం ఎవరి తరమూ కాదని స్పష్టం చేశారు.

# ప్రజలను మోసం చేసిన మూర్ఖుడు జగన్

### - ఎంపీ మాగుంట ఘాటు విమర్శలు



మార్కాపురం (చైతన్యరథం): పూర్తి కాకుండానే వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేశానంటూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ రెడ్డి మోసం చేశారంటూ ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తంచేశారు. వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవ వేదికపై గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్‌పై ఎంపీ విరుచుకుపడ్డారు. జగన్ ఓ మూర్ఖుడంటూ వ్యాఖ్యానించారు. వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం జరిగిన తీరు చూస్తుంటే భావోద్వేగంతో కళ్ల వెంబడి నీళ్లు తిరుగుతున్నాయన్నారు. మార్కాపురం ప్రజలు, రైతులకు మేలు చేసేలా వెలిగొండ ప్రాజెక్టును సీఎం చంద్రబాబు పూర్తి చేశారని తెలిపారు.

చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం సాయం అందించిందని చెప్పారు. మన కులపోడని 2019 ఎన్నికల్లో ఓట్లేసి జగన్‌ను గెలిపించుకుంటే.. ప్రజలను నమ్మించి నిలువునా మోసం చేశాడు. గత ఎన్నికల ముందు పనులు పూర్తి కాకుండానే కేవలం ప్రచారం కోసం పైలాన్ ఆవిష్కరించి ప్రాజెక్టును జాతికి అంకితం చేశానంటూ డ్రామాలాడిన మూర్ఖుడు జగన్ అని విరుచుకుపడ్డారు. మార్కాపురం జిల్లా ప్రజలకు ఇంత మేలు చేసిన చంద్రబాబుకు అండగా నిలుద్దామని ఎంపీ మాగుంట పిలుపునిచ్చారు. సాధారణంగా సౌమ్యుడిగా, మితభాషిగా గుర్తింపు ఉన్న మాగుంట శ్రీనివాసులు రెడ్డి.. గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యంత తీవ్ర పదజాలంతో జగన్‌పై విరుచుకుపడ్డారు. నేరుగా ఆగ్రహం వ్యక్తం చేయడం సభలో ఉన్నవారిని ఆశ్చర్యానికి గురి చేసింది. ప్రాజెక్టు వేదికపై భావోద్వేగానికి లోనైన ఎంపీ మాగుంట.. వెలిగొండ ప్రాజెక్టు నుంచి నీళ్లు వస్తున్న దృశ్యాలు చూస్తుంటే కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయని పేర్కొన్నారు.

# కూటమి ప్రభుత్వ సంకల్పానికి సజీవ సాక్ష్యం

- **సీఎం చంద్రబాబు దూరదృష్టితో వెలిగొండ సాకారం**
- **డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**



అమరావతి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వ సంకల్పానికి సజీవ సాక్ష్యం వెలిగొండ ప్రాజెక్ట్ అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. సీఎం చంద్రబాబు దూరదృష్టితోనే నేడు వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ ప్రారంభోత్సవం జరిగిందంటూ 'ఎక్స్' వేదికగా స్పందించారు. నల్లమల కొండలను చీల్చుకుంటూ కృష్ణా జలాలు కరవు పీడిత ప్రాంతాలకు చేరనున్న ఈ చరిత్రాత్మక ఘట్టాన్ని హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు.

దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న శ్రీ పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం కావడం మార్కాపురం, ప్రకాశం, కడప, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల ప్రజలకు ఎనలేని సంతోషాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు తొలి దశ ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందనున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు సాకారం కావడానికి మూడు దశాబ్దాలుగా కృషి చేసిన ఇంజినీర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాలు, ప్రజా సంస్థలు, ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు.

వెలిగొండ ప్రాజెక్టు కోసం 7,300 మందికి పైగా తమ ఇళ్లు.. భూములు కోల్పోయి నిర్వాసితులుగా మిగిలారని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. నిర్వాసితులకు పరిహారం చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం రూ.905 కోట్లు విడుదల చేయగా.. ఇప్పటికే రూ.768 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

1996లో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని.. నేడు ఆయన నాయకత్వంలోనే తొలి దశ ప్రారంభం అవుతోందని పవన్ గుర్తుచేశారు. చంద్రబాబు దూరదృష్టి, సంకల్పం కరవు ప్రాంతాల్లో జల సిరులు పారించనుందని పేర్కొన్నారు. మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లో జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధార కింద చేపడుతున్న మెగా వాటర్ గ్రిడ్ పథకానికి వెలిగొండ ప్రధాన నీటి వనరుగా నిలవనుందని తెలిపారు. ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ సంకల్ప సాధనలోనూ ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ.. ప్రాజెక్టును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేసిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, అధికారులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# రాజకీయ బంధం కాదు... కుటుంబ అనుబంధం

- **'శాప్' మాజీ చైర్మన్ పీఆర్ మోహన్ కుటుంబానికి అండగా చంద్రబాబు**
- **వేలాది మంది కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ భరోసా**



అమరావతి (చైతన్యరథం): రాజకీయ పార్టీలకు నాయకులు అవసరం. సిద్ధాంతాలు అవసరం. ప్రజల మద్దతు అవసరం. కానీ వీటన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ జెండాను గ్రామగ్రామాన మోసేది కార్యకర్త. ఎన్నికల్లో అభ్యర్థి గెలుపు కోసం ఇంటింటికీ తిరిగేది కార్యకర్తే. ప్రతిపక్షంలో పార్టీకి అండగా నిలిచేది కార్యకర్తే. అధికారంలో ఉన్నా లేకపోయినా పార్టీని కాపాడుకునేది కార్యకర్తే. అందుకే ఏ రాజకీయ పార్టీకి అయినా కార్యకర్తే అసలైన బలం. తెలుగుదేశం పార్టీ చరిత్రను పరిశీలిస్తే కార్యకర్తల పాత్ర మరింత ప్రత్యేకంగా కనిపిస్తుంది. ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకు పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లిన లక్షలాది మంది కార్యకర్తల కష్టం, త్యాగం, నిబద్ధత టీడీపీకి బలమైన పునాదిగా నిలిచాయి. ఆ కార్యకర్తల కష్టాన్ని గుర్తించడం, వారి కుటుంబాలను కూడా తన వారిగా భావించడం చంద్రబాబు నాయకత్వంలో కనిపించే ఒక ప్రత్యేక లక్షణం. కార్యకర్త బతికున్నప్పుడు అతనికి అండగా ఉండటం ఒక బాధ్యత అయితే.. అతను లేని సమయంలోనూ అతని కుటుంబాన్ని గుర్తుంచుకోవడం ఒక ఆత్మీయత. ఈ రెండు అంశాలకు ఒక సజీవ ఉదాహరణ దివంగత పీఆర్ మోహన్ కుటుంబంతో చంద్రబాబునాయుడికి ఉన్న అనుబంధం.

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచీ నిబద్ధతతో పనిచేసిన కార్యకర్త పీఆర్ మోహన్‌కు పార్టీ ఎంత గౌరవం ఇస్తుందో ఇటీవల స్పష్టంగా కనిపించింది. ఆయన మరణించి ఆరేళ్లు గడిచినా ఆయన కుమార్తె వివాహ వేడుకకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరై ఆశీర్వదించారు. ఇది కేవలం ఒక వివాహ హాజరు కాదు. కార్యకర్తతో నాయకుడికి ఉన్న ఆత్మీయ అనుబంధానికి సజీవ నిదర్శనం. పీఆర్ మోహన్ చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలో జన్మించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే క్రియాశీల కార్యకర్తగా పనిచేశారు. ఎన్టీ రామారావుకు అత్యంత సన్నిహితుడిగా ఎదిగారు. తర్వాత చంద్రబాబునాయుడు హయాంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) చైర్మన్‌గా రెండుసార్లు బాధ్యతలు నిర్వర్తించారు. శ్రీకాళహస్తి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా కూడా పని చేశారు. చంద్రబాబు నిర్వహించిన 'వస్తున్నా మీ కోసం' పాదయాత్రలో మొదటి నుంచి చివరి వరకు వెంట ఉండి అడుగులో అడుగు వేశారు. 1983 నుంచి చివరి శ్వాస వరకు పార్టీ నిర్వహించిన ప్రతి ముఖ్య కార్యక్రమంలోనూ ఆయన పాల్గొన్నారు. ఆయన మరణించి నప్పుడు కూడా నాడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు ఆయన ఇంటికి వెళ్లి భౌతికకాయానికి నివాళులర్పించారు. ఒక కార్యకర్తకు నాయకుడు ఏ విధంగా అండగా నిలబడతాడు, కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ ఏ విధంగా అండగా నిలబడుతుంది అనడానికి పీఆర్ మోహన్ ఒక ఉదాహరణ. నిబద్ధతతో రాత్రింబవళ్లు పార్టీ కోసం అహర్నిశలూ కృషి చేసినటువంటి పీఆర్ మోహన్‌కు అండగా ఉండేలా చంద్రబాబు నాయుడు అన్ని విధాలుగా కృషి చేశారు.

### పీఆర్ మోహన్.. పార్టీకి అంకితమైన జీవితం

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పీఆర్ మోహన్ ఎన్టీఆర్‌కు, ఆ తర్వాత చంద్రబాబుకు సన్నిహితంగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేసిన గొప్ప కార్యకర్త. మహానాడు వంటి పార్టీ కార్యక్రమాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. చంద్రబాబు పాదయాత్రలోనూ ఆయన ముందుండి నడిచారు.

క్రీడా రంగంలోనూ సేవలందించి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) చైర్మన్‌గా రెండుసార్లు బాధ్యతలు చేపట్టారు. పదవి ఉన్నప్పుడు మాత్రమే పార్టీతో సంబంధం కొనసాగించిన నాయకుడు కాదు పీఆర్ మోహన్. పార్టీ కోసం, నాయకత్వం కోసం, కార్యకర్తల కోసం తన సమయాన్ని వెచ్చించిన వ్యక్తిగా ఆయన టీడీపీలో ప్రత్యేక గుర్తింపు పొందారు. అలాంటి వ్యక్తి 2021లో కన్నుమూసినప్పుడు చంద్రబాబు చూపించిన చొరవ ఆ అనుబంధానికి అద్దంపట్టింది.

### చివరి ప్రయాణంలోనూ చంద్రబాబు తోడు

కొవిడ్ కాలంలో పీఆర్ మోహన్ మరణించిన సమయంలో చంద్రబాబు ప్రతిపక్ష నేతగా శ్రీకాళహస్తి వెళ్లి మోహన్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన పాడె మోసి కుటుంబ సభ్యులకు అండగా నిలిచారు. కుటుంబ సభ్యుడిని కోల్పోయినం టూ భావోద్వేగానికి లోనయ్యారు.

### రాజకీయ బంధం కంటే ఆత్మీయ బంధం

రాజకీయాల్లో పరిచయాలు చాలానే ఉంటాయి. పదవులు ఉన్నప్పుడు పలకరింపులు ఉంటాయి. అధికారంలో ఉన్నప్పుడు నాయకుల చుట్టూ అనేకమంది ఉంటారు. కానీ పదవి, అధికారం, రాజకీయ అవసరాలకు అతీతంగా ఒక కార్యకర్త కుటుంబాన్ని గుర్తుంచుకోవడం మాత్రం ప్రత్యేకమైన విషయం. పీఆర్ మోహన్ కుటుంబం విషయంలో చంద్రబాబు వ్యవహరించిన తీరు ఇదే విషయాన్ని గుర్తు చేస్తుంది. పీఆర్ మోహన్ ఉన్నప్పుడు ఆయనతో కలిసి పనిచేశారు. మోహన్ మరణించినప్పుడు ఆయన కుటుంబానికి అండగా నిలిచారు. సంవత్సరాలు గడిచిన తర్వాత కూడా మోహన్ కుటుంబంలో జరిగిన శుభకార్యానికి స్వయంగా వెళ్లి ఆశీర్వదించారు. కార్యకర్తతో ఉన్న అనుబంధం పదవితో మొదలై పదవితో ముగిసిపోదు. ఆ అనుబంధం వ్యక్తితో మొదలై కుటుంబంతో కొనసాగుతుంది. అందుకు నిదర్శనం సీఎం చంద్రబాబు నాయుడు. కార్యకర్త కుటుంబం సంతోషంలో నాయకత్వం భాగస్వామి అయితే. కష్టంలోనూ నాయకత్వం తమ వెంట ఉంటుందనే విశ్వాసం కార్యకర్తల్లో పెరుగుతుంది. ఆ విశ్వాసమే పార్టీకి శాశ్వతమైన బలం.

### ఒక పీఆర్ మోహన్ కథ.. వేలాది మంది కార్యకర్తలకు భరోసా

పార్టీ కోసం పనిచేసే కార్యకర్తకు ఒక రోజు పదవి రావచ్చు, రాకపోవచ్చు. అతని పేరు పెద్దగా మీడియాలో కనిపించకపోవచ్చు. ఎన్నికల్లో టికెట్ కూడా రాకపోవచ్చు. కానీ పార్టీ కోసం చేసిన సేవను నాయకత్వం గుర్తుంచుకుంటుందనే నమ్మకం అతనికి ఉంటే అదే అతన్ని పార్టీతో అనుసంధానించి కొనసాగిస్తుంది. పార్టీ కోసం పనిచేసినందుకు అతను లేని సమయంలో కూడా అతని కుటుంబానికి అండగా నిలిచినప్పుడే ఆ కార్యకర్తకు నిజమైన గుర్తింపు ఇటీవల జరిగిన పీఆర్ మోహన్ కూతురు వివాహమే సజీవ సాక్ష్యం. వేలాది మంది కార్యకర్తలు తమ వ్యక్తిగత జీవితాలను పక్కన పెట్టి పార్టీ కోసం పనిచేశారు. వారి కుటుంబాలు కూడా ఆ ప్రయాణంలో భాగస్వామ్యయాయి. అలాంటి కుటుంబాలను గుర్తుంచుకోవడం ద్వారా నాయకత్వం వారికి ఇచ్చే గౌరవం మరింత బలపడుతోంది. పీఆర్ మోహన్ కుమార్తె వివాహానికి చంద్రబాబు హాజరైన ఘటన అందుకే నిదర్శనం నిన్నటి కార్యకర్తను, నేటి కుటుంబ సభ్యుడిగా గుర్తించిన సందర్భం ఇది.

రాజకీయాల్లో నాయకులు మారవచ్చు. పదవులు మారవచ్చు. ప్రభుత్వాలు మారవచ్చు. కానీ కార్యకర్తలతో ఏర్పడిన ఆత్మీయ బంధం నిలిచినప్పుడే పార్టీకి బలమైన పునాది ఉంటుంది. పీఆర్ మోహన్ కుటుంబం విషయంలో చంద్రబాబు చూపిన ఆప్యాయత ఒక సందేశాన్ని ఇస్తోంది. కార్యకర్త బతికున్నప్పుడు అతనికి అండగా ఉండటం మాత్రమే కాదు. అతను లేకపోయినా అతని కుటుంబాన్ని మర్చిపోకపోవడం... అతని సేవలను గుర్తుంచుకోవడం.. అతని కుటుంబ సంతోషాల్లో భాగస్వామి కావడం.. ఇదే నిజమైన నాయకత్వం. పీఆర్ మోహన్ కుటుంబం పట్ల చంద్రబాబు చూపిన ఆప్యాయత.. ఒక నాయకుడి రాజకీయ బంధం మాత్రమే కాదు.. కార్యకర్తతో ఏర్పడిన ఆత్మీయ బంధానికి నిదర్శనం.





# కృష్ణమ్మ ప్రవేశించే... కరవు నేల పరవశించే!

- **మార్కాపురం జిల్లా అంతటా వెలి'కొండంత' సంబరం**
- **నల్లమల సాగర్‌కు నీటి విడుదలను వీక్షించేందుకు పోటెత్తిన ప్రజానీకం**
- **మగవారితో పోటీగా మహిళలు సైతం పెద్ద ఎత్తున రాక**
- **కార్యక్రమం ముగిసినా కాల్వకట్ట పైనే రైతులు, మహిళలు**
- **కృష్ణా నీళ్లను నెత్తిన చల్లుకుని, బాటిళ్లతో పట్టుకెళ్లిన జనం**

యర్రగొండపాలెం (చైతన్యరథం): ఎన్నో ఏళ్ల నిరీక్షణకు తెరపడింది... దశాబ్దాలుగా కలగా మిగిలిన కృష్ణా జలాలు నల్లమల సాగర్‌ను తాకిన క్షణం చరిత్రలో నిలిచిపోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెలిగొండ ఫీడర్ కెనాల్ గేట్లు ఎత్తి నీటిని నల్లమల సాగర్‌కు విడుదల చేసిన ఆ తరుణం అక్కడున్న ప్రతి ఒక్కరి హృదయాన్ని కదిలించింది. ఒకవైపు పరవళ్లు తొక్కుతూ పరుగులు తీసిన కృష్ణమ్మ.. మరోవైపు ఆ దృశ్యాన్ని చూసి భావోద్వేగానికి గురైన రైతాంగం. వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1 ప్రారంభోత్సవం సందర్భంగా అక్కడ అపూర్వ దృశ్యం ఆవిష్కృతమైంది.

**హద్దుల్లేని ఆనందం... అవధుల్లేని భావోద్వేగం**

గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయగానే అక్కడి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. నీటి ప్రవాహాన్ని చూసేందుకు తరలి వచ్చిన రైతులు, ప్రజలు కృష్ణమ్మను చూస్తూ ఆనందంతో ఈలలు వేశారు. కేరింతలు కొడుతూ తమ సంతోషాన్ని వ్యక్త పరిచారు. కొందరు తమ సెల్‌ఫోన్లలో ఆ అపురూప దృశ్యాలను చిత్రీకరించగా.. మరికొందరు నీటి ప్రవాహాన్ని ఒళ్లంతా కళ్లు చేసుకుని చూస్తూ భావోద్వేగానికి గురయ్యారు. వెలిగొండ కోసం ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూసిన తమకు ఇది సాధారణ నీటి విడుదల కాదని... తమ జీవితాల్లో ఒక మలుపు అని పేర్కొన్నారు. కరువు కష్టాలను చూసిన కళ్లే ఇప్పుడు కృష్ణా జలాల పరవళ్లను చూశాయి. తమ ప్రాంతానికి నీరు వస్తుందా? అనే ఎన్నో ఏళ్ల సందేహానికి తెరపడటంతో రైతుల కళ్లలో ఆనందబాష్పాలు కనిపించాయి. అంతేకాదు కృష్ణా నీళ్లను నెత్తిన చల్లుకుని, పుణ్య జలాలుగా భావించిన ఆ ప్రాంత ప్రజలు వాటిని బాలిళ్లలో నింపుకుని వెళ్లారు.

**ఏళ్లుగా ఎదురు చూపు... కళ్ల ముందే ప్రవాహమై!**

వెలిగొండ ప్రాజెక్టు కోసం సాగిన ఎదురుచూపులు, ఆశలు అన్నీ ఇన్నీ



కావు. కాల్వగుండా నీరు విడుదల కాగానే ఈ రోజు కోసం... ఇన్నాళ్లు ఎదురు చూశాం అనే భావన ప్రతి ఒక్కరిలోనూ అక్కడ కనిపించింది. కృష్ణా జలాలు నల్లమల సాగర్‌లోకి పరుగులు తీస్తుండగా ఆ పరిసరాలు జన సందోహంతో కళకళలాడాయి. ఈలలు, కేరింతలు, ఆనందోత్సాహాల మధ్య జల ప్రవాహాన్ని ప్రజలు ఆసక్తిగా వీక్షించారు. రైతాంగానికి కొత్త ఆశలు చిగురించేలా కనిపించిన ఈ దృశ్యం... మార్కపురం జిల్లా ప్రజల మదిలో ఒక మధుర జ్ఞాపకంగా మిగిలిపోనుంది. సాధారణంగా ఒక సభ ముగియగానే వచ్చిన జనం ఇంటి బాట పడతారు. కానీ వెలిగొండ సభకు వచ్చిన జనం మాత్రం అక్కడి నుంచి వెళ్లలేక..వెళ్లలేక అయిష్టంగానే వెనక్కి తిరిగారు. నీళ్లను చూస్తూ కొందరు మురిసిపోతూ ఉండిపోయారు.

# వెలిగొండపై జగన్ క్రెడిట్ డ్రామాలు

- **రూ.10వేల కోట్ల ప్రాజెక్టులో రూ.800 కోట్లు ఖర్చు చేసి క్రెడిట్ చోరీ చేసినట్టా?**
- **రూ.5,400 కోట్లు ఖర్చు చేసిన చంద్రబాబు క్రెడిట్ చోరీ చేసినట్టా?**
- **2009లో వైఎస్‌ఆర్ చనిపోతే 75 శాతం పనులు ఆత్మ రూపంలో వచ్చి చేశాడా?**
- **రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిల కాలంలో ఏం పనులూ చేయలేదా?**
- **నీ క్రిమినల్, అవినీతి క్రెడిట్‌ని ఎవ్వరూ చోరీ చేయరు, చేయలేరు జగన్ రెడ్డి.**
- **ప్రాజెక్టు ప్రారంభించింది, పూర్తి చేసింది చంద్రబాబే**

అమరావతి (చైతన్యరథం): ఆంధ్ర రాష్ట్రంలో నూతన అధ్యాయం ఆవిష్కృతమైంది. దాదాపు 4.47 లక్షల ఎకరాలకు, 23.25 లక్షల మందికి సాగునీటిని అందించే పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ పూర్తయ్యింది. 10.4 టీఎంసీల నీటిని కొల్లం వాగు ద్వారా నల్లమల సాగర్‌కు తరలించి 1.19 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ పనులను రెండేళ్ల కాలంలో రూ.2,250 కోట్లు ఖర్చు చేసి సీఎం చంద్రబాబు పూర్తి చేశారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కలకు కృష్ణా జలాలను తరలించి జీవం పోశారు. నిర్వాసితులకు 48 రోజుల్లో రూ.768 కోట్లు అందజేశారు. 2028 నాటికి మరో రూ.1,906 కోట్లు ఖర్చు చేయబోతున్నారు. మొత్తం రూ.10,200 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టుకు చంద్రబాబు ప్రభుత్వం రూ.5,400 కోట్లు ఖర్చు చేస్తుంటే... వైఎస్‌ఆర్, వైఎస్ జగన్మోహన్ రెడ్డి 11 ఏళ్లు పాలించి కేవలం రూ.2,175 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అందులో మట్టి పనులకే వెయ్యి కోట్లు ఖర్చు చేశారు. రూ.2,175 కోట్ల ఖర్చులో హెడ్‌వర్క్స్ గానీ, లైనింగ్ పనులు కానీ, టన్నెల్ వర్క్స్ గానీ పరిపూర్ణంగా చేయలేదు. రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వాల్లో రూ.2,417 కోట్లు ఖర్చు చేశారు. 1996 మార్చి 5న సీఎంగా శంకుస్థాపన చేసిన చంద్రబాబు సరిగ్గా 30ఏళ్ల తర్వాత రైతులకు సాగునీటిని అందించారు.

**జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేసుకోవడమే అబ్బా కొడుకుల క్రెడిట్**

జలయజ్ఞం పేరుతో కేవలం మట్టి పనులు మాత్రమే చేసుకుని బిల్లులు ప్రజా ధనాన్ని దోచుకుని... రాష్ట్రంలో ఒక్కటంటే ఒక్క సాగునీటి ప్రాజెక్టును కూడా వైఎస్ రాజశేఖర్ రెడ్డి కానీ... ఐదేళ్లు పాలించిన జగన్మోహన్ రెడ్డి కానీ పూర్తి చేసింది లేదు. జలయజ్ఞం పేరుతో ప్రాజెక్టులు ప్రారంభించారని ప్రచారం తప్పితే... ఐదేళ్ల పాలనలో ఈ ప్రాజెక్టు పూర్తి చేశామని కానీ... నా తండ్రి ఈ ప్రాజెక్టును పూర్తిచేసి రైతులకు నీటిని అందించాడని కానీ చెప్పుకోలేని దుస్థితి. రైతులకు సాగునీటిని పారించేందుకు కాకుండా... తమ ప్యాలెస్‌లకు ప్రజా ధనాన్ని పారించేందుకే వైఎస్‌ఆర్ 'జలయజ్ఞం' చేపట్టారు. 11 ఏళ్ల పాటు పరిపాలన సాగించినా ఏ ప్రాంతంలో కూడా ఈ ప్రాజెక్టును ప్రారంభించి పూర్తి చేశామని చెప్పుకోలేని జగన్ రెడ్డి... నేడు ఎవరికో పుట్టిన బిడ్డను తన బిడ్డగా చెప్పుకోవడం సిగ్గుచేటు. వెలిగొండ ప్రాజెక్టుపై 54% నిధులు చంద్రబాబు ఖర్చు చేస్తే... కిరణ్‌కుమార్‌రెడ్డి, రోశయ్య ప్రభుత్వాలు 24% శాతం ఖర్చు చేశాయి. నేనే చేశాను, మా అయ్యా చేశాడు అంటున్న జగన్ అండ్ వైఎస్‌ఆర్ చేసింది కేవలం 21% నిధులు మాత్రమే. అయినా కూడా నిస్సిగ్గుగా మా నాన్న చేశాడు. నేను పూర్తి చేశానని తప్పుడు ప్రచారం చేసుకుంటూ ప్రజల్లో నవ్వులపాలవుతున్నారు.

**నీ క్రిమినల్ క్రెడిట్ చోరీ ఎవ్వరు చేయరు జగన్:**

2019-24 మధ్య కాలంలో సాగునీటి ప్రాజెక్టుకు నిధులు ఖర్చు చేయకుండా, నిర్వాసితులకు పరిహారం అందించకుండా, ఏ ఒక్క పనీ చేయకుండా నేడు క్రెడిట్ చోరీ చేసేందుకు జగన్ సిద్ధమయ్యాడు. తండ్రి శవంతో రాజకీయం, కోడి కత్తి డ్రామా, బాబాయ్‌ను చంపేసి అధికారంలోకి రావడం, తల్లి, చెల్లిని గెంటేయడం, దళితుల శవాలతో శవ రాజకీయం చేయడం జగన్ రెడ్డి క్రెడిట్. నీ క్రెడిట్ ఏంటో తెలుగు ప్రజలకు తెలుసు కాబట్టే 11 సీట్లకు పరిమితం చేశారు. ఇసుక అక్రమ సంపాదనకు అన్నమయ్య డ్యామ్ తెగిపోయి 39 మంది ప్రాణాలు తీసింది నీ క్రెడిట్. తుంగభద్ర, పులిచింతల, ఎర్రకాలువ, పించా వంటి డ్యామ్‌లు దెబ్బతిన్నా పట్టించుకోకపోవడం నీ క్రెడిట్. అధికారంలోకి రాగానే జీవో నెం.365 తెచ్చి రాష్ట్రంలో 198 ప్రాజెక్టుల పనులు రద్దు చేయడం నీ క్రెడిట్. నిర్వాసితులకు రూపాయి కూడా ఇవ్వకుండా వెలిగొండ నా ఘనతే అంటూ ప్రచారం చేసుకోవడం నీ క్రెడిట్. ఐదేళ్ల పాలనలో టన్నెల్-2లో 745 మీటర్లు బెంచింగ్, 705 మీటర్లు లైనింగ్ మాత్రమే

| కాలం | ప్రభుత్వం | ఖర్చు (కోట్ల రూపాయల్లో) | పూర్తి చేసిన కీలక పనులు |
|---|---|---|---|
| 1984 | ఎన్టీఆర్ | రూ.684 | జీఓ 306ప్రాజెక్టు ఇన్వెస్టిగేషన్ డివిజన్ ఏర్పాటునిర్మాణం |
| 1996 | చంద్రబాబు | రూ.950 (అంచనా) | రూ.138ఖర్చు, 13శాతం పనులు పూర్తి<br>శంకుస్థాపన, అటవీ, పర్యావరణ అనుమతులు సాధించారు. |
| 2004-2009 | వైఎస్ఆర్ | రూ.1,260 (అంచనా రూ.1,750) | నచ్చిన వారికి పనులు అప్పగించి రూ.1000 కోట్ల విలువైన మట్టి పనులు పూర్తి.<br>హెడ్ వర్క్స్, టన్నెల్స్ లైనింగ్ పరిహారం – ఏమీ చేయలేదు. |
| 2009-2014 | రోశయ్య కిరణ్ | రూ.2,417 | టన్నెల్-1,2 శంకుస్థాపన, కొంత తవ్వకం<br>పూర్తి స్థాయిలో లైనింగ్, నిర్వాసితుల పరిహారం ఇవ్వలేదు. |
| 2014-2019 | చంద్రబాబు | రూ.1,550 | TBM ద్వారా టన్నెల్-1 (17.5 కి.మీ.), టన్నెల్-2 (11.2 కి.మీ.) పనులు పూర్తి<br>80 శాతం పనులు పూర్తి |
| 2019-2024 | వైఎస్ జగన్ | రూ.850 | టన్నెల్-2లో 745 మీ. బెంచింగ్, 705 మీ. లైనింగ్ చేయలేదు.<br>టన్నెల్ లో TBM వదిలేశారు.<br>2.7 శాతం పనులు మాత్రమే చేశాడు.<br>రూ.140 కోట్లు బిల్లులు పెండింగ్ పెట్టాడు.<br>నిర్వాసితులకు రూపాయి కూడా ఇవ్వలేదు. |
| 2024-2026 | కూటమి ప్రభుత్వం | రూ.2,250,<br>రూ.903 (పరిహారం) | టన్నెల్-1,2 పూర్తి లైనింగ్, ఫీడర్ కెనాల్, 9.6 కి.మీ. రోడ్డు పనులు పూర్తి<br>నిర్వాసితులకు రూ.903 కోట్లు పరిహారం అందజేత.<br>1.19 లక్షల ఎకరాలకు 10.4టీఎంసీల నీరు విడుదల<br>4 లక్షల మందికి తాగునీరు |
| 2026-28 | కూటమి ప్రభుత్వం | రూ.1,906 కోట్లు వ్యయం చేయనున్నాం. | 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు.<br>30 మండలాల ప్రజలకు 23.25 లక్షల మందికి తాగునీరు |

చేసి మొత్తం నేనే చేశానంటూ టన్నెల్లు పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేసి ప్రజలను మోసం చేయడం నీ క్రెడిట్. చుక్క నీరు పారించకుండా, ఒక్క నిర్వాసితుడికి కూడా రూపాయి ఖర్చు చేయకుండా వెలిగొండ పూర్తి చేశానంటూ చెప్పుకోవడం జగన్ రెడ్డి నిజమైన క్రెడిట్.

## చంద్రబాబు... మూడు దశాబ్దాల అభివృద్ధి ప్రయాణం

# 1995 సెప్టెంబరు 1: నవయుగానికి నాంది, 31 ఏళ్ల సంస్కరణల కాంతి

2026 సెప్టెంబరు 1... నారా చంద్రబాబునాయుడు తొలిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి నేటికి 31ఏళ్లు పూర్తయ్యింది. 1995 సెప్టెంబరు 1న ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మూడు దశాబ్దాల పాలనా ప్రస్థానం ఒక స్ఫూర్తిదాయకమైన పాఠం. ఒక నాయకుడి విజయం ఆయన నిర్మించిన భవనాల్లో వుండదు. ప్రజల గుండెల్లో ఆయన చెరగని ముద్ర వేయడంలో ఉంటుంది. హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దిన విజన్ నుంచి అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా నిర్మించాలన్న సంకల్పం వరకు... సాగునీటి ప్రాజెక్టుల నుంచి పారిశ్రామిక పెట్టుబడుల వరకు... చంద్రబాబు పాలనా ఆలోచనల్లో భవిష్యత్తు అనే పదం ఎప్పుడూ కీలకంగానే నిలిచింది. మూడు దశాబ్దాలకు పైగా సాగుతున్న ఆయన పరిపాలనా ప్రయాణం కేవలం ఒక వ్యక్తి ప్రస్థానం కాదు. ఆంధ్రప్రదేశ్ రాజకీయ పరిణామాలను, అభివృద్ధి దిశగా రాష్ట్రం వేసిన అడుగులను అర్థం చేసుకునే ఒక ముఖ్యమైన అధ్యాయం. అందుకే 31 ఏళ్ల తర్వాత వెనక్కి తిరిగి చూస్తే ఎన్నో నిర్ణయాలు, ఎన్నో మైలురాళ్లు, ఎన్నో ప్రయోగాలు కళ్లముందు నిలుస్తాయి. మూడు దశాబ్దాలు గడిచినా అభివృద్ధి కోసం అన్వేషణ ఆగని నాయకుడు. మారుతున్న కాలానికి అనుగుణంగా పాలనా విధానాలను మార్చుకుంటూ ముందుకు సాగుతున్న చంద్రబాబు 31 ఏళ్ల అభివృద్ధి ప్రయాణం నేడు తెలుగు రాష్ట్రాలను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టింది. రేపటి ప్రపంచాన్ని ఈరోజే చూడటం ఆయన నైజం. 1995 సెప్టెంబరు 1... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలోను, దేశ ఆర్థిక గతి శీలతలోను ఒక సువర్ణ అధ్యాయానికి నాంది పలికిన రోజు. ఒక ప్రాంతీయ పార్టీలో కీలక పరిణామాల మధ్య బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు కేవలం ఒక ముఖ్యమంత్రిగా మాత్రమే ప్రమాణం చేయలేదు. తెలుగు జాతి భవిష్యత్తును గ్లోబల్ మ్యాప్‌పై నిలబెట్టే ఒక సరికొత్త ప్రయాణానికి శ్రీకారం చుట్టారు. సంక్షేమం, సంస్కరణలు, సాంకేతికతలను మేళవించి పాలన అంటే కేవలం ఫైళ్లు కాదు, ప్రజల జీవితాలను మార్చే శక్తి అని నిరూపించిన ఆయన ప్రస్థానం 31 వసంతాలను పూర్తి చేసుకుంది. ఆయన సుదీర్ఘ పాలనా ప్రయాణం కేవలం ఒక నాయకుడి విజయం కాదు ఒక నూతన యుగారంభానికి దర్పణం.

1995 సెప్టెంబరు 1 చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణం ఒక రాజకీయ పరిణామంగా కనిపించవచ్చు. కానీ మూడు దశాబ్దాల తర్వాత వెనక్కి తిరిగి చూస్తే అది కేవలం ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం రోజు కాదు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఆలోచనా విధానంలో నూతన మలుపుతిప్పిన రోజు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో 1995-2004 మధ్య ఆయన తొమ్మిదేళ్ల పాలన ఒక దీర్ఘ రాజకీయ అధ్యాయంగా నిలిచింది. అభివృద్ధికి సాంకేతికతను అనుసంధానం చేయడం, ప్రభుత్వ వ్యవస్థలో కంప్యూటరీకరణకు ప్రాధాన్యం ఇవ్వడం, పెట్టుబడులను ఆకర్షించడం వంటి అంశాల్లో ఆయన తీసుకున్న నిర్ణయాలు అప్పట్లోనే దేశవ్యాప్తంగా చర్చకు వచ్చాయి. మైక్రోసాఫ్ట్ నుంచి హైటెక్ సిటీ వరకు, ఫైళ్ల నుంచి ఈ-గవర్నెన్స్ వరకు, సంక్షేమం నుంచి మహిళా సాధికారత వరకు ఆయన ప్రతి అడుగూ ఒక చారిత్రక మైలురాళ్లే. రాజకీయ తుఫానులను, ఎన్నో సవాళ్లను ఎదుర్కొం టూ విజన్ 2020 నుంచి నేటి స్వర్ణాంధ్రప్రదేశ్-2047 కలల సాకార ప్రయాణం వరకు ఆయన సాగిస్తున్న ప్రస్థానం ఒక అసాధారణ సాహస యాత్ర. తెలుగు జాతి కీర్తి పతాకను ప్రపంచ వేదికపై ఎగరవేసిన ఆ దార్శనిక నేత పాలన సువర్ణ అధ్యాయం. తెలుగు యువతకు ప్రపంచ ఉద్యోగ అవకాశాలను సృష్టించిన దార్శనికత ఆయనది. విద్యుత్ రంగ సంస్కరణలు, సింగిల్ విండో విధానం, మౌలిక వసతుల కల్పనతో రాష్ట్రాన్ని పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చడం. అలసిపోని యోధుడు, వయసు, ఓటములు, విజయాలతో సంబంధం లేకుండా ప్రజా క్షేత్రంలో నిత్యం శ్రమించే అంకితభావం, పట్టుదల ఆయన్ను నేటికీ యువతకు ఆదర్శంగా నిలబెట్టాయి. వయసుతో



సంబంధం లేకుండా రోజుకు 16-18 గంటలు పనిచేయడం, మారుతున్న కాలానికి అనుగుణంగా సరికొత్త ఆలోచనలను స్వీకరించడం ఆయన ప్రత్యేకత. సవాళ్లు ఎదురుకావచ్చు కానీ తెలుగు ప్రజల మనసుల్లో చంద్రబాబు అంటే అభివృద్ధి, ఆధునికత అనే భావన చెరగనిది. మూడు దశాబ్దాల క్రితం ఆయన వేసిన సాంకేతిక, ఆర్థిక పునాదులే నేడు తెలుగు రాష్ట్రాలను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టాయి.

చంద్రబాబు పాలన, యువత సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల గురించి...

అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్‌గా, సాంకేతిక పరిజ్ఞానం కలిగిన అరుదైన రాజకీయవేత్తగా, మారుతున్న శాస్త్ర విజ్ఞానానికి అనువుగా ఎప్పటికప్పుడు తనను తాను తీర్చిదిద్దుకునే నిత్య విద్యార్థిగా పిలువబడే చంద్రబాబు యువత భవితకు భరోసా ఇవ్వగలిగిన ఏకైక నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన 1995లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే నాటికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 37 ఇంజనీరింగ్ కాలేజీల్లో 10,455 సీట్లు ఉండేవి. 2004 నాటికి 225 ఇంజనీరింగ్ కళాశాలల్లో 62,750 సీట్లు విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయి. అంతే కాదు ఎన్టీఆర్ హయాంలో ఎంసెట్ విధానాన్ని ప్రవేశపెడితే... చంద్రబాబు హయాంలో ఎంసెట్ ఆన్‌లైన్ కౌన్సిలింగ్ విధానం అమలులోకి వచ్చింది. ఆయన కృషి ఫలితంగా దేశంలోనే మొదటి ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంస్థ రాష్ట్రంలో ఏర్పాటైంది. వైద్య విద్యలో కూడా 1,180 సీట్ల నుంచి 21 కాలేజీల్లో 2,650 సీట్లు అందుబాటులో ఉండేలా చేసి విద్యార్థులకు విద్యావకాశాలను పెంచారు చంద్రబాబు. 1999లో అనంతపురంలో కొత్తగా ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేశారు. పీజీ సీట్లను కూడా 696 నుంచి 1,170కి పెంచారు. విజన్-2020 స్ఫూర్తితో ఉన్నత విద్యలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని పెంచారు. ఇంటర్మీడియట్ విద్యలోనూ 906 ప్రైవేటు జూనియర్ కాలేజీలను కొత్తగా అనుమతించారు. 362 ప్రభుత్వ జూనియర్ కాలేజీలను ప్రారంభించారు. ఎంసెట్ కోచింగ్‌ను జూనియర్ కాలేజీల టైంటేబుల్‌లో అంతర్భాగం చేశారు. చంద్రబాబు పాలన అనగానే యువత చెప్పుకునేది సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల గురించి. కలలో కూడా ఊహించనట్టుగా లక్షల్లో జీతాలిచ్చే ఉద్యోగాలు యువత సొంతం అయ్యాయంటే అది చంద్రబాబు కృషి ఫలితమే. అంతలా యువత ప్రతిభకు పట్టంకట్టే రోజులను తెచ్చింది చంద్రబాబు. ప్రపంచవ్యాప్తంగా ఈరోజు అనేక దేశాల్లో తెలుగు వాళ్లు తమ సత్తా చాటుతున్నారంటే కారణం చంద్రబాబు తెచ్చిన అవకాశాలు. ఆ రోజు చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌లో సృష్టించిన ఐటీ విప్లవం మారుమూల గ్రామాల్లోని రైతు బిడ్డల్ని సైతం విదేశీ విమానాల్ని ఎక్కించింది. దేశంలో ఏ రాజకీయ నాయకుడు కూడా యువతకు ఇంతటి ఉజ్వల భవితను అందించలేదు. అది ఒకే ఒక్కడు చంద్రబాబుతోనే సాధ్యమైంది.

2002 ఆగస్టు 6న నాస్కామ్ విడుదల చేసిన గణాంకాల ఆధారంగా 2001-02 సంవత్సరానికి ఐటీ ఆధారిత సర్వీసుల ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అందుకున్న ఆదాయం రూ.690 కోట్లు. 1995-96 కాలంలో దేశంలో ఐటీ రంగానికి కేంద్రమైన బెంగళూరు ఆ ఏడాది రూ.495 కోట్ల ఐటీ ఆధారిత సర్వీసుల ఆదాయాన్ని అందుకుని ఆంధ్రప్రదేశ్ తర్వాత రెండో స్థానంలో నిలిచింది. కేవలం ఆరేళ్లలో ఆంధ్రప్రదేశ్ ఇలా అగ్రస్థానానికి ఎగబాకడం చంద్రబాబు దార్శనికత, కృషికి తోడు మన తెలుగు యువత ప్రతిభ, నైపుణ్యాల ఫలితం. చంద్రబాబునాయుడు హయాంలో హైదరాబాద్ నగరాన్ని సాఫ్ట్‌వేర్ సిటీగా మార్చడం ఒక చరిత్ర. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మైక్రోసాఫ్ట్, ఇన్ఫోటెక్, ఐబీఎం, ఒరాకిల్, మోటరోలా, సత్యం వంటి వందలాది సంస్థలు రాష్ట్రంలో కొలువై యువతకు లక్షలాది ఉద్యోగాలిచ్చాయి. ఐటీ వినియోగ క్రమంలో ఈ-సేవా కేంద్రాల ఏర్పాటు ఒక అభ్యుదయ పరిణామం. పారిశ్రామికరంగ పరంగా చూస్తే 2002లో దేశంలో అమలులో ఉన్న వివిధ ప్రాజెక్టుల్లో పెట్టుబడుల దృష్ట్యా గుజరాత్ తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందంటే దానికి కారణం చంద్రబాబు ప్రభుత్వం అమలుచేసిన సింగిల్ విండో చట్టమే. 1995-2003 మధ్య కాలంలో రూ.1,37,869 కోట్ల పెట్టుబడులతో 3,240 పరిశ్రమలు ఏపీకి వచ్చాయంటే యువతకు ఉద్యోగావకాశాలు ఏ స్థాయిలో వచ్చాయో ఊహించాలి. ఆనాడు చంద్రబాబు కాలంలో ఏడాదికో డీఎస్సీ అన్నట్టుగా ఉండేది పరిస్థితి. ఆ తొమ్మిది సంవత్సరాల పాలనా కాలంలో సుమారు లక్షన్నర టీచర్ పోస్టులను భర్తీ చేశారు. దానికి తోడు ఏపీలో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్ ఇచ్చారు చంద్రబాబు. దాంతో ఎందరో ఆడపిల్లలు ప్రభుత్వ ఉద్యోగాలు పొంది వారి కుటుంబాలకు ధీమా కలిగించారు.

ఉద్యోగాల కోసం యువత తన మీద పెట్టుకున్న నమ్మకాన్ని చంద్రబాబునాయుడు ఎప్పుడూ వమ్ము చేయలేదు. 2014లో హైదరాబాద్ లేకుండా నవ్యాంధ్ర ఏర్పడినపుడు మనకు ఐటీ ఉద్యోగాలు ఎలా? అంటూ బెంబేలుపడిన ఆంధ్రప్రదేశ్ యువతకు భరోసా ఇస్తూ తన ఐదేళ్ల పాలనలో నవ్యాంధ్ర ఐటీ టర్నోవర్‌ను పదిరెట్లు పెంచడంతో పాటు ఐటీ ఉద్యోగుల సంఖ్యను రెట్టింపు చేశారు చంద్రబాబు. 2012-13లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఐటీ పరిశ్రమ టర్నోవర్ రూ.64,354 కోట్లు. అందులో విశాఖ-తిరుపతి-కాకినాడ-విజయవాడల్లోని కంపెనీల నుంచి జరిగిన వ్యాపారం రూ.1,629 కోట్లే. అటువంటిది 2017-18లో ఆంధ్రప్రదేశ్ ఐటీ పరిశ్రమ వ్యాపారం రూ.17,500 కోట్లకు పెరిగింది. అంటే ఐదేళ్లలో నవ్యాంధ్ర ఐటీ రంగం 10రెట్లకు పైగా అభివృద్ధి సాధించింది. పరిశ్రమల విషయానికొస్తే 21 రోజుల్లో అనుమతులు ఇచ్చే సింగిల్ విండో విధానాన్ని ప్రవేశపెట్టడంతో... రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన వారికి ఏపీ స్వర్గధామంగా మారింది. దాంతో సులభతరం వాణిజ్యం ర్యాంకుల్లో నవ్యాంధ్ర ఏ ఏడాది చూసినా అగ్రస్థానాల్లోనే ఉండేది. 2014-19 మధ్య చంద్రబాబు హయాంలో పరిశ్రమల ఏర్పాటుకు చేసుకున్న ఒప్పందాల్లో 42 శాతం, పెట్టుబడుల ఒప్పందాల్లో 47 శాతం ఆచరణలోకి వచ్చాయని... మొత్తంగా యువతకు 9,56,263 ఉద్యోగాలు వచ్చాయని ప్రతిపక్షమే ధ్రు వీకరించింది. శ్రీసిటీలో పెప్సికో, ఇసుజీ, కెల్లాగ్స్, ఫాక్స్‌కాన్, హీరో, అపోలో టైర్స్ వంటి ఎన్నో ప్రతిష్టాత్మక కంపెనీలు ఆయన హయాంలో నెలకొన్నాయి. ప్రపంచ ఆటోమొబైల్ దిగ్గజం కియా మోటార్స్ ఆగమనంతో అనంతపురం జిల్లా పెనుకొండ ప్రాంతం రూపురేఖలే మారిపోయాయి. 2014 నుంచి 2019 మధ్య డీఎస్సీ ద్వారా 17,589 ఉద్యోగాలను భర్తీ చేశారు. ఇవి కాకుండా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చారు. పోలీస్ రిక్రూట్మెంట్లు పూర్తి చేశారు. ఈ విధంగా చంద్రబాబు మూడు దశాబ్దాల అభివృద్ధి ప్రయాణం గురించి చెప్పాలి అంటే ఎంత చెప్పినా తరగనిది. దేశంలోనే అరుదైన నాయకుడు ఆయన.

- నీరుకొండ ప్రసాద్




# కేంద్రం బాసటతో ఏపీ సంక్షేమ బాట

## 94 కేంద్ర పథకాల సమర్థ అనుసంధానంతో రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న సీఎం చంద్రబాబు

**ఒక కేంద్ర పథకం ప్రకటితమైతే రాష్ట్రానికి ప్రయోజనం చేకూరినట్టు కాదు. ఆ పథకంలో రాష్ట్రం భాగస్వామి కావాలి. అవసరమైన రాష్ట్ర వాటాను సకాలంలో కేటాయించాలి. ప్రత్యేక బ్యాంకు ఖాతాలు నిర్వహించాలి. గతంలో విడుదలైన నిధులకు వినియోగ ధ్రువపత్రాలు సమర్పించాలి. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాజెక్టులను రూపొందించాలి. పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ తదుపరి విడత నిధులు సాధించాలి. ఈ ప్రక్రియలో ఏ ఒక్క దశ నిలిచిపోయినా కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోతాయి. చివరకు నష్టపోయేది రాష్ట్రం, ప్రజలే. 2024లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చంద్రబాబునాయుడు ఈ సమస్యను కేవలం ఆర్థిక శాఖ అంశంగా చూడలేదు. రాష్ట్రాభివృద్ధికి అందుబాటులో ఉన్న ప్రతి కేంద్ర పథకాన్నీ వినియోగించుకోవాల్సిన అవకాశంగా చూశారు. రాష్ట్ర వాటా చెల్లించాల్సి వస్తుందనే కారణంతో కేంద్ర పథకాలను వదిలేయడం తెలివైన ఆర్థిక విధానం కాదని స్పష్టం చేశారు.**

ఆర్థిక శాఖ రూపొందించిన 2025-26 కేంద్ర పథకాల ప్రొజెక్షన్‌లో అనేక కార్యక్రమాలకు 60:40, 50:50, 75:25 వంటి కేంద్ర-రాష్ట్ర వాటా విధానాలు స్పష్టంగా నమోదయ్యాయి. అందుకే ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కేంద్ర ప్రాయోజిత పథకాల పరిస్థితిని శాఖల వారీగా పరిశీలించాలని చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్ర వాటా, పెండింగ్ వినియోగ ధ్రువపత్రాలు, కేంద్ర అనుమతులు, బ్యాంకు ఖాతాలు, ప్రాజెక్టు నివేదికలు, గతంలో నిలిచిపోయిన పనులను విడివిడిగా సమీక్షించారు. ఆర్థిక శాఖను నోడల్ వ్యవస్థగా ఉపయోగిస్తూ శాఖల వారీగా అంచనాలు, త్రైమాసిక నిధుల లక్ష్యాలు రూపొందించారు. 2025 జూన్‌లో వెలువడిన వివరాల ప్రకారం... పునరుద్ధరించిన కేంద్ర పథకాల కోసం ఏడాది కాలంలో కేంద్రం నుంచి సుమారు రూ.18,500 కోట్లను సమీకరించగా వాటిని వినియోగించేందుకు రాష్ట్రం దాదాపు రూ.14వేల కోట్లను తన వాటాగా ఖర్చు చేసినట్టు ఆర్థిక మంత్రి వెల్లడించారు.

### గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు, ఉపాధి, తాగునీరు

కేంద్ర పథకాల పునరుద్ధరణ వల్ల మొదటగా కదలిక వచ్చిన రంగాల్లో గ్రామీణాభివృద్ధి ఒకటి. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన-PMGSY ద్వారా రహదారి సదుపాయం లేని గ్రామాలు, గిరిజన ప్రాంతాలు, వెనుకబడిన ఆవాసాలకు అనుసంధానంగా రోడ్లు నిర్మించే అవకాశం ఏర్పడింది. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్-RGSA ద్వారా గ్రామ పంచాయతీల పరిపాలనా సామర్థ్యం, ప్రజాప్రతినిధుల శిక్షణ, గ్రామాభివృద్ధి ప్రణాళికలు, డిజిటల్ వ్యవస్థలను బలోపేతం చేసే మార్గం తెరుచుకుంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం-MGNREGS గ్రామీణ కుటుంబాలకు పనిదినాలు కల్పించడంతో పాటు చెరువులు, కాలువలు, నీటి సంరక్షణ నిర్మాణాలు, గ్రామీణ రహదారులు, పశువుల షెడ్లు వంటి శాశ్వత ఆస్తులను సృష్టించేందుకు ఉపయోగపడింది. జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్-NRLM మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు రుణాలు, జీవనోపాధి అవకాశాలు, చిన్న వ్యాపారాలకు తోడ్పాటు అందించే వ్యవస్థగా నిలిచింది. ప్రధానమంత్రి కృషి సించాయి యోజన-వాటర్‌షెడ్ అభివృద్ధి విభాగం, జల్‌జీవన్ మిషన్, స్వచ్ఛభారత్ మిషన్-గ్రామీణ, 15వ ఆర్థిక సంఘం గ్రామీణ స్థానిక సంస్థల గ్రాంట్ల ద్వారా నీటి సంరక్షణ, ఇంటింటికీ కుళాయి నీరు, గ్రామీణ పరిశుభ్రత, చెత్త నిర్వహణ, పంచాయతీల మౌలిక వసతులకు నిధుల ప్రవాహాన్ని పునరుద్ధరించే అవకాశం కలిగింది.

ఇందిరాగాంధీ జాతీయ వృద్ధాప్య పెన్షన్, ఇందిరాగాంధీ జాతీయ వితంతు పెన్షన్, ఇందిరాగాంధీ జాతీయ దివ్యాంగుల పెన్షన్, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం వంటి సామాజిక భద్రతా కార్యక్రమాలను రాష్ట్ర పింఛను వ్యవస్థతో అనుసంధానించడం ద్వారా కేంద్ర సహాయాన్ని కూడా సమర్థంగా వినియోగించుకునే అవకాశం ఏర్పడింది. ఇక్కడ చంద్రబాబు ప్రభుత్వం చేసిన ప్రధాన పని కొత్త పేర్లు పెట్టడం కాదు. ఇప్పటికే అందుబాటులో ఉన్న కేంద్ర నిధులను రాష్ట్ర అవసరాలకు అనుసంధానించడం.



### పేద కుటుంబానికి సొంత ఇల్లు

గృహ నిర్మాణ రంగంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ, ప్రధానమంత్రి ఆవాస్ యోజన-పట్టణ, ప్రధానమంత్రి ఆవాస్ యోజన-పట్టణ 2.0 కీలకమైనవి. కేంద్ర సహాయం, రాష్ట్ర నిధులు, పట్టణ స్థానిక సంస్థల మౌలిక వసతులను కలిపితేనే పేద కుటుంబానికి అందే ఇల్లు నిజమైన ఆస్తిగా మారుతుంది. ఆర్థిక శాఖ పత్రంలో PMAY గ్రామీణ, పట్టణ పథకాలకు ప్రత్యేక కేంద్ర-రాష్ట్ర భాగస్వామ్య నమూనాలు నమోదయ్యాయి.

### రైతుకు సాగునీరు, వ్యవసాయానికి ఆధునికత

వ్యవసాయ రంగంలో హర్ ఖేత్ కో పానీ, పోలవరం సాగునీటి ప్రాజెక్టు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, పెన్నా డెల్టా వ్యవస్థ అభివృద్ధి, కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్టు వంటి కార్యక్రమాలు సాగునీటి భద్రత, కాలువల ఆధునికీకరణ, నీటి వినియోగ సామర్థ్యంతో ముడిపడి ఉన్నాయి. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన-RKVY, కృషోన్నతి యోజన, జాతీయ సహజ వ్యవసాయ మిషన్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణ, సహకార వ్యవస్థల్లో ఐటీ బలోపేతం వంటి పథకాలు వ్యవసాయ ఉత్పాదకత, విత్తనాలు, యాంత్రీకరణ, సహజ వ్యవసాయం, మార్కెటింగ్, రైతులకు రుణ సదుపాయాలపై ప్రభావం చూపగల కార్యక్రమాలు.

### పట్టణాలకు నీరు, పారిశుధ్యం, ఉపాధి

పట్టణాభివృద్ధిలో అటల్ మిషన్ ఫర్ రీజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్--AMRUT, స్మార్ట్ సిటీస్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్-పట్టణ, దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన-జాతీయ పట్టణ జీవనోపాధి మిషన్, జాతీయ నదీ పరిరక్షణ ప్రణాళిక, CITIIS, CITIIS 2.0, 15వ ఆర్థిక సంఘం పట్టణ స్థానిక సంస్థల గ్రాంట్లు, అర్బన్ ఛాలెంజ్ ఫండ్ వంటి కార్యక్రమాలు ఉన్నాయి. వీటి ద్వారా పట్టణ తాగునీటి నెట్‌వర్క్‌లు, మురుగునీటి శుద్ధి కేంద్రాలు, ఘన వ్యర్థాల నిర్వహణ, చెత్త సేకరణ, నదుల కాలుష్య నియంత్రణ, పట్టణ పేదలకు జీవనోపాధి, మహిళా సంఘాల చిన్న వ్యాపారాలు, డిజిటల్ మున్సిపల్ సేవలను అభివృద్ధి చేయవచ్చు. కేంద్ర పథకం నుంచి వచ్చిన నిధులను ఒకే నిర్మాణానికి ఖర్చు చేయడం కాకుండా, పట్టణ సమస్యకు సంపూర్ణ పరిష్కారం చూపేందుకు ఉపయోగించాలన్నది ప్రభుత్వం తీసుకున్న దిశ.

### ఆరోగ్యం రంగం బలోపేతం

ఆరోగ్య రంగంలో జాతీయ ఆరోగ్య మిషన్, ఆయుష్మాన్ భారత్-ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన, ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్-PM-ABHIM, జాతీయ ఆయుష్ మిషన్, రాష్ట్ర ఔషధ నియంత్రణ వ్యవస్థల బలోపేతం, ఆరోగ్య మానవవనరులు-వైద్య విద్య బలోపేత కార్యక్రమం వంటి పథకాలు ముఖ్యమైనవి.



### పాఠశాల నుంచి విశ్వవిద్యాలయం వరకు

విద్యా రంగంలో సమగ్ర శిక్షా, PM Schools for Rising India--PMSHRI, ప్రధానమంత్రి పోషణ శక్తి నిర్మాణ్-PM POSHAN, న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రామ్-NILP, ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్-PM-USHA వంటి కార్యక్రమాలను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా పాఠశాల మౌలిక వసతులు, ఉపాధ్యాయ శిక్షణ, డిజిటల్ విద్య, విద్యార్థుల పోషకాహారం, వయోజన అక్షరాస్యత, ఉన్నత విద్యా సంస్థల అభివృద్ధికి అవకాశం ఏర్పడింది. సమగ్ర శిక్షా ద్వారా ప్రత్యేక అవసరాల విద్యార్థుల నుంచి డిజిటల్ తరగతుల వరకు అనేక విద్యా అంశాలను ఒకే వ్యవస్థలో అమలు చేయవచ్చు. STRIVE, సంస్థాగత శిక్షణ మౌలిక వసతుల బలోపేతం-SIIT, ఐటీఐల ఆధునికీకరణ, SANKALP, స్కిల్ ఇండియా ప్రోగ్రామ్ ద్వారా పరిశ్రమల అవసరాలకు తగిన నైపుణ్య శిక్షణ, ఐటీఐల ఆధునికీకరణ, యువతకు ఉపాధి అవకాశాల అనుసంధానం సాధ్యమవుతుంది.

### ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు అవకాశాలు

సామాజిక న్యాయ రంగంలో ఎస్సీ విద్యార్థుల ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, ప్రధానమంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ యోజన-PM-AJAY, పౌరహక్కుల పరిరక్షణ-ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాల అమలు వ్యవస్థ ఉన్నాయి. గిరిజన సంక్షేమంలో ప్రత్యేకంగా బలహీన గిరిజన సమూహాల అభివృద్ధి, ఎస్టీ విద్యార్థుల ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, ప్రధానమంత్రి ఆది ఆదర్శ్ గ్రామ యోజన, PM-JANMAN, గిరిజన పరిశోధనా సంస్థలకు సహాయం, ధర్తీ ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్, గిరిజన సంక్షేమ స్వచ్ఛంద సంస్థలకు సహాయం, ప్రధానమంత్రి జనజాతీయ వికాస్ మిషన్, ఎస్టీల వెంచర్ క్యాపిటల్ ఫండ్, వన్‌ధన్ వికాస్ కేంద్రాలు, ఆర్టికల్ 275(1) అభివృద్ధి గ్రాంట్లు, రాష్ట్రాలు-కేంద్రపాలిత ప్రాంతాలకు గిరిజన పరిపాలనా సహాయం వంటి కార్యక్రమాలు ఉన్నాయి.

బీసీ విద్యార్థులకు PM-YASASVI ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, మైనారిటీ ప్రాంతాల మౌలిక అభివృద్ధికి ప్రధానమంత్రి జన వికాస్-PMJVK అందుబాటులో ఉన్నాయి. చంద్రబాబు ప్రభుత్వం ఈ పథకాలను కేవలం స్కాలర్‌షిప్ చెల్లింపులకు పరిమితం చేయకుండా విద్య, వసతి, నైపుణ్యం, స్వయం ఉపాధి, మౌలిక వసతులు, గిరిజన గ్రామాల అనుసంధానానికి ఉపయోగించుకోవాలనే దిశగా శాఖలకు లక్ష్యాలను నిర్దేశించింది.

### పశుపోషకులు, మత్స్యకారులు, సూక్ష్మ పారిశ్రామికవేత్తలకు అండ

పశుగణన-సమగ్ర నమూనా సర్వే, జాతీయ పశుసంపద మిషన్, పశుసంపద ఆరోగ్యం-వ్యాధి నియంత్రణ కార్యక్రమం, పాడి పరిశ్రమ అభివృద్ధి, పశుసంవర్ధక మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి-AHIDF, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన-PMMSY ద్వారా పశువుల ఆరోగ్యం, జాతి అభివృద్ధి, పాడి పరిశ్రమ, కోల్డ్ చైన్, చేపల ఉత్పత్తి, మత్స్యకారుల జీవనోపాధికి సహాయం పొందవచ్చు.

ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం-PMFME, ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల పథకం, ఎగుమతుల ప్రోత్సాహక మిషన్ ద్వారా చిన్న ఆహార పరిశ్రమలు, స్థానిక ఉత్పత్తుల బ్రాండింగ్, విలువ జోడింపు, మార్కెటింగ్, ఎగుమతులకు అవకాశాలు ఏర్పడతాయి. రైతు పండించిన పంటను స్థానికంగానే ప్రాసెస్ చేస్తే అదనపు విలువ రాష్ట్రంలోనే ఉంటుంది. గ్రామీణ యువతకు ఉపాధి వస్తుంది. మహిళా సంఘాలకు వ్యాపార అవకాశాలు లభిస్తాయి. చంద్రబాబు ప్రభుత్వం కేంద్ర పారిశ్రామిక పథకాలను ప్రాంతాల ప్రత్యేక ఉత్పత్తులతో అనుసంధానించాలన్న దిశగా చర్యలు చేపట్టింది.

### ఆహార భద్రత నుంచి డిజిటల్ రేషన్ వ్యవస్థ వరకు

జాతీయ ఆహార భద్రత చట్టం కింద ఆహార ధాన్యాల రాష్ట్ర అంతర్గత రవాణా-రేషన్ డీలర్ల మార్జిన్ సహాయం, SMART-PDS, ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన-PMGKAY, ప్రజా పంపిణీ వ్యవస్థలో చక్కెర సబ్సిడీ, తూనికలు-కొలతల వ్యవస్థ, ప్రమాణ ప్రయోగశాలల బలోపేతం వంటి కార్యక్రమాలు ఆహార భద్రత, రేషన్ సరఫరాలో పారదర్శకత, వినియోగదారుల రక్షణకు సంబంధించినవి.

### భద్రత, న్యాయం, పర్యావరణ పరిరక్షణ

పోలీస్ దళాల ఆధునికీకరణ, పోలీస్ మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా కమ్యూనికేషన్ వ్యవస్థలు, వాహనాలు, ఫోరెన్సిక్ సదుపాయాలు, శిక్షణ, పోలీస్ స్టేషన్ల మౌలిక వసతులను మెరుగుపరచవచ్చు. జల పర్యావరణ వ్యవస్థల పరిరక్షణ, అటవీ అగ్ని ప్రమాదాల నివారణ-నిర్వహణ, గ్రీన్ ఇండియా మిషన్-జాతీయ అటవీకరణ కార్యక్రమం, వన్యప్రాణి ఆవాసాల సమగ్ర అభివృద్ధి, ప్రాజెక్ట్ టైగర్ అండ్ ఎలిఫెంట్ వంటి పథకాలు అడవులు, సరస్సులు, వన్యప్రాణులు, పర్యావరణ సమతుల్యతకు ఉపయోగపడతాయి. న్యాయ రంగంలో న్యాయ వ్యవస్థ మౌలిక సదుపాయాలు, మహిళల భద్రత జాతీయ మిషన్-ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానాలు, న్యాయసేవలకు సంబంధించిన ఇతర కేంద్ర సహాయ కార్యక్రమాలు వేగవంతమైన న్యాయ ప్రక్రియకు తోడ్పడగలవు.




### మహిళలు, పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులకు రక్షణ

మిషన్ వాత్సల్య, సక్షమ్ అంగన్‌వాడీ అండ్ పోషణ్ 2.0, మిషన్ శక్తి-సామర్థ్య, మిషన్ శక్తి-సంబల్, అటల్ వయో అభ్యుదయ యోజన-AVYAY, మాదకద్రవ్యాల డిమాండ్ తగ్గింపు జాతీయ కార్యాచరణ ప్రణాళిక, వృద్ధుల సమగ్ర సంక్షేమ కార్యక్రమం వంటి కేంద్ర పథకాలు సమాజంలోని అత్యంత రక్షణ అవసరమైన వర్గాల కోసం రూపొందించబడ్డాయి.

94 కేంద్ర పథకాలు, కార్యక్రమాలు, గ్రాంట్ల పేర్లను చెప్పడం మాత్రమే ఈ రెండేళ్ల విజయాన్ని వివరించదు. వాటిని తిరిగి ఉపయోగించుకునేలా చేయడం చంద్రబాబు నాయకత్వంలో వచ్చిన అసలైన పరిపాలనా మార్పు.



**శశికుమార్**
**తెలుగుదేశం సైనికుడు**

చైతన్యరథం

# మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో 356 మందికి హాస్టల్ ప్రవేశాలు

●బీసీ విద్యార్థుల సంక్షేమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పెద్దపీట

●12 బీసీ వసతి గృహాల్లో 120 మంది బాలికలు, 236 మంది బాలురకు కొత్తగా అవకాశం



కోటబొమ్మాళి (చైతన్యరథం): పేద, మధ్యతరగతి బీసీ విద్యార్థుల విద్యాభ్యాసానికి మరింత ప్రోత్సాహం అందించడంతో పాటు, వారికి నాణ్యమైన వసతి, విద్యా సౌకర్యాలు అందించాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవతో టెక్కలి డివిజన్ పరిధిలోని 12 బీసీ వసతి గృహాల్లో 2026-2027 విద్యా విద్యా సంవత్సరానికి 356 మంది విద్యార్థిని, విద్యార్థులకు నూతనంగా ప్రవేశాలు కల్పించారు. సోమవారం నిమ్మాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బీసీ వసతి గృహాల అడ్వైజరీ కమిటీ చైర్మన్, రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్కలి డివిజన్ పరిధిలోని బీసీ వసతి గృహాల్లో విద్యార్థుల ప్రవేశాలపై సమీక్షించి, అర్హులైన విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు ఆమోదం తెలిపారు. ఈ నిర్ణయంతో మొత్తం 356 మంది విద్యార్థులకు హాస్టల్‌లో కొత్తగా ప్రవేశాలు లభించాయి. వీరిలో 120 మంది బాలికలు, 236 మంది బాలురు ఉన్నారు. దీంతో గ్రామీణ, పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు తమ స్వగ్రామాలకు దూరంగా చదువుకునే సమయంలో వసతి, భోజనం తదితర సౌకర్యాలు అందుబాటులోకి వచ్చి, వారి చదువుకు ఆర్థిక భారం తగ్గే అవకాశం కలుగుతుంది. విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే బలమైన పునాది అని, పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. బీసీ విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు, సురక్షితమైన వసతి, అవసరమైన మౌలిక సదుపాయాలు అందేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన వాతావరణం, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటికి తక్షణ పరిష్కారం చూపాలని సూచించారు. బీసీ విద్యార్థులకు విద్యా అవకాశాలను విస్తరించడం ద్వారా వారి ఉన్నత విద్యకు, భవిష్యత్‌లో మెరుగైన ఉపాధి అవకాశాలకు ప్రభుత్వం బాటలు వేస్తోందని పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమం, వారి ఉజ్వల భవిష్యత్తే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టెక్కలి సహాయ బీసీ సంక్షేమాధికారి, సంబంధిత బీసీ వసతి గృహాల సంక్షేమాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల్ని, మరణాల్ని రాజకీయం చేసే దుస్థితికి తాము దిగజారలేదు

●రోడ్లెక్కితేనో, ధర్నాలు చేస్తేనో ప్రభుత్వ సాయం రాలేదని తెలుసుకోండి : ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఎంపీ లావు



చిలకలూరిపేట (చైతన్యరథం): ప్రమాదాల్ని, మరణాల్ని, దుర్ఘటనల్ని రాజకీయం చేసే దుస్థితికి తాము, తమ ప్రభుత్వం దిగజారలేదని, కొందరు స్వార్థపరులు తమ స్వప్రయోజనాల కోసమే చిలకలూరిపేటలో 27వ తేదీన జరిగిన (26 అర్ధరాత్రి) రోడ్డు ప్రమాదాన్ని రాజకీయం చేశారని, వారంతా నేడు ఏం సమాధానం చెబుతారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. సోమవారం ఆయన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లాకలెక్టర్ కృతికా శుక్లా, సీపీఐ నేత ఈశ్వరయ్యలతో కలిసి పట్టణ మున్సిపల్ కౌన్సిల్ హాల్లో రోడ్డు ప్రమాద మృతుల కుటుంబసభ్యులకు ప్రభుత్వం నుంచి మంజూరైన ఆర్థిక సాయాన్ని అందచేశారు. ఒక్కోకుటుంబానికి రూ.10 లక్షల చొప్పున మృతుల కుటుంబసభ్యులకు రూ.80 లక్షల నగదు చెక్కుల్ని స్వయంగా అందించిన అనంతరం ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్, సీపీఐ నేత ఈశ్వరయ్య విలేకరులతో మాట్లాడారు. మృతుల కుటుంబాల పేదరికంపై స్పందించే ముఖ్యమంత్రి మానవతా దృక్పథంతో ఆర్థిక సాయం అందించారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు నాతోసహా, ఎంపీ లావు, ఇన్ ఛార్జ్ మంత్రి గొట్టిపాటి, అధికారులు శక్తివంచన లేకుండా కృషి చేశామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి తెలిపారు. దుర్ఘటన జరిగిన తీరు, మృతుల కుటుంబాల పేదరికం, వారి దుస్థితి చూశాక నాతో సహా, అందరం ఎంతో బాధపడ్డామన్నారు. జరిగిన దుర్ఘటనను, మరణించిన దళితులు, వారి కుటుంబాల దుస్థితిని ముఖ్యమంత్రికి తెలియచేయడంతో ఆయన మానవతా దృక్పథంతో స్పందించి, నిన్న ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం ప్రకటించారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం, మంచి, మానవత్వమున్న ముఖ్యమంత్రి ఉండబట్టే నేడు వేలూరు గ్రామ మృతుల కుటుంబాలకు న్యాయం జరిగిందని ప్రత్తిపాటి తెలిపారు.

**తమ స్వార్థ ప్రయోజనాల కోసం వైసీపీనేతలు దుర్ఘటనపై రాజకీయాలు చేశారు.**

రోడ్డు ప్రమాద దుర్ఘటనను కొందరు తమ స్వార్థ రాజకీయాల కోసం వాడుకోవడానికి ఎంతగానో తాపత్రయపడ్డారని, ఆ క్రమంలో బాధిత కుటుంబ సభ్యుల్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేశారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలు.. క్షతగాత్రులకు అందాల్సిన వైద్యసేవలతో పాటు.. మృతుల కుటుంబాల్ని ఎలా ఆదుకోవాలన్న దానిపై నేను, ఎంపీ లావు, పల్నాడు ఇన్ ఛార్జ్ మంత్రి గొట్టిపాటి దృష్టి పెడితే, ఆ స్వార్థపరులు పార్టీలు, కులాల ముసుగులో తమ రాజకీయ ప్రయోజనాలకోసం పాకులాడారని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాద బాధితులు, మృతుల కుటుంబాలకు ప్రభుత్వ సాయం అందదని తెలిసినప్పటికీ, ఈ దుర్ఘటనను యంత్రాంగం ప్రత్యేకంగా పరిగణించేలా, మృతుల కుటుంబాలకు న్యాయం చేసేందుకు నేను, ఎంపీ, మంత్రి గొట్టిపాటి అన్నిరకాలుగా ప్రయత్నించామన్నారు. తమ ప్రయత్నాల్లో తామునుంటే.. కొందరు కావాలనే తనపై, టీడీపీపై, ప్రభుత్వంపై దుష్ప్రచారం చేశారని, మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే రూ.5 లక్షలే ఇప్పిస్తున్నారని, అదీ కొందరికే ఇస్తున్నారని నానా యాగీ చేశారని ప్రత్తిపాటి తెలిపారు. బహిరంగ ఆరోపణలతో సరిపెట్టకుండా మీడియా, సోషల్ మీడియాలోనూ తప్పుడు ప్రచారం చేయించారన్నారు. టీడీపీ సానుభూతిపరులకు అందే బీమా సాయాన్ని ప్రభుత్వసాయంగా చిత్రీకరించి, వైసీపీ వారే మృతుల కుటుంబసభ్యుల్ని, స్థానిక ఎం.ఆర్.పీ.ఎస్ నాయకుల్ని తప్పుదోవ పట్టించి మాట్లాడించారని ప్రత్తిపాటి అసహనం వ్యక్తం చేశారు.

**రోడ్డుపై కూర్చుంటేనో, ధర్నా చేస్తేనో ప్రభుత్వ సాయం రాలేదని తెలుసుకోండి : ఎంపీ లావు**

రోడ్డు ప్రమాద దుర్ఘటన మృతుల కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేసిందని, ఈనాడు వారికి మేలు కలిగిందంటే దానికి ప్రధాన కారకులు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావేనని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు స్పష్టం చేశారు. జరిగిన దుర్ఘటన తమను ఇప్పటికీ బాధిస్తూనే ఉందని, నేడు మృతుల కుటుంబాలకు అందిన ప్రభుత్వసాయం ఎలా వచ్చిందో ఆలోచించుకోవాలన్నారు. కొందరు తమ స్వప్రయోజనాలకోసం మృతుల కుటుంబసభ్యుల్ని తప్పుదోవ పట్టించారని, వారి చర్యలతో తాము రోడ్డుపైకి వస్తేనో, ధర్నాలు చేస్తేనో ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనట్టు భ్రమపడవద్దని ఎంపీ లావు సూచించారు. రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు మాట్లాడారని, తమను, ప్రభుత్వాన్ని విమర్శించారని తాము ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా నిలవలేదని, మృతుల కుటుంబాలను ఆదుకోవడం తమ బాధ్యతగా భావించామని లావు స్పష్టం చేశారు. కులం, మతం, ప్రాంతమనే అంశాలకు అతీతంగా రాజకీయాలకు అతీతంగానే బాధిత కుటుంబాలకు తాము అండగా నిలిచామన్నారు.

# నూకాంబిక అమ్మవారి సేవలో ఎమ్మెల్యే కోళ్ల లలిత



శృంగవరపుకోట (చైతన్యరథం): ఎల్. కోట మండలం మల్లివీడు గ్రామంలో కొలువైన గ్రామదేవత శ్రీనూకాంబికా అమ్మవారి ఆలయ నూతన సింహద్వార ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి, సింహద్వారాన్ని ప్రారంభించారు. మల్లివీడు గ్రామానికి చెందిన రైల్వే రిటైర్డ్ జూనియర్ ఇంజనీర్ తాళబత్తుల సుదర్శనరావు, లక్ష్మి దంపతులు ప్రస్తుతం విశాఖపట్నంలో స్థిరపడ్డారు. అయినప్పటికీ తమ సొంత గ్రామం, గ్రామదేవతపై ఉన్న అపారమైన భక్తి, అభిమానంతో సుమారు రూ.6 లక్షల సొంత నిధులను వెచ్చించి ఆలయ సింహద్వారాన్ని నిర్మింపజేశారు. నిర్మాణం పూర్తి కావడంతో శాస్త్రోక్తంగా హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ... సుదర్శనరావు దంపతులు తాము స్థిరపడినప్పటికీ పుట్టిన ఊరిని మరువకుండా ఆలయ అభివృద్ధికి ముందుకు రావడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. అనంతరం దాతలైన సుదర్శనరావు, లక్ష్మి దంపతులను గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి



ఎచ్చెర్ల (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు గ్రామ ప్రజలను నేరుగా కలిసి స్త్రీ శక్తి, తల్లికి వందనం, పెరిగిన పెన్షన్లు, రైతు సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి కార్యక్రమాల ద్వారా కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని వివరించారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ... సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తూ... పారదర్శక పాలనతో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ... కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నారు. "ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రతి ఇంటికీ తీసుకెళ్లి ప్రజలకు వివరించాలి" అని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజలతో మమేకమై... ప్రజల సంక్షేమమే లక్ష్యంగా... తెలుగుదేశం పార్టీ ముందుకు! సాగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లావేరు మండల పార్టీ అధ్యక్షులు ముప్పిడి సురేష్, పీఏసీ అధ్యక్షులు కూనబిల్లి దామోదరరావు, జనరల్ సెక్రెటరీ పిన్నింటి మధుబాబు, రణస్థలం మండలం వైస్ ప్రెసిడెంట్ కలిశెట్టి సూర్యనారాయణ, టీడీపీ సీనియర్ నాయకులు ఇనుపకుర్తి తోటయ్య దొర, రాజపంతుల ప్రకాష్ రావు, లంక నారాయణరావు, వద్దేపల్లి శ్రీనివాసరావు, ఆరేళ్ల కృష్ణ, తంగుడు బియ్యపు శ్రీనివాసరావు, తంగుడు బియ్యపు మురళి, సెట్టికొమ్ము వెంకటరమణ, కిల్లారి నాగేశ్వరరావు, గొర్లె శ్రీనివాసరావు, ముళ్ళు సాయి, పండి గోపాల్ రావు, చిత్రి విజయకుమార్, మాకాన శంకర్, ఇనుపకుర్తి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# లెగసీ వేస్ట్ వెంటనే తొలగించాలి : పట్టాభిరామ్



పెనమలూరు (చైతన్యరథం): కృష్ణా జిల్లా పెనమలూరు మండలంలోని తాడిగడప మున్సిపాల్టీ పరిధిలోని డంప్ యార్డ్ ప్రదేశంలో పేరుకుపోయిన లెగసీవేస్ట్‌ని వెంటనే తొలగించాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆదేశించారు. తాడిగడప మున్సిపాల్టీకి చెందిన డంప్ యార్డ్ ప్రాంతాన్ని ఆయన సోమవారం సాయంత్రం సందర్శించారు. ఆ ప్రాంతం మొత్తాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న లెగసీ వేస్ట్‌ని త్వరితగతిన తొలగించాలని మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్, ఏజెన్సీ వారిని ఆదేశించారు. లెగసీ వేస్ట్ తొలగింపునకు సంబంధించి వారికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇక్కడ క్లియర్ చేసిన తర్వాత ఈ పట్టణంలో వచ్చే చెత్తని విజయవాడ జవహర్ ఆటోనగర్ ఐలా (ఆటోనగర్ ఇండస్ట్రియల్ లోకల్ అథారిటీ) వారు చూపించిన ప్రదేశానికి తరలించాలని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ ఎప్పటికప్పుడు ఐలా వారితో సంప్రదించి, వారి సమన్వయంతో చెత్తని తరలించాలని చైర్మన్ పట్టాభిరామ్ ఆదేశించారు.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

# గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

**●దెందులూరులో రూ.1.38 కోట్లతో నూతన రహదారి పనులకు భూమిపూజ చేసిన ఎంపీ పట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్యే చింతమనేని**



దెందులూరు (చైతన్యరథం): గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, రహదారుల పునర్నిర్మాణమే చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ ముఖ్య సంకల్పమని ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్, దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ స్పష్టం చేశారు. సోమవారం దెందులూరు మండలం చల్లచింతలపూడి గ్రామంలో APRRSP - PRP ప్లెయిన్ గ్రాంట్ కింద రూ. 1కోటి 38 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న చల్లచింతలపూడి – తిమ్మనగూడెం – కండ్రిక నరసాపురం రహదారి పనులకు ఎంపీ, ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా హాజరై శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రజలతో ప్రత్యేకంగా ముఖాముఖి సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

**ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ...** చల్లచింతలపూడి నుండి కండ్రిక నరసాపురం వరకు ఉన్న రహదారిని రాబోయే రెండు మూడు నెలల వ్యవధిలోనే నాణ్యమైన తార్ రోడ్డుగా నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఎంపీ లాడ్స్ ఫండ్స్ అనేది పార్లమెంట్ పరిధిలోని సమస్యలకు తక్షణ పరిష్కారం లాంటిదని వ్యాఖ్యానిస్తూ, ఎంపీ మహేష్ కుమార్ ఉదారంగా అందిస్తున్న నిధులతో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామంలో శ్మశాన వాటిక షెడ్డు నిర్మాణాన్ని ఈ నెల రోజుల్లోనే పూర్తి చేయిస్తామని, ఇళ్ల స్థలాల సర్వే పూర్తి చేసి అర్హులైన పేదలకు కచ్చితంగా పట్టాలు ఇప్పిస్తామని స్పష్టం చేశారు. అలాగే కొత్త పెన్షన్లు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు మరియు రూ. 52కే కేజీ నాణ్యమైన సన్న బియ్యం ఇచ్చే పథకాలు ప్రతి పేద కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని, గ్రామస్తులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి సైతం త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.

**ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ...** ఎన్నో రోజులుగా అధ్వానంగా ఉన్న ఈ రహదారికి ఎమ్మెల్యే చింతమనేని ప్రత్యేక చొరవతో విముక్తి లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ నియోజకవర్గ అభివృద్ధిపై చూపిస్తున్న తపన, పట్టుదలను ఎంపీ ప్రత్యేకంగా కొనియాడారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో దెందులూరు నియోజకవర్గంలో పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఎన్ఆర్ఇజీఎస్ (ఉపాధి హామీ) నిధులతో పాటు ఎంపీ ఫండ్స్‌ను కూడా సమర్థవంతంగా వినియోగించుకుంటూ పల్లెల్లో రోడ్లు, డ్రైనేజీలు, శ్మశాన వాటికల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ఎమ్మెల్యే ప్రభాకర్‌తో సమన్వయం చేసుకుంటూ రాబోయే రోజుల్లో చల్లచింతలపూడి ప్రాంతంలో మిగిలి ఉన్న అన్ని రకాల అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని ప్రజలకు భరోసా ఇచ్చారు.

# విద్యార్థినులకు మెరుగైన మౌలిక వసతులు

**●విమెన్స్ కాలేజ్ జీ+2 భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పెమ్మసాని**

**●రూ.1.98 కోట్ల సీఎస్ఆర్ నిధులు సమకూర్చిన కేంద్రమంత్రి**



గుంటూరు (చైతన్యరథం): నగరంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు రూ. 1.98కోట్ల సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల భవన నిర్మాణానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సోమవారం స్థానిక ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ... 1942లో స్థాపించబడిన ఈ కళాశాలకు ఎంతో ఘనమైన చరిత్ర ఉందని, ప్రస్తుతం 2,500 మందికి పైగా విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థినులకు ఈ కళాశాల ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం కళాశాలలో ఉన్న తరగతి గదులు విద్యార్థినుల సంఖ్యకు సరిపోకపోవడంతో అదనంగా 12 క్లాస్‌రూమ్‌లు అవసరమని కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్నా కుమారి కోరినట్లు తెలిపారు. ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని కోల్ ఇండియా నుంచి రూ. 2కోట్ల సీఎస్ఆర్ నిధులను సమీకరించినట్లు వెల్లడించారు. ఈ నిధులతో సుమారు 9,600 చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ+2 అంతస్తుల భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి తదుపరి విద్యా సంవత్సరం నాటికి విద్యార్థినులకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పాటు CSR నిధులను సమన్వయం చేసుకుంటూ గుంటూరు ప్రాంతంలో అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

# విగ్రహాలకు ఎలాంటి హాని జరగదు.. క్రమపద్ధతిలో పునర్వ్యవస్థీకరిస్తాం

**●గోదావరి రివర్‌ఫ్రంట్ అభివృద్ధిపై విగ్రహాల నిర్వాహకులతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సమీక్ష**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): గోదావరి గట్టున నిర్మాణ దశలో ఉన్న రివర్‌ఫ్రంట్ అభివృద్ధి పనుల నేపథ్యంలో అక్కడ ఉన్న వివిధ మహనీయుల విగ్రహాల విషయంలో ఎలాంటి అపోహలకు తావులేకుండా చర్యలు తీసుకుంటామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, నగర పాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా స్పష్టం చేశారు. విగ్రహాల నిర్వాహకులు, సంబంధిత ప్రతినిధులతో నగర పాలక సంస్థ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో వారు సోమవారం సమీక్ష నిర్వహించారు. రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు అభివృద్ధి పనులతో ప్రస్తుతం ఉన్న విగ్రహాలకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, అధికారులు హామీ ఇచ్చారు. ప్రాజెక్టు తుది రూపకల్పనలో భాగంగా విగ్రహాలను తొలగించడం కాదని, అవసరమైన చోట యూనిఫామ్ రీలొకేషన్, సమాన దూరం, ఒకే అలైన్‌మెంట్, సమానమైన ప్లాట్‌ఫామ్ డిజైన్‌తో క్రమపద్ధతిలో ఏర్పాటు చేయడం మాత్రమే ఉద్దేశమని వివరించారు. రివర్‌ఫ్రంట్‌లోకి ప్రవేశించే వారు, నడిచే ప్రజలు, బయట నుంచి చూసే సందర్శకులు అందరికీ విగ్రహాలు ఒకే తరహా డిజైన్‌లో కనిపించేలా సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం కొన్ని విగ్రహాలు ఒకే లైన్‌లో ఉండగా, మరికొన్ని విభిన్న ప్రదేశాల్లో లేదా ఎత్తుపల్లాల్లో ఉండటంతో మొత్తం రివర్‌ఫ్రంట్ అందం, సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉందని వివరించారు. అందువల్ల సిమెట్రికల్ డిజైన్, సమాన విరామాలు, యూనిఫామ్ అలైన్‌మెంట్ ద్వారా మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దే ఆలోచనను నిర్వాహకుల ముందుంచారు. విగ్రహాల రూపం, పేర్లు, గుర్తింపు విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తామని ఎమ్మెల్యే, కమిషనర్ స్పష్టం చేశారు. ఒక్క పేరు కూడా తప్పిపోకుండా, ఎలాంటి పొరపాటు జరగకుండా ప్రతి విగ్రహానికి సంబంధించిన వివరాలను నిర్వాహకుల సమక్షంలోనే పరిశీలించి, వారి ఆమోదం అనంతరం తుది రూపకల్పనలో పొందుపరుస్తామని తెలిపారు. మహనీయుల పేర్లు, విగ్రహాల గుర్తింపు విషయంలో ఎలాంటి చిన్న తప్పిదానికీ అవకాశం ఇవ్వబోమని పేర్కొన్నారు. అన్ని విగ్రహాలకు సాధ్యమైనంత వరకు ఒకే తరహా ప్రభుత్వ ప్లాట్‌ఫామ్, స్టోన్ ఫినిషింగ్, ప్లాంటర్ బాక్సులు, పరిసరాల ల్యాండ్‌స్కేపింగ్ ఉండేలా చూస్తామని అధికారులు వివరించారు.

# రాష్ట్రంలో 36 సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి కూటమి ప్రభుత్వం సన్నద్ధం

**●జలయజ్ఞం పేరుతో గత పాలకుల దోపిడీపై ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ ధ్వజం**




కాకినాడ (చైతన్యరథం): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైతాంగాన్ని ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ స్పష్టం చేశారు. సోమవారం కాకినాడ లో జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులు, పూర్తి చేయాల్సిన గడువులు, గత వైసీపీ ప్రభుత్వ అవినీతిపై పలు కీలక విషయాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను ఎంపిక చేసి, వాటి పూర్తికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేశారని ఆయన తెలిపారు. ఈ 36 ప్రాజెక్టుల మొత్తం అంచనా వ్యయం రూ.78,135 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.44,614 కోట్లు ఖర్చయ్యాయని, మిగిలిన రూ.32,199 కోట్ల పనులను పూర్తి చేయడానికి షెడ్యూల్స్ ఖరారు చేశామన్నారు. ఇందులో భాగంగా పోలవరం ప్రధాన ప్రాజెక్టును మార్చి 2027 నాటికి, పూర్తి చేస్తామని అన్నారు. పోలవరం ఎడమ కాలువను అనకాపల్లి వరకు నేటితో పూర్తి చేసామని అన్నారు.

**ఎల్‌నినో పరిస్థితుల్లో కూడా కృష్ణా, గోదావరి ఆయకట్టును కాపాడుకోగలిగాం**

రాష్ట్రంలో తీవ్రమైన ఎల్ నినో పరిస్థితులు ఉన్నప్పటికీ కృష్ణా, గోదావరి ఆయకట్టును కాపాడుకోగలిగామంటే అది ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపు వల్లేనని ఆయన ప్రశంసించారు. ఎప్పటి నుంచో రైతులు ఆశగా ఎదురుచూస్తున్న పోలవరం ఎడమ కాలువ (లెఫ్ట్ మెయిన్ కెనాల్) పనులు 87 శాతం పూర్తయ్యాయని, ఈ కాలువ ద్వారా నీటి విడుదలకు సంబంధించి సెప్టెంబర్ 2వ తేదీన అనకాపల్లి వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు పనులను లాంఛనంగా ప్రారంభించి "జలహారతి" ఇవ్వనున్నారని వెల్లడించారు.

**జలయజ్ఞం పేరుతో గత పాలకులు రూ.43 వేలు కోట్లు దోచుకున్నారు**

ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు అత్యంత కీలకమైన వెలిగొండ ప్రాజెక్టును 1996లోనే రూ.10,200 కోట్ల అంచనాలతో చంద్రబాబు గారు ప్రారంభిస్తే, గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం కేవలం రూ.981 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ఇప్పుడు ఆ ప్రాజెక్టు క్రెడిట్ తమదే అని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. జలయజ్ఞం పేరుతో గత పాలకులు సుమారు రూ. 43వేల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారని ఈడీ నిర్ధారించిందని ఆయన గుర్తుచేశారు.

**కాలువల మట్టిని అమ్ముకుని ప్రాజెక్టును గాలికొదిలేశారు**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రాజెక్టు కాలువలు తవ్వింది నిజమేనని, అయితే కేవలం పురుషోత్తపట్నం నుంచి ప్రత్తిపాడు వరకు మెత్తటి మట్టి ఉన్న చోట మాత్రమే తవ్వి ఆ మట్టిని గుట్టలుగా పోసి వందల కోట్లు జేబులో వేసుకున్నారని ఆరోపించారు. కష్టమైన కొండలు, గుట్టల ప్రాంతాలను కాలువల తవ్వకానికి పనికిరాకుండా గాలికొదిలేశారని దుయ్యబట్టారు. ఎటువంటి ప్రణాళిక లేకుండా గత ప్రభుత్వం వదిలేసిన ప్రాజెక్టులకు తిరిగి జీవం పోస్తూ, రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసే దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు.

# ప్రజల దాహార్తి తీర్చడమే నా ధ్యేయం : ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



దెందులూరు (చైతన్యరథం): నియోజకవర్గ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడమే తన మొదటి ప్రాధాన్యత అని, ప్రజల దాహార్తి తీర్చేందుకు ఎంతటి కష్టానికైనా సిద్ధమని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ నిరూపించారు. ప్రపంచాన్ని వణికిస్తున్న ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో అత్యల్ప వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో... ప్రకాశం బ్యారేజ్ నుంచి కృష్ణా కెనాల్ ద్వారా ప్రభుత్వం తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేసింది. కృష్ణా కెనాల్ చివరి ఆయకట్టు (టెయిల్ ఎండ్)లో ఉన్న దెందులూరు నియోజకవర్గానికి ఈ నీటిని చేరవేసేందుకు, ఏలూరు తూర్పులాకుల వద్ద నీటిని నిల్వ చేసి అక్కడి నుంచి సీతంపేట హెడ్ ద్వారా దెందులూరు మండలానికి తాగునీరు అందించేలా ప్రణాళిక రూపొందించారు. కాలువలో నీటి ప్రవాహానికి ఎలాంటి అవరోధాలు కలగకుండా వేగంగా నీరు దెందులూరు చేరుకోవాలనే సంకల్పంతో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆదేశాల మేరకు సీతంపేట కెనాల్ వద్ద ప్రక్షాళన పనులు చేపట్టారు. సోమవారం తెల్లవారుజాము నుంచే కురుస్తున్న కుండపోత వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్వయంగా సీతంపేట కెనాల్ వద్దకు చేరుకున్నారు. వర్షంలో గొడుగు పట్టుకుని నిలబడి, జేసీబీ యంత్రాల సహాయంతో కాలువలో పేరుకుపోయిన గుర్రపునాచు, కర్రనాచు మరియు అడ్డుగా ఉన్న తుమ్మ చెట్లను తొలగించే పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చకచకా పనులు పూర్తయ్యేలా సిబ్బందికి తగిన సూచనలు చేశారు.

# చంద్రబాబు దూరదృష్టితో వెలిగొండ పూర్తి...

## కరువు ప్రాంతాల రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు : ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): రాష్ట్ర వ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని అందులో భాగంగా దశాబ్దాలుగా కలగా ఉన్న వెలిగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేసి అన్నదాతల్లో వెలుగులు నింపారని ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఓ ప్రకటన ద్వారా సంతోషం వ్యక్తం చేశారు. వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం సీఎం చంద్రబాబు సంకల్పానికి దూరదృష్టికి నిదర్శనమని పేర్కొన్నారు. సుమారు 30 ఏళ్లుగా వెలిగొండ ప్రాజెక్ట్ కోసం ఎదురుచూస్తున్న ప్రజలు, రైతుల కల నేడు సాకారం కావడం ఆనందదాయకమన్నారు. వెలిగొండ ప్రారంభోత్సవం రాష్ట్ర సాగునీటి రంగ చరిత్రలో ఒక చారిత్రాత్మక ఘట్టంగా నిలిచిపోతుందని తెలిపారు. కరువు పరిస్థితులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాలకు సాగునీటిని అందించడంతో పాటు తాగునీటి అవసరాలను తీర్చడంలో వెలిగొండ ప్రాజెక్ట్ కీలక పాత్ర పోషిస్తుందని జీవీ అన్నారు. వెలిగొండ ప్రాజెక్ట్‌తో కరువు ప్రాంతాల్లోని రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు నిండుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సాగునీరు, తాగునీరు అందుబాటులోకి రావడం ద్వారా ఈ ప్రాంతాల్లో వ్యవసాయం, ఉపాధి, వాణిజ్యం, గ్రామీణ మౌలిక వసతులు తదితర రంగాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. నిర్వాసిత కుటుంబాల పట్ల ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరించిందని తెలిపారు. సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధతో నిర్వాసిత కుటుంబాలకు కేవలం 48 రోజుల్లోనే రూ.762 కోట్ల పరిహారం పంపిణీ చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలోని పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను దశలవారీగా పూర్తి చేసి రైతులకు నీటి భద్రత కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేయడం ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన తెలిపారు. వెలిగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేసిన సీఎం చంద్రబాబుకి, ఈ ప్రాజెక్ట్ కోసం కృషి చేసిన అధికారులు, ఇంజనీర్లు, సిబ్బందికి చీఫ్ విప్ జీవీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# నందిగామ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి : ఎమ్మెల్యే తంగిరాల



గుంటూరు (చైతన్యరథం): నందిగామ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మరోసారి తన చొరవను చాటుకున్నారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గానికి అవసరమైన మౌలిక వసతులు, ప్రజా సౌకర్యాల కల్పనకు నిధులు సాధించేందుకు కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ని ఆయన కార్యాలయంలో కూటమి నేతలతో కలిసి తంగిరాల సౌమ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నందిగామ నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

**నందిగామకు నూతన పోస్టల్ భవనం కోసం విజ్ఞప్తి**

నందిగామ పట్టణానికి నియోజకవర్గంలోని నలుమూలల నుంచి ప్రతిరోజూ ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం వస్తున్నారని, పట్టణంలో పెరుగుతున్న జనాభా మరియు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన పోస్టల్ భవనం మంజూరు చేయాల్సిన అవసరం ఉందని తంగిరాల సౌమ్య కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కి వివరించారు.

**13 గ్రామాల ప్రయోజనానికి గుడిమెట్ల రహదారి విస్తరణ**

అదేవిధంగా నందిగామ-గుడిమెట్ల రహదారి విస్తరణకు CRF గ్రాంట్ కింద అవసరమైన నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. ఈ రహదారి అభివృద్ధి పూర్తయితే నందిగామతో పాటు పరిసర ప్రాంతాల్లోని 13 గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగుపడతాయని తంగిరాల సౌమ్య వివరించారు.

# ప్రతి నాయకుడికి ఆదర్శం బొల్లా బాబు ప్రసాద్ : ఎంపీ కేశినేని శివనాథ్

**● ప్రజలకు ఎల్లప్పుడూ సేవ చేయాలని కోరుకునే కుటుంబం బొల్లా బాబు ప్రసాద్ కుటుంబం**



జగ్గయ్యపేట (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లా, జగ్గయ్యపేట నియోజకవర్గం, వత్సవాయి మండలం తాళ్లూరు గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకులు రెండు సార్లు సర్పంచ్‌గా, రెండుసార్లు ఎంపీటీసీగా స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగులేని నాయకుడిగా ఉన్న బొల్లాబాబు ప్రసాద్ ఇటీవల పరమపదించిన నేపథ్యంలో ఊరి ప్రజల కోరిక మేరకు బొల్లా బాబు ప్రసాద్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో సోమవారం విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని గ్రామస్తుల సమక్షంలో అత్యంత వైభవపేతంగా నిర్వహించి బాబు ప్రసాద్ సంస్మరణ సభ సైతం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం, మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే బొద్దులూరి రామారావుతో కలిసి ఎంపి కేశినేని చిన్ని విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సంస్మరణ సభ వేదికగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ... స్థానిక సంస్థల్లో 20 సంవత్సరాలు ఏక చక్రాధిపత్యంగా ప్రజల అభీష్టం మేరకు సర్పంచ్‌గా సుదీర్ఘకాలం సేవలందించి రెండు పర్యాయాలు ఎంపీటీసీగా ఉన్న బొల్లా బాబుప్రసాద్ నేడు లేకపోవడం పార్టీకి తీరని లోటని ఎంపీ శివనాథ్ అన్నారు. బాబు ప్రసాద్ లేకపోయినప్పటికీ ఆయన కుమారుడితో తనకు మంచి పరిచయం ఉందని తన దగ్గరికి వచ్చిన ఎప్పుడు ప్రజల సమస్యలపై గట్టిగా మాట్లాడుతూ ప్రజలకు గ్రామానికి ఏదో ఒకటి చేయాలనే ఆలోచన తన తండ్రి దగ్గరదేనని ఎంపీ చిన్ని గుర్తు చేశారు.

# వాంబే కాలనీలో మెగా ఉచిత వైద్య శిబిరం

**●ప్రారంభించిన టీడీపీ యువనాయకులు బొండా రవితేజ**



విజయవాడ (చైతన్యరథం): సెంట్రల్ నియోజకవర్గం 60వ, డివిజన్ వాంబే కాలనీ డిస్నీల్యాండ్ ఎదురు ఉజ్వల భవిత ఫౌండేషన్ మరియు అను ఒమేగా హాస్పిటల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిత్య సువార్త ప్రార్థనా మందిరం ఆవరణలో మెగా ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా... తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బొండా రవితేజ హాజరయ్యారు. ఈ సందర్భంగా బొండా రవితేజ మాట్లాడుతూ... పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం సేవా సంస్థలు, ఆసుపత్రులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయడం ద్వారా సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ప్రజలు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండి, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మెగా వైద్య శిబిరంలో అను ఒమేగా హాస్పిటల్ వైద్య బృందం ఆధ్వర్యంలో నరాలు, కీళ్లు, ఎముకలు, మెదడు, గుండె సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండె సంబంధిత సమస్యలను గుర్తించేందుకు ఈసీజీ, ఎకో పరీక్షలను కూడా ఉచితంగా నిర్వహించి, వైద్యులు ప్రజలకు అవసరమైన వైద్య సలహాలు, సూచనలు అందించారు. అలాగే వాసన్ ఐ కేర్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలతో వచ్చిన వారికి పరీక్షలు చేసి తగిన వైద్య సూచనలు అందించారు. ఆశాజ్యోతి దంత వైద్యశాల వారి ఆధ్వర్యంలో ఉచిత దంత పరీక్షలు నిర్వహించి, పంటి మరియు చిగుళ్ల సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

# తాడేపల్లిలో నూతన పార్క్‌కు ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ శంకుస్థాపన

**● ఏపీటీఎస్, సీఎస్ఆర్ నిధులతో నిర్మిస్తామని వెల్లడి**



తాడేపల్లి (చైతన్యరథం): మంత్రి నారా లోకేష్ మార్గదర్శకంలో మంగళగిరి నియోజకవర్గంలోని వడ్డేశ్వరంలో నూతన పార్క్ నిర్మాణానికి ఏపీ టీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ సోమవారం భూమి పూజ చేశారు. మంగళగిరి నియోజకవర్గం వడ్డేశ్వరం గ్రామంలో ఏపీటీఎస్, సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న నూతన పార్క్ నిర్మాణ పనులకు భూమి పూజ చేయడం సంతోషంగా ఉందని మన్నవ మోహనకృష్ణ వ్యాఖ్యానించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో నారా లోకేష్ చూపిస్తున్న చొరవ, ముందుచూపు అభినందనీయమన్నారు. నారా లోకేష్ నాయకత్వంలో మంగళగిరి అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో సాగుతూ, ఆంధ్రప్రదేశ్‌లోనే ఒక మోడల్ నియోజకవర్గంగా మంగళగిరిని నారా లోకేష్ తీర్చి దిద్దుతున్నారని ప్రశంసించారు. వడ్డేశ్వరంలో నిర్మించనున్న నూతన పార్క్ స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. చిన్నారులు ఆటలాడేందుకు, యువత వ్యాయామం చేసేందుకు, వృద్ధులు సేదతీరేందుకు అనువైన వాతావరణం పార్క్ ద్వారా అందుబాటులోకి వస్తుందని మోహనకృష్ణ తెలిపారు. గ్రామంలో పచ్చదనం పెరగడంతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. లోకేష్ చొరవతో ఇప్పటికే ఏపీటీఎస్ ఆధ్వర్యంలో మంగళగిరిలో మోడల్ లైబ్రరీని ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని, ఇప్పుడు వడ్డేశ్వరంలో నూతన పార్క్ నిర్మాణానికి APTS ద్వారా శ్రీకారం చుట్టామని మోహనకృష్ణ అన్నారు. మంగళగిరిలో అభివృద్ధి కార్యక్రమాలకు అందిస్తున్న సహకారానికి మన్నవ మోహనకృష్ణకి నారా లోకేష్ ధన్యవాదాలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# డిసెంబర్ లోపు లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను అందజేస్తాం : ఎమ్మెల్యే బోడె ప్రసాద్



ఉయ్యూరు (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే టిడ్కో ఇళ్ల పనులను ప్రారంభించి వేగవంతం చేసి లబ్ధిదారులకు అందజేస్తామని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పనులు చేపడుతున్నామని పెనమలూరు టీడీపీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వ్యాఖ్యానించారు. వచ్చే డిసెంబర్ నాటికి పనులు పూర్తి చేసి జనవరి 15 నాటికి ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ప్రతి లబ్ధిదారుడికి సొంత ఇంటికి తాళం అందజేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీలో జెమిని స్కూల్ సమీపంలో నిర్మించిన గృహాల నిర్మాణ పనులను పరిశీలించేందుకు తమకు కేటాయించిన గృహాలను చూసేందుకు లబ్ధిదారులను ఆహ్వానించారు. అనంతరం టీడీపీ మాజీ ఎమ్మెల్సీ వై.వీ.బీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... పేద, మధ్య తరగతి ప్రజల సొంతింటి కల నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, టిడ్కో గృహాల లబ్ధిదారుల గృహ సముదాయాల్లో మిగిలి ఉన్న మౌలిక వసతులు పూర్తి చేస్తామన్నారు. రహదారులు, విద్యుత్ డ్రైనేజ్ పనులు త్వరితగతిన పూర్తి చేసి, లబ్ధిదారులకు ఇళ్లను డిసెంబర్ లోపు అందజేస్తామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తిచేసినా వాటిని లబ్ధిదారులకు అందించకుండా జగన్ ప్రజల్ని మోసం చేశారని అన్నారు. టిడ్కో ఇళ్లను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో అవి చాలా వరకు దెబ్బతిన్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు మరమ్మత్తులు చేపట్టి లబ్ధిదారులకు అందించేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయని అన్నారు.

## మైనింగ్‌తో సంబంధం లేకపోయినా

# వీపీఆర్‌ను విమర్శించడం విడ్డూరం

### వైసీపీ నేతలపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ధ్వజం



నెల్లూరు (చైతన్యరథం): జగన్ నుండి మొదలుకుని అనిల్ వరకు వీపీఆర్‌ని లక్ష్యంగా చేసుకుని మాట్లాడుతున్నారని వైసీపీ నేతలపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర విరుచుకుపడ్డారు. వీపీఆర్‌పై అనిల్ పదే పదే మైనింగ్ ఆరోపణలు చేస్తున్నారని అనిల్ మాటలను పట్టించుకునే పరిస్థితిలో ప్రజలు లేరని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీద మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి వచ్చిన వీపీఆర్ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ రెండు టికెట్లు ఇచ్చిందని అనిల్ తన అక్కసు వెళ్ళగక్కుతున్నారన్నారు. ఇందులో రహస్యమేమీ లేదని, ఇది అందరికీ తెలిసిన విషయమేనని పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుండి వచ్చిన నేతలకు మీ పార్టీ టికెట్లు ఇవ్వలేదా అని నిలదీశారు. 2019 ఎన్నికల్లో వైస్సార్సీపీ తిరుపతి ఎంపీ అభ్యర్థి బల్లి దుర్గా ప్రసాద్ ఏ పార్టీ నుంచి వచ్చారని ప్రశ్నించారు. ఒంగోలు, నెల్లూరు ఎంపీ అభ్యర్థులు ఏ పార్టీ నుంచి వచ్చారో తెలియదా అని నిలదీశారు. జగన్ కోసం జీవితాన్ని త్యాగం చేసి, ఎప్పుడు చెబితే అప్పుడు రాజీనామాలు చేసి, కేంద్ర ప్రభుత్వంతో ఇబ్బందులు ఉన్న జగన్ వెంట నడిచిన మేకపాటి రాజమోహన్ రెడ్డి ఏమయ్యారో అంతా చూస్తున్నారన్నారు. 2019 ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంట్ వైస్సార్సీపీ అభ్యర్థిగా మేకపాటి రాజమోహన్ రెడ్డి కి టికెట్ ఇవ్వకుండా గొంతు కోసింది జగన్మోహన్ రెడ్డి కాదా అని నిలదీశారు. 2024 ఎన్నికల్లో, శ్రీకాకుళం నుండి కర్నూలు వరకు ఉన్న వైస్సార్సీపీ నేతలందరూ పారిపోయి ఇతర పార్టీల్లోకి ఎందుకు చేరారో చెప్పగలవా అని సవాలు విసిరారు. తొలినుంచి చంద్రబాబుకు వ్యతిరేకం అయిన నరసారావు పేట టీడీపీకి ఎందుకు అనుకూలంగా మారింది? లావుశ్రీ కృష్ణదేవరాయలును ప్రజలు భారీ మెజారిటీతో ఎందుకు గెలిపించారు? అంతా తేట తెల్లమేనన్నారు. రాజశేఖర్ రెడ్డికి నమ్మిన బంటు బాలసౌరి వైస్సార్సీపీ ని వీడి మచిలీపట్నం జనసేన ఎంపీగా ఎందుకు పోటీ చేయవలసివచ్చిందో చెప్పగలవా అనిల్ అని నిలదీశారు. ఇతర దేశాల టెక్నాలజీని ఉపయోగించుకొని, కేంద్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా సంవత్సరం క్రితం మైనింగ్ ఫ్యాక్టరీ పెట్టాలని తాను చేసిన ప్రయత్నం వాస్తవమని వీపీఆర్ అప్పుడే చెప్పారన్న విషయం గుర్తు లేదా అని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి మన ప్రాంతాల్లో దొరికే ముడి సరుకులను ఉపయోగించుకుని మైనింగ్ ఇండస్ట్రీ పెట్టాలని నాడు వీపీఆర్ ఆలోచన చేశారన్నారు. పలు కారణాలతో మైనింగ్ పరిశ్రమ ప్రయత్నం విరమించుకుంటున్నానని, మైనింగ్ పరిశ్రమతో తనకు సంబంధం లేదని వీపీఆర్ తేల్చి చెప్పారన్నారు. వీపీఆర్ సొంత భూమి 350 ఎకరాల్లో నూతనంగా ప్రైవేట్ సెజ్ ఏర్పాటు చేయాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నూతన పాలసీలను ఉపయోగించుకుని ఇండస్ట్రీలు తీసుకురావాలని శాయశక్తులా కృషి చేస్తున్నారన్నారు. వీపీఆర్ మైనింగ్ పేరుతో ఉన్న ఆ భూమిని దేనికో ముడిపెట్టి చైనా వీసాలు, అక్రమ వ్యాపారాలు అంటూ అనిల్ నోటికొచ్చినట్టు ఏవేవో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. అంతర్జాతీయ వ్యవహారాలపై భారత ప్రభుత్వం కొన్ని నిర్ణయాలు తీసుకుందన్నారు. ఫార్మా, కెమికల్స్ ఆక్వా ఇండస్ట్రీస్‌లో తలెత్తే సమస్యల లాగే మైనింగ్ ఇండస్ట్రీలో కూడా కొన్ని సమస్యలు వచ్చాయన్నారు. వైస్సార్సీపీ ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లో లేరన్నారు. వీపీఆర్ ప్రైవేట్ సెజ్‌ను ఏర్పాటు చేసి పరిశ్రమలను, ఉపాధి అవకాశాలను కల్పించబోతున్నారని వెల్లడించారు. ఎన్టీఆర్ తెలుగుదేశం... చంద్రబాబు తెలుగుదేశం అంటూ నోరు జారిన అనిల్ వైస్సార్సీపీ పార్టీ చరిత్ర తెలుసుకోవాలన్నారు. వైస్ రాజశేఖర్ రెడ్డి చావును అడ్డు పెట్టుకుని పుట్టిన మీ పార్టీ గౌరవ అధ్యక్షురాలు విజయమ్మ ఏమయ్యారు? పార్టీ నుండి అవమానకరంగా గెంటేయలేదా అని నిలదీశారు. రాష్ట్రమంతా కన్నీరు పెట్టుకుని తిరిగిన చెల్లి షర్మిలమ్మ ఏమయ్యారు? అన్నను జైలులో వేశారని పార్టీని భుజాన మోసిన చెల్లి షర్మిలమ్మ పార్టీ ఎందుకు వీడాల్సి వచ్చిందో చెప్పాలన్నారు. విజయసాయి రెడ్డి ఆవేదన, ఆక్రోశాలకు సమాధానం ఎవరు చెప్పాలి అనిల్ ? జగన్, సజ్జల చెబుతారా లేక నువ్వా అని ప్రశ్నించారు.. వైయస్సార్, జగన్‌ల వ్యాపారాలు, కుటుంబం, వైస్సార్సీపీ పార్టీకి సర్వం తానే అయి చూసుకున్న విజయసాయిరెడ్డి అడిగే ప్రశ్నలకు వైస్సార్సీపీ నేతలు సమాధానం చెప్పాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి, రాష్ట్ర ఇన్లాండ్ వాటర్ వేస్ చైర్మన్ శివ ప్రసాద్ ,నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, జెన్ని రమణయ్య, భూలక్ష్మి, పిల్ రావు , అమ్రుల్లా, హరికృష్ణ, రవీంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు



గుడిబండ మండలం వీరజ్జనల్లి, బాలేపల్లి,సీసీ గిరి తదితర గ్రామాలలో సోమవారం సత్యసాయి జిల్లా అధ్యక్షుడు టీటీడీ బోర్డు మెంబర్ ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ శ్రీనివాస్ మూర్తి చేతుల మీదుగా కోటి 65 లక్షల రూపాయలు సీసీ రోడ్లను ప్రారంభించారు.

# ముప్పై ఏళ్ల కలను సాకారం చేసిన సీఎం చంద్రబాబు

### ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అజీజ్ హర్షం



నెల్లూరు (చైతన్యరథం): వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్ 1 ప్రారంభం పట్ల ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కరువు ప్రాంతాల ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులకు నాంది అని పేర్కొన్నారు. దశాబ్దాలుగా నీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు వెలిగొండ ఒక కొత్త భరోసా అని తెలిపారు. ఈ ప్రాజెక్టుతో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందనున్నాయని తెలిపారు. ఒకప్పుడు నీటి కోసం ఊరు వదిలిన ప్రజలు.. ఇక నీటితో తమ ఊరినే మార్చుకునే రోజులు వచ్చాయి. వెలిగొండ ఒక ప్రాజెక్టు కాదు.. కరువు నేలకు పునర్జన్మ" అని అబ్దుల్ అజీజ్ అన్నారు. 1996లో చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసిన ప్రాజెక్టు, 30 ఏళ్ల తర్వాత ఆయన చేతుల మీదుగా ప్రారంభం కావడం ఆయన సంకల్పానికి నిదర్శనమని పేర్కొన్నారు. కృష్ణమ్మ కాలువల్లో ప్రవహించడమే కాదు.. రైతుల కళ్లలో నమ్మకాన్ని నింపాలి. అదే వెలిగొండ అసలైన విజయం." అని అబ్దుల్ అజీజ్ అన్నారు.

# బీసీల గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదు : టీడీపీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర



నెల్లూరు (చైతన్యరథం): రాష్ట్రంలో బీసీలకు 34 రిజర్వేషన్లను తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఇచ్చాక వైస్సార్సీపీ నేతలు పదే పదే మాట్లాడుతున్నారన్నారు. బీసీలకు తామే రక్షకులమని జగన్ చెబుతుంటే బీసీలే కాదు రాష్ట్ర ప్రజలు కూడా అసహ్యించుకుంటున్నారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు బీసీలను ఉక్కుపాదంతో అణచివేసిన జగన్మోహన్ రెడ్డి, అది పోయాక మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా బీసీ లను ప్రోత్సహించిన పార్టీ తెలుగుదేశం పార్టీ, బీసీలకు గౌరవం కల్పించింది ఎన్టీఆర్, చంద్రబాబు అనేది జగమెరిగిన సత్యమన్నారు. రాష్ట్రంలోనే కాదు దేశంలోనే బీసీల ప్రయోజనాలు, గౌరవం కాపాడింది తెలుగుదేశం పార్టీ అని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 5 ఎమ్మెల్సీలలో మూడు బీసీలకు, రెండు ఎస్సీ లకు, ఆరు రాజ్యసభ స్థానాలలో మూడు బీసీలకు, మూడు ఇతరులకు ఇచ్చి న్యాయం చేసిన పార్టీ తెలుగుదేశం అన్నారు. వైస్సార్సీపీ డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ఒకటి, రెండు సార్లు ప్రజలు మోసపోయినా నేడు అర్థం చేసుకుంటున్నారన్నారు. ఎక్కడో సమస్యను ఇటువైపు మళ్లించి మాట్లాడడం, ప్రభుత్వం చేసే మంచి పనులను గందరగోళం చేసే ప్రయత్నం చేయడం వైస్సార్సీపీ కి అలవాటుగా మారిందన్నారు.




# దేవుడు ఆదేశిస్తాడు.. సీఎం చంద్రబాబు పాటిస్తాడు!

### తెలుగు ప్రజల గుండె చప్పుడు వెలిగొండ, చిత్తూరు టీడీపీ నేతల వెల్లడి

చిత్తూరు (చైతన్యరథం): ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుని ప్రారంభించి జాతికి అంకితం చేయడం ఆంధ్ర రాష్ట్ర రాజకీయ చరిత్రలోనే ఒక సువర్ణ అక్షరాలతో రాయవలసిన అంశం అని చిత్తూరు జిల్లా టీడీపీ నాయకులు అన్నారు. 1996 మార్చి 5న చంద్రబాబు నాయుడు చేతుల మీద శంకుస్థాపన చేసిన ప్రాజెక్టు 30 సంవత్సరాల తర్వాత మళ్లీ చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభోత్సవం నోచుకోవడం... ఇది దేవుడి ఆదేశం అని అన్నారు. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు కృష్ణా జలాలు తరలించి అపర భగీరథుడయ్యాడని కొనియాడారు. దాదాపు 53.85 టీఎంసీల నీరుని నిల్వ చేయగల సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్టుని సాధించి ప్రజలకు అంకితం చేయడం ఆనందదాయకమన్నారు. 10200 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మించిన ప్రాజెక్టు వలన 23 లక్షల మందికి తాగునీరు, అదే విధంగా 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడానికి నడుం బిగించారని అన్నారు. ఫ్లోరైడ్ సమస్యతో బాధపడుతున్న ప్రజానీకానికి ఒక సంజీవని లాగా ఈ ప్రాజెక్టు నిలబడిందని అన్నారు. గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం హయాంలో కనీసం రెండు శాతం పనులు కూడా పూర్తి చేయకుండా వెలుగొండ ప్రాజెక్టుని అటకెక్కించారని అన్నారు. తమ సొంత జిల్లా అయిన కడపకు కూడా నీళు ఇవ్వలేనటువంటి పరిస్థితుల్లో వైసీపీ పాలన సాగిందని అన్నారు. అనేకమైనటువంటి ఇబ్బందులు, ఇక్కట్లు కోర్టు కేసులు వేసినప్పటికీ, కొండల్ని, గుట్టల్ని, అడవుల్లో దాటుకొని కృష్ణా జలాల్ని కరువు సీమ ప్రకాశం జిల్లా, నెల్లూరు కడప జిల్లాకు తరలించిన ఘన చరిత్ర చంద్రబాబుదని అని అన్నారు. ఈ ప్రాజెక్టుకు ఈ ప్రాంత కమ్యూనిస్టు నాయకుడు పూల సుబ్బయ్య నామకరణం చేయడం వాళ్ళ కుమార్తెలను పిలిచి సన్మానించి గౌరవించడం చరిత్రలో మర్చిపోలేని ఘట్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, టీడీపీ కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, తెలుగు యువత నాయకుడు వినోద్ కుమార్, బంగారుపాలెం టీడీపీ నాయకుడు రాగిమానుపెంట మదన్, టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో.. సేవల్లో పరిటాల రవి ముద్ర

## వచ్చే ఎన్నికల్లో కనగానపల్లి నుంచే గెలుపు ప్రారంభం కావాలన్న ఎమ్మెల్యే సునీత




రాప్తాడు (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి విషయంలో రాజీ లేకుండా పనిచేస్తున్నామని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అలాగే పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ద్వారా జరుగుతున్న సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా సాగుతున్నాయన్నారు. మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు పరిటాల రవీంద్ర 68వ జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని కనగానపల్లి మండలకేంద్రంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కక్కలపల్లి టమోటా మండీల నిర్వాహకుల సహకారంతో పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తోపుడు బండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని 6మండలాలలో ఉన్న చిరు వ్యాపారుల ఉపాధికి ఊతం కల్పించే ఆలోచనతో.. రూ. 18లక్షల విలువైన, 120 తోపుడు బండ్లను వ్యాపారులు సమకూర్చారు. వాటిని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాలకు చెందిన 50మంది చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే సునీత అందజేశారు. 7లక్షల 50వేల రూపాయల విలువైన బండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బోయపాటి సుధాకర్, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, కన్వీనర్లు పోతలయ్య, సుధాకర్‌తో పాటు కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల క్లస్టర్, యూనిట్ ఇంచార్జీలు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ పరిటాల రవి జయంతి సందర్భంగా చాలా ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రితో పాటు ధర్మవరంలో కూడా సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. పరిటాల రవి పై అభిమానంతో ఇన్నేళ్లుగా తమకు అండగా ఉంటూ వస్తున్నారన్నారు. మీరు చూపుతున్న ప్రేమ ఎప్పటికీ మరువలేమన్నారు. మీ సహకారంతోనే తాను రాజకీయాల్లో రాణిస్తున్నట్టు చెప్పారు. అయితే పార్టీలో ఎవరైనా సరే కష్టపడే వారికే ప్రధాన్యత, పదవులు ఉంటాయన్నారు. గతంలోలా ఇప్పుడు పరిస్థితులు లేవన్నారు. ఏగ్రామంలో ఏం జరుగుతోంది, ఎవరు ఏం చేస్తున్నారు, ఎవరు ఏం మాట్లాడుతున్నారో కూడా తనకు తెలుసునన్నారు. కనగానపల్లి మండలంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. ప్రతి గ్రామంలోనూ మనం చేసిన అభివృద్ధి కనిపిస్తోందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మన పార్టీ విజయం కనగానపల్లి నుంచే ప్రారంభం కావాలన్నారు. రాష్ట్రం ఆర్థికంగా లోటు బడ్జెట్ లో ఉన్న అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి చంద్రబాబు కొనసాగిస్తున్నారన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ అవకాశం కల్పించి ఎంతో మేలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అయితే బస్సులు, సిబ్బంది సరిపోక మహిళలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించానని గుర్తు చేశారు. త్వరలోనే కొత్త బస్సులు, సిబ్బందిని నియమిస్తారన్నారు. మరోవైపు చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా 16347ఉపాధ్యాయ పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తే.. దానిపై సైకో జగన్ రెడ్డి విషం చిమ్ముతున్నారన్నారు. మనం చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని కూడా ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని ఎమ్మెల్యే సునీత పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## నందికొట్కూరులో విస్తృతంగా ఇంటింటికీ టీడీపీ

నందికొట్కూరు (చైతన్యరథం): రుద్రవరం గ్రామంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు కార్యకర్తలు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.





# పరిటాల పేరు వందేళ్లు నిలిచేలా సేవా కార్యక్రమాలు

## ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ వెల్లడి

ధర్మవరం (చైతన్యరథం): టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర పేరు వందేళ్లు బ్రతికి ఉండేలా సేవా కార్యక్రమాలు చేస్తామని.. ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ తెలిపారు. పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ద్వారా ధర్మవరం మున్సిపాలిటీకి రెండు చెత్త తరలించే ఎలక్ట్రికల్ వాహనాలను అందజేశారు. పట్టణంలోని నేసేపేట పుట్లమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కు ఈ వాహనాలను అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, స్థానిక పట్టుచీరల వ్యాపారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ పరిటాల రవి ఏ కార్యక్రమం చేపట్టినా.. ఆయనకు మొదట అండగా నిలిచింది.. ధర్మవరం ప్రాంత ప్రజలని అన్నారు. ట్రస్టు ద్వారా చేపట్టే ప్రతి కార్యక్రమానికి ధర్మవరం ప్రాంతంలోని వ్యాపారులు ప్రజలు ఎంతో సహకారం అందించారన్నారు. కర్నూలు వరదల సమయంలో రెండు గ్రామాలను దత్తత తీసుకుంటే.. అక్కడికి పెద్ద ఎత్తున తరలివచ్చి సాయం అందించారన్నారు. జిల్లాలో ఎంత వెనుకబడిన ప్రాంతమైనప్పటికీ.. ఎక్కడ ఏ విపత్తు జరిగినా ముందుండి సాయం చేసేవారు మన జిల్లాలో ఉన్నారన్నారు. అలాగే పరిటాల రవి ఉన్న సమయంలో కూడా కోస్తా ప్రాంతంలో వరదలు వచ్చినప్పుడు ధర్మవరం ప్రాంత వ్యాపారులు, వాలంటీర్లు ముందుకు వచ్చి సాయం చేశారని గుర్తు చేశారు. ధర్మవరం దాతృత్వానికి దాతలకు నిలయంగా ఉంటుందని శ్రీరామ్ అన్నారు. పరిటాల రవీంద్ర ట్రస్టు ద్వారా పెళ్లిళ్లు రక్తదాన శిబిరాలు చేసినప్పుడు కూడా ఈ ప్రాంత ప్రజల భాగస్వామ్యం ఎంతో ఉందని గుర్తు చేసుకున్నారు. ధర్మవరం ప్రాంతం ఒక వ్యాపార వాణిజ్య కేంద్రంగా సిల్క్ సిటీగా ఉన్న ఈ ప్రాంతంలో పరిశుభ్రత చాలా ముఖ్యమన్నారు. మున్సిపాలిటీ ద్వారా ఉన్న వాహనాలు కూడా సరిపోని పరిస్థితి ఉందన్నారు. అందుకే తాము ఎలక్ట్రికల్ వాహనాలను అందించామన్నారు. అయితే చిన్న చిన్న సందుల్లోకి వెళ్లే విధంగా ఈ వాహనాలు ఉంటాయని చెప్పారు. చెత్త బరువును మోసే విధంగా ఈ వాహనాలు ఉన్నాయా లేదా అన్నది ఒకటికి రెండుసార్లు పరిశీలించి కొనుగోలు చేశామన్నారు.

ప్రస్తుతం నేసే పేట, తేరు బజార్ వంటి వాణిజ్య ప్రాంతాల్లో ఉండేలా ఈ వాహనాలు అందించామని.. ఇవి బాగా పనిచేసినట్లైతే ధర్మవరం మున్సిపాలిటీలోని ప్రతి డివిజన్ కు ఇలాంటివి ఉండేలా చేస్తామని చెప్పారు. సింగపూర్ లాంటి దేశాల్లో చెత్త అన్నది ఎక్కడ కనిపించదని.. ఒకవేళ పొరపాటున ఎవరైనా చెత్త వేస్తే జరిమానాలు విధిస్తారన్నారు. అందుకే ఒక ఆదర్శవంతమైన దేశంగా సింగపూర్ ఉందన్నారు.

అలాంటి సాంప్రదాయం కూడా ధర్మవరంలో రావాలన్నారు. ఒకప్పుడు పరిటాల రవి ధర్మవరంలో ఉన్న ఒక చెత్తను ఊడ్చిపడేశారని.. ఇప్పుడు ఆయన ట్రస్టు పేరుతో అసలైన చెత్తను తాము ఊడుస్తామని శ్రీరామ్ తెలిపారు.

# అమరావతి కోసం దళిత, గిరిజన రైతుల ముందడుగు!

## ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు డాక్టర్ వరప్రసాద్



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి దళిత, గిరిజన రైతులు తమ వంతు సహకారం అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు డాక్టర్ కొండారెడ్డి నరహరి వరప్రసాద్ తెలిపారు. రాజధాని పరిధిలో నిర్మిస్తున్న రహదారులకు అవసరమైన గ్రావెల్ (ఎర్రమట్టి)ను పల్నాడు, ఎన్టీఆర్, గుంటూరు, ఏలూరు జిల్లాలకు చెందిన పలువురు దళిత, గిరిజన రైతులు తమ భూముల నుంచి చట్టబద్ధమైన అనుమతులతో సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. పట్టా, అసైన్డ్, ఆర్.ఓ.ఎఫ్.ఆర్ భూముల్లో లభ్యమయ్యే గ్రావెల్‌ను నిబంధనలకు అనుగుణంగా రాజధాని రహదారుల నిర్మాణానికి వినియోగించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారని, ఇందుకు అవసరమైన అనుమతుల కోసం మైనింగ్ శాఖ, జిల్లా యంత్రాంగాన్ని సంప్రదిస్తున్నారని తెలిపారు.

### పల్నాడు నుంచి ఏలూరు వరకు రైతుల ముందడుగు

పల్నాడు జిల్లాలో పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని కోసూరు, కొండూరు, శ్రీనివాస తాండా, అచ్చంపేట, తాళ్వాయి, తల్లూరు తదితర గ్రామాలకు చెందిన రైతులు గ్రావెల్ సరఫరాకు సిద్ధంగా ఉన్నారని నరహరి వరప్రసాద్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో మైలవరం నియోజకవర్గంలోని కొత్తూరు, తాడేపల్లి, మైలవరం పరిసర ప్రాంతాలకు చెందిన దళిత, గిరిజన రైతులు కూడా అమరావతి నిర్మాణంలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో ముందుకు వస్తున్నారని చెప్పారు. అదేవిధంగా ఏలూరు జిల్లాలో నూజివీడు నియోజకవర్గంలోని నూజివీడు, అగిరిపల్లి, ఈదర, తుప్పరమెట్ల తదితర ప్రాంతాలకు చెందిన రైతులు కూడా అమరావతి నిర్మాణానికి తమ వంతు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.అనేక సంవత్సరాలుగా వర్షాధార పంటలపైనే ఆధారపడి జీవిస్తున్న గిరిజన రైతులు డీకేటీ భూములు, కొన్ని =ాఖీ= పట్టాలు కలిగి ఉన్నారని నరహరి వరప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం తగిన వర్షాలు లేక పంటలు సాగు చేయలేని పరిస్థితుల్లో పలువురు రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో తమ భూముల్లో లభ్యమయ్యే గ్రావెల్‌ను చట్టబద్ధమైన అనుమతులతో రాజధాని రహదారుల నిర్మాణానికి సరఫరా చేయడం ద్వారా రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గం ఏర్పడుతుందని ఆయన అన్నారు. అమరావతి కేవలం ఒక రాజధాని నిర్మాణం మాత్రమే కాదని, రాష్ట్ర భవిష్యత్తు అభివృద్ధికి దిశానిర్దేశం చేసే మహత్తర ప్రాజెక్టు అని దళిత, గిరిజన రైతులు భావిస్తున్నారని నరహరి వరప్రసాద్ పేర్కొన్నారు. తమ భూమి ద్వారా తమకు ఉపాధి లభించడంతో పాటు, అదే భూమి నుంచి లభించే వనరులతో రాష్ట్ర రాజధాని నిర్మాణానికి సహకరించాలనే రైతుల ఆలోచన అభినందనీయమని ఆయన అన్నారు.

### చంద్రబాబు, మోదీ నాయకత్వంపై దళిత, గిరిజన రైతుల్లో నమ్మకం

ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అమరావతి రాజధాని అభివృద్ధి పట్ల స్పష్టమైన నిబద్ధతతో ఉన్నారని డా. నరహరి వరప్రసాద్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అమరావతి నిర్మాణం వేగం పుంజుకుంటున్న నేపథ్యంలో రాజధాని నిర్మాణంలో దళిత, గిరిజన రైతులు కూడా భాగస్వాములు కావాలని కోరుకోవడం అమరావతిపై వారికి ఉన్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. రాజధాని నిర్మాణానికి తమ వంతు సహకారం అందించాలనుకుంటున్న దళిత, గిరిజన రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలని డా. నరహరి వరప్రసాద్ కోరారు. నిబంధనలకు లోబడి ఉన్న ప్రతిపాదనలను మైనింగ్ శాఖ, జిల్లా యంత్రాంగం సత్వరమే పరిశీలించి, అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అమరావతి నిర్మాణం ప్రభుత్వం బాధ్యత మాత్రమే కాదని, రాష్ట్ర ప్రజలందరి భాగస్వామ్యంతో అది ఒక ప్రజా ఉద్యమంగా మారాలని ఆకాంక్షించారు. “అమరావతికి మా భూములు.. మా శ్రమ.. మా సహకారం” అనే సంకల్పంతో దళిత, గిరిజన రైతులు ముందుకు రావడం రాష్ట్ర అభివృద్ధి పట్ల వారి నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అమరావతి ప్రపంచస్థాయి రాజధానిగా ఎదగాలని ప్రతి రైతు ఆకాంక్షిస్తున్నారని డాక్టర్ కొండారెడ్డి నరహరి వరప్రసాద్ పేర్కొన్నారు.

# ఐదు దశాబ్దాల సమాజ సేవకు నీరాజనం

## డాలస్‌లో డాక్టర్ భానుమతిని ఘనంగా సత్కరించిన ప్రవాస భారతీయులు: 'జీవిత సాఫల్య పురస్కారం' ప్రదానం





**డాలస్:** అమెరికాలోని డాలస్ నగరంలో అనేక దశాబ్దాలుగా నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు అందించి అందరి అభిమానాన్ని చూరగొన్న 90 ఏళ్ల ప్రవాసాంధ్రురాలు డాక్టర్ భానుమతి ఇవటూరి మాతృదేశానికి పయనమయ్యారు. అమెరికాలో ఐదు దశాబ్దాల పాటు సుదీర్ఘ జీవితాన్ని గడిపిన ఆమె చరమాంకంలో భారతదేశంలో నివసించేందుకు బయల్దేరిన సందర్భంగా డాలస్‌లోని పలు తెలుగు, ప్రవాస భారతీయ సంఘాల ప్రతినిధులు ఆమెకు ఆత్మీయ వీడ్కోలు పలికి ఘనంగా సన్మానించారు. ఆమె సేవలను గుర్తిస్తూ ప్రవాస సంఘాల నాయకులు ఉమ్మడిగా 'జీవిత సాఫల్య పురస్కారం' అందజేశారు.

**బహుముఖ సామాజిక సేవలు:**

డాలస్‌లోని పార్క్‌ల్యాండ్ హాస్పిటల్, డాలస్ కౌంటీ ఫ్యామిలీ కోర్ట్ సర్వీసెస్, డాలస్ కౌంటీ చైల్డ్ వెల్ఫేర్ వంటి ప్రముఖ సంస్థల ద్వారా డాక్టర్ భానుమతి విశేష సేవలందించారు. ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం, బాలల సంక్షేమం, కుటుంబ న్యాయస్థాన సేవలు, గృహహింస బాధితులకు బాసటగా నిలవడం, వృద్ధుల సంక్షేమం వంటి రంగాల్లో ఆమె ఆపన్నులకు అండగా నిలిచారు. సత్కార సభలో ఇండియా అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్ (IANT) పూర్వాధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ... 'సమస్యకు–పరిష్కారానికి మధ్య, వివాదానికి–అవగాహనకు మధ్య, గందరగోళానికి–స్పష్టతకు మధ్య, నిరాశకు–ఆశకు మధ్య డాక్టర్ భానుమతి ఒక వెలుగుదారిగా నిలిచారు' అని కొనియాడారు. కేవలం పదవులు, హోదాలు కాకుండా 'మన వల్ల ఎంతమంది జీవితాలు మెరుగుపడ్డాయి' అనేదే నిజమైన విజయానికి ప్రామాణికమని నమ్మిన ఆదర్శమూర్తి ఆమె అని ప్రశంసించారు.

డాక్టర్ భానుమతి మాట్లాడుతూ... 'అతి తక్కువ సమయంలో, వారాంతం అయినప్పటికీ ఈ ఆత్మీయ సమావేశానికి దాదాపు వంద మందికి పైగా హాజరై విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ, నిర్వాహకులకు నా ప్రత్యేక ధన్యవాదాలు. ఈ రోజు నా జీవితంలో ఒక మధురమైన రోజుగా మిగిలిపోతుంది" అని ఆనందం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో టాంటెక్స్ (TANTEX) అధ్యక్షురాలు మాధవి లోకిరెడ్డి, ఐఏఎన్‌టీ ప్రతినిధులు షబ్నం మాడ్గిల్, తైయాబ్ కుండావాల, సుష్మా మల్హోత్రా, సత్యన్ కళ్యాణ్ దుర్గ్, టాంటెక్స్ పూర్వాధ్యక్షులు శ్రీధర్ కోడెల, డాక్టర్ నరసింహారెడ్డి ఊరిమిండి, సుబ్రహ్మణ్యం జొన్నలగడ్డ, చినసత్యం వీర్నపు, రామకృష్ణ నూనె, ఆటా (ATA) నియమిత అధ్యక్షుడు సతీష్ రెడ్డి, నాట్స్ (NATS) పూర్వాధ్యక్షుడు బాపు నూతి, తానా (TANA) బోర్డు పూర్వ కార్యదర్శి మురళి వెన్నం, కమ్యూనిటీ నాయకులు ఎంవీఎల్ ప్రసాద్, రావు కల్వల, డాక్టర్ పుదూర్ జగదీశ్వరన్ డాక్టర్ భానుమతికి శుభాకాంక్షలు తెలిపారు.

### తానా విశ్వ గురుకులం ఆధ్వర్యంలో


# 'రామాయణం నైతిక విలువల తరగతులు'

**యూఎస్ఏ:** ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) విశ్వ గురుకులం ఆధ్వర్యంలో పిల్లల కోసం 'రామాయణం నైతిక విలువల తరగతులు' ప్రారంభించనున్నారు. జీవితానికి అవసరమైన నైతిక విలువలు, కుటుంబ బంధాలు, క్రమశిక్షణ, గౌరవం, ధర్మం, భారతీయ సంస్కృతిని భావితరాలకు అందించేలా ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారు.

తరగతుల ముఖ్య ఉద్దేశం: భారతీయ సంస్కృతి, వారసత్వాన్ని పరిరక్షించడం. కుటుంబ విలువలు, వ్యక్తిత్వ వికాసానికి పెద్దపీట వేయడం. భావితరాలకు మన ప్రాచీన జ్ఞాన సంపదను అందించడం. అన్ని వయసుల వారి కోసం ఏర్పాటు చేసిన ఈ తరగతులు బుధ, గురు, శని, ఆదివారాల్లో జరుగుతాయి.

రిజిస్ట్రేషన్ లింక్:
https://events.tana.org/event/viswa-gurukulam-2026
ఈ–మెయిల్:
viswagurukulam@tana.org

'రామాయణం మన సంస్కృతికి మూలస్తంభం... భావితరాలకు అందిద్దాం' అనే నినాదంతో ముందుకు వెళ్తున్న ఈ విలువైన కార్యక్రమాన్ని మీ కుటుంబ సభ్యులు, స్నేహితులతో పంచుకుని మరింత మంది పిల్లలకు ఈ అవకాశాన్ని అందించాలని 'తానా' నిర్వాహక వర్గం డాక్టర్ నరేన్ కొడాలి (ప్రెసిడెంట్), శ్రీనివాస్ లావు (ఈవీపీ), రజని మరం కోరారు.




# లండన్‌లో తెలుగు బాలుడి వండర్

## ఏడేళ్ల వయసులోనే జీసీఎస్ఈ గణిత పరీక్షలో ప్రతిభ

## 240కి 196 మార్కులతో 'గ్రేడ్ 8ఎ' కైవసం




**లండన్:** తెలుగు సంతతికి చెందిన ఏడేళ్ల చిచ్చరపిడుగు మ్యాథమెటిక్స్‌లో సరికొత్త రికార్డు సృష్టించాడు. సాధారణంగా 16 ఏళ్ల వయసున్న విద్యార్థులు రాసే అత్యంత క్లిష్టమైన 'పియర్సన్ ఎడెక్సెల్ జనరల్ సర్టిఫికెట్ సెకండరీ ఎడ్యుకేషన్ (GCSE)' హయ్యర్ మ్యాథమెటిక్స్ పరీక్షలో ఏడేళ్ల జీవ్యాన్ రెడ్డి ధ్రువ కట్టా అపూర్వ ప్రతిభ కనబరిచాడు. ఈ బ్రిటన్ జాతీయ స్థాయి పరీక్షలో 3 పేపర్లకు మొత్తం 240 మార్కులకు 196 మార్కులు సాధించి 'గ్రేడ్ 8ఎ'తో సత్తా చాటాడు. ఈ ఏడాది మే నెలలో జరిగిన ఈ పరీక్ష ఫలితాలు ఇటీవల వెలువడగా బాలుడి మేధస్సుపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

**పెద్దయ్యాక రోబోలు ఆవిష్కరిస్తా: జీవ్యాన్**

తన ఘనతపై జీవ్యాన్ స్పందిస్తూ... "నాకు లెక్కలంటే చాలా ఇష్టం. క్లిష్టమైన సమస్యలకు రకరకాల పద్ధతుల్లో సమాధానాలు కనుగొనడం నాకొక హాబీ. ఈ పరీక్షలో ఇంకా మంచి గ్రేడ్ వస్తుందని భావించినా గ్రేడ్ 8ఎ రావడం ఆనందంగా ఉంది. భవిష్యత్తులో 'ఎ' లెవెల్ మ్యాథ్స్ పూర్తిచేసి మానవాళికి ఉపయోగపడే రోబోలను ఆవిష్కరించాలనుకుంటున్నాను' అని చెప్పాడు.

కాగా గణిత మేధావిగా గుర్తింపు పొందిన జీవ్యాన్ రెడ్డి తల్లిదండ్రులు కట్టా ధ్రువకుమార్ రెడ్డి, ఐశ్వర్యరెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారు. వీరు ప్రస్తుతం పశ్చిమ లండన్ లోని సౌత్ రుయిస్లిప్ ప్రాంతంలో స్థిరపడ్డారు. కుమారుడు సాధించిన ఈ అరుదైన విజయంపై వారు ఆనందం వ్యక్తం చేశారు.

# భారతీయ పర్యాటకులకు అబుదాబి బంపర్ ఆఫర్

## మూడు రాత్రుల హోటల్ ప్యాకేజీ బుక్ చేసుకుంటే 'ఉచిత యూఏఈ ఎంట్రీ వీసా'

## అక్టోబరు 31 వరకు ఆఫర్ అమల్లో ఉంటుందని వెల్లడించిన 'డీసీటీ అబుదాబి'

**అబుదాబి:** భారతీయ పర్యాటకులను ఆకట్టుకునేందుకు అబుదాబి ప్రభుత్వం సరికొత్త నిర్ణయాన్ని ప్రకటించింది. అబుదాబిలో కనీసం మూడు రాత్రుల (చీఅస్త్రష్ట్రం) హాలిడే ప్యాకేజీ బుక్ చేసుకునే భారతీయ పర్యాటకులకు 'యూఏఈ ఎంట్రీ వీసా'ను ఉచితంగా అందించనున్నట్టు తెలిపింది. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ కల్చర్ అండ్ టూరిజం–అబుదాబి (DCT Abu Dhabi) ఒక కొత్త టూరిజం కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆగస్టు 1న ప్రారంభమైన ఈ అపూర్వమైన ఆఫర్ అక్టోబరు 31 వరకు అందుబాటులో ఉంటుందని, ప్రారంభ దశలో గరిష్ఠంగా 20 వేల ఉచిత వీసాలను ఈ పథకం కింద అందిస్తామని స్పష్టం చేసింది.

భారత్ నుంచి ప్రయాణించే భారతీయ పాస్‌పోర్ట్‌దారులు ఈ ఆఫర్ పొందడానికి అర్హులు. అయితే పర్యాటకులు ఈ కింది నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది: DCT Abu Dhabiతో భాగస్వామ్యం ఉన్న ట్రావెల్ ఏజెన్సీలు లేదా ఆన్‌లైన్ ట్రావెల్ పోర్టల్స్ ద్వారా మాత్రమే బుకింగ్ చేసుకోవాలి. అబుదాబిలోని హోటళ్లలో వరుసగా కనీసం మూడు రాత్రులు బస చేయాల్సి ఉంటుంది. భారత్ నుంచి వెళ్లి తిరిగి భారత్‌కే వచ్చే రిటర్న్ ఫ్లైట్ టికెట్ తప్పనిసరిగా ఉండాలి.

అర్హత కలిగిన హాలిడే ప్యాకేజీ బుకింగ్ చేసుకున్న పర్యాటకుల వద్ద నుంచి యూఏఈ ఎంట్రీ వీసాకు సంబంధించి ఎలాంటి అదనపు రుసుము వసూలు చేయరు. వీసా ప్రాసెసింగ్ కోసం అయ్యే ఖర్చును 'డీసీటీ అబుదాబి' స్వయంగా భరిస్తుంది. ఇందుకోసం ట్రావెల్ ఏజెన్సీలకు ఒక్కో వీసాకు 285 దిర్హామ్‌ల చొప్పున డీసీటీ రీయింబర్స్ చేస్తుంది.

భారత పర్యాటక మార్కెట్‌కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, కనెక్టివిటీని పెంచడం, భారతీయ ప్రయాణికులకు అబుదాబిని మరింత అందుబాటులోకి తీసుకురావడమే ఈ పథకం ముఖ్య లక్ష్యమని డీసీటీ అబుదాబి అధికారులు పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో భారతీయ పర్యాటకులు అబుదాబి సంస్కృతి, వినోదం, ఆతిథ్యాన్ని మరింత ఎక్కువ కాలం ఆస్వాదించే అవకాశం లభిస్తుందని వారు తెలిపారు.

# 'తానా' పాఠశాల రిజిస్ట్రేషన్లు ప్రారంభం

**ఉత్తర అమెరికా:** 'దేశ భాషలందు తెలుగు లెస్స... మన తెలుగు–మన పిల్లల కోసం" నినాదంతో ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తానా పాఠశాల 2026–27 విద్యా సంవత్సరానికి ప్రవేశాలను ప్రారంభించింది. తరతరాలకు మన మాతృభాషను, సంస్కృతి, సంప్రదాయాలను అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని నిర్వాహకులు తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠ్యాంశాలతో పిల్లలకు సరదాగా తెలుగు నేర్పించే ఈ అద్భుత అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**కోర్సులు:**

తెలుగు పలుకు (లెవెల్ 1)
తెలుగు అడుగు (లెవెల్ 2)
తెలుగు పరుగు (లెవెల్ 3)
తెలుగు వెలుగు (లెవెల్ 4)

**రిజిస్ట్రేషన్ లింక్:**
https://paatasala.tana.org/registration
ఈ–మెయిల్: paatasala@tana.org

ఈ సమాచారాన్ని మీ కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఇతర తెలుగు కుటుంబాలతో పంచుకోవడం ద్వారా మరింత మంది పిల్లలు మాతృభాషను అభ్యసించేలా సహకరించాలని 'తానా' విజ్ఞప్తి చేసింది.

**నిర్వాహక వర్గం:** నరేన్ కొడాలి (అధ్యక్షుడు), శ్రీనివాస్ లావు (ఈవీపీ), భాను మగులూరి (పాఠశాల చైర్)

**మరిన్ని వివరాలకు:** ప్రసాద్ మంగిన: +1–408–499–6530, రావు యలమంచిలి: +1 (203) 815–7627, రజని మరం: +1 (301) 537–5001, శ్రీనివాసులు పనుగంటి: +1 (732) 925–9341, సునీల్ దేవరపల్లి: +1 (404) 536–1183, కె.శేఖర్‌చంద్ర: +91 9030549211లను సంప్రదించాలి.



# భారత ప్రధాని మోదీ, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ భేటీ

## రెండు దేశాల మధ్య సహకారాన్ని మరింత విస్తరించాల్సిన ఆవశ్యకతపై చర్చ



షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో ద్వైపాక్షిక భేటీ నిర్వహించారు. కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో సోమవారం ఈ సమావేశం జరిగింది. ఫిబ్రవరిలో ఇరాన్-అమెరికా యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇరువురు నేతలు ప్రత్యక్షంగా కలుసుకోవడం ఇదే తొలిసారి కావడం విశేషం. భారత్, ఇరాన్ ద్వైపాక్షిక సంబంధాల తాజా పరిస్థితిని ఇరువురు నేతలు సమీక్షించారు. పరస్పర ఆసక్తి ఉన్న రంగాల్లో రెండు దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసి, విస్తరించాల్సిన అవసరం గురించి చర్చించారు. ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చితో పాటు పలువురు ఉన్నతాధికారులు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న సమయంలో ఈ కీలక భేటీ ఆసక్తికరంగా మారింది. అమెరికా ఇరాన్ మధ్య యుద్ధం, హార్ముజ్ జలసంధి మూసివేత, అమెరికా ఆంక్షల కారణంగా భారత్ సహా పలు దేశాల వాణిజ్య కార్యకలాపాలపై ప్రభావం పడుతోంది. భారత్‌కు ఇరాన్ భౌగోళికంగా, వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలక దేశం. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణలు, హార్ముజ్ జలసంధి మూసివేత, ఇరాన్‌పై అమెరికా ఆంక్షల నేపథ్యంలో మోదీ, పెజెష్కియాన్ ముఖాముఖి చర్చలు జరపడం రెండు దేశాల భవిష్యత్ సహకారానికి కీలక పరిణామంగా మారింది. ఎస్‌సీఓ సదస్సు సందర్భంగా మోదీ ఇప్పటికే ఆర్మేనియా ప్రధాని నికోల్ పషిన్యాన్‌తో కూడా సమావేశమయ్యారు. రక్షణ, ఆర్థిక వ్యవహారాలు, ఫార్మా, సైన్స్ అండ్ టెక్నాలజీ, సంస్కృతి, విద్య వంటి రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచుకోవడంపై ఇరువురు చర్చించారు. అలాగే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో కూడా మోదీ భేటీ కావాల్సి ఉంది. అలాగే కిర్గిజిస్థాన్ అధ్యక్షుడు సదీర్ జపరోవ్ ఆహ్వానం మేరకు 6వ వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మోదీ పాల్గొననున్నారు.



# విదేశాల్లో అలరించిన మోదీ కవితా వెల్లువ

## ఉజ్బెకిస్థాన్ పర్యటనలో ప్రత్యేక సాంస్కృతిక ఘట్టం

ప్రధాని నరేంద్ర మోదీ ఉజ్బెకిస్థాన్ పర్యటనలో రాజకీయ, దౌత్య అంశాలతో పాటు ఒక ప్రత్యేక సాంస్కృతిక ఘట్టం కూడా చోటు చేసుకుంది. మోదీ స్వయంగా రచించిన 'అభీ తో సూరజ్ ఉగా హై' కవితను ఉజ్బెక్ విద్యార్థులు హిందీ, ఉజ్బెక్ భాషల్లో ఆలపించారు. ఈ కార్యక్రమానికి మోదీ కూడా హాజరయ్యారు. ఉదయించే సూర్యుడిని కొత్త ప్రారంభానికి ప్రతీకగా అన్వయిస్తూ 'అభీ తో సూరజ్ ఉగా హై' కవితను ప్రధాని రాశారు. ప్రధాని మోదీ రచించిన మూడు కవితలను తాష్కెంట్‌లోని స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ ఓరియెంటల్ స్టడీస్‌లో విద్యార్థులు చదివి వినిపించారు. ప్రతి కవితను హిందీతో పాటు ఉజ్బెక్ అనువాదంలోనూ వినిపించారు. ఈ ప్రదర్శనకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ తాష్కెంట్‌లోని కుక్సారోయ్ ప్యాలెస్‌లో మోదీ కోసం ఏర్పాటు చేసిన అనధికారిక విందులో కూడా 'అభీ తో సూరజ్ ఉగా హై' ఆధారంగా ప్రత్యేక సంగీత ప్రదర్శన నిర్వహించారు. మోదీ, మిర్జియోయెవ్ కలిసి ఈ ప్రదర్శనను వీక్షించారు. కార్యక్రమంలో కవితకు సంబంధించిన హిందీ పదాలను స్క్రీన్‌పై ప్రదర్శించారు.

# నిలిపేసిన సింధూ జలాల ఒప్పందంపై భారత్ నిర్ణయం యథాతథం

## హేగ్‌లోని కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఇచ్చిన తాజా తీర్పు తిరస్కరణ



భారత్ పాకిస్థాన్ మధ్య కీలకమైన 'ఇండస్ వాటర్స్ ట్రీటీ' (సింధు జలాల ఒప్పందం)పై హేగ్‌లోని కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఇచ్చిన తాజా తీర్పును భారత తిరస్కరించింది. భారత సార్వభౌమ నిర్ణయాలపై ఆ కోర్టుకు ఎలాంటి అధికారమూ లేదని విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ప్రపంచ బ్యాంక్ ప్రోద్బలంతో ఈ కోర్టు చట్టవిరుద్ధంగా ఏర్పాటైందని భారత్ పేర్కొంది. ఒప్పంద నిబంధనలకు విరుద్ధంగా ఈ కోర్టును ఏర్పాటు చేశారని, అందువల్ల దాని తీర్పులను భారత్ అంగీకరించబోదని స్పష్టం చేసింది. 1960లో భారత్, పాకిస్థాన్ మధ్య సింధు జలాల ఒప్పందం కుదిరింది. సింధు నదీ వ్యవస్థలోని జలాలను ఇరు దేశాలు ఎలా వినియోగించుకోవాలనే విషయాన్ని ఈ ఒప్పందం నిర్దేశిస్తుంది. అయితే 2025 ఏప్రిల్‌లో పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ ఈ ఒప్పందం అమలును నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. ఒప్పంద కార్యకలాపాలను నిలిపివేయాలన్న భారత్ నిర్ణయం ఇప్పటికీ అమల్లోనే ఉందని విదేశాంగ శాఖ తాజాగా మరోసారి స్పష్టం చేసింది. సింధు జలాల ఒప్పందానికి సంబంధించిన మధ్యంతర చర్యలు, ఒప్పంద స్థితిపై కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ సోమవారం తీర్పు జారీ చేసింది. ఈ ఒప్పందం ఇంకా అమల్లోనే ఉందని, దాన్ని నిలిపివేయడానికి భారత్‌కు సరైన కారణం లేదని కోర్టు పేర్కొంది. అలాగే జమ్మూకశ్మీర్‌లోని రాట్లే జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన కొన్ని అంశాలపై కూడా కోర్టు ఆంక్షలు విధించింది. అయితే ఈ తీర్పును భారత్ పూర్తిగా తిరస్కరించింది. తాజా పరిణామంతో భారత్, పాకిస్థాన్ మధ్య నీటి వివాదం మరోసారి అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది.

# కూతురి ఫీజు కోసం మారథాన్ గెలిచిన రమాబాయి రణబీర్

పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఎంతటి కష్టాన్నైనా భరిస్తారు. మహారాష్ట్రలోని బీడ్ జిల్లాకు చెందిన 47 ఏళ్ల రమాబాయి రణ్‌వీర్ ఇందుకు గొప్ప ఉదాహరణగా నిలిచారు. కూతురి చదువు ఫీజు కోసం మారథాన్‌లో పాల్గొన్న ఆమె.. చెప్పులు కూడా లేకుండా చీరతోనే పరుగెత్తి విజేతగా నిలిచారు. బహుమతిగా వచ్చిన రూ.3,000ను తన కూతురి చదువు కోసం ఉపయోగించనున్నారు. మహారాష్ట్రలోని అంబాజోగైలో ఖోలేశ్వర్ ఎడ్యుకేషనల్ కాంప్లెక్స్ అమృత మహోత్సవ వేడుకల్లో భాగంగా 'అమృత్ దౌడ్' మారథాన్ నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ చౌక్ నుంచి భాగ్యనగర్ చౌక్ వరకు ఈ పరుగు సాగింది. ఈ పోటీలో పలువురు యువతీ యువకులు స్పోర్ట్స్ షూస్, ట్రాక్‌సూట్లతో పాల్గొన్నారు. రమాబాయి మాత్రం సాధారణ చీర, చెప్పులతోనే పోటీకి వచ్చారు. ఆమె విజేతగా నిలుస్తారని అక్కడున్నవారు ఊహించలేదు. పరుగు ప్రారంభమైన కొద్దిసేపటికే రమాబాయి చెప్పులు జారిపోతుండడంతో వేగంగా పరుగెత్తడం కష్టంగా మారింది. దీంతో ఆమె చెప్పులను చేతితో పట్టుకుని ఒట్టి కాళ్లతోనే పరిగెత్తడం ప్రారంభించారు. చీరను కూడా సర్దుకుంటూ ఆమె వేగంగా పరిగెత్తారు. స్పోర్ట్స్ షూస్ ధరించిన యువ రన్నర్లు ఒక్కొక్కరినీ వెనక్కి నెట్టి రమాబాయి ఫినిషింగ్ లైన్‌ను అందరికంటే ముందుగా చేరుకున్నారు. దీంతో మారథాన్‌లో మొదటి స్థానాన్ని దక్కించుకున్నారు. మారథాన్‌లో మొదటి స్థానం సాధించిన రమాబాయికి రూ.3,000 నగదు బహుమతి లభించింది. ఈ మొత్తాన్ని తన కూతురి చదువుకు, ఫీజు చెల్లించేందుకు ఉపయోగించనున్నట్లు ఆమె తెలిపారు. ఆమె విజయం చూసిన ప్రేక్షకులు, నిర్వాహకులు భావోద్వేగానికి గురయ్యారు. ఒక తల్లి తన పిల్లల చదువు కోసం చూపించిన పట్టుదలకు అభినందనలు తెలిపారు.

# భారత్‌లో జావెలిన్ మిస్సైల్ తయారీ

## టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, జేజేవీ మధ్య అవగాహన ఒప్పందం



యుద్ధ ట్యాంకులను ధ్వంసం చేయగలిగిన జావెలిన్ మిసైల్స్‌ను భారత్‌లో తయారు చేసేందుకు టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, జావెలిన్ జాయింట్ వెంచర్ (జేజేవీ) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం, భారత్‌లో మిసైల్స్ అసెంబ్లీ అండ్ ఇంటిగ్రేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. అమెరికాకు చెందిన రక్షణ రంగ సంస్థలు లాక్‌హీడ్ మార్టిన్, ఆర్‌టీఎక్స్ బిజినెస్ సంయుక్తంగా జేజేవీని ఏర్పాటు చేశాయి. ఒప్పందం కుదిరిన విషయంపై ఆ సంస్థలు ప్రకటన విడుదల చేశాయి. అమెరికా నుంచి జావెలిన్ మిసైల్స్ కొనుగోలుకు భారత ఆర్మీ ఇటీవల అంగీకరించిన విషయం తెలిసిందే. జావెలిన్ మిసైల్ ఉత్పత్తికి సంబంధించి అన్ని అంశాలను పరిశీలించిన అనంతరం టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌ను ప్రధాన భాగస్వామ్య సంస్థగా ఎంపిక చేశామని జేజేవీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఎమ్ఓయూ ప్రకారం, జావెలిన్ మిసైల్స్‌కు సంబంధించి తుది అసెంబ్లీ, ఇంటిగ్రేషన్ కేంద్రాన్ని ఇరు సంస్థలు ఏర్పాటు చేయనున్నాయి. విడిభాగాల ఉత్పత్తి అవకాశాలను కూడా పరిశీలించనున్నాయి. భవిష్యత్తులో కూడా భారత్‌లో జావెలిన్ వ్యవస్థల ఉత్పత్తికి సహకరించేందుకు అంగీకారం కుదిరింది. జావెలిన్ అగ్రిమెంట్ గురించి గత వారం అమెరికా రాయబారి సెర్గియో మాట్లాడుతూ రక్షణ రంగంలో యూఎస్, భారత్‌ల మధ్య ఉన్న బలమైన సంబంధాలకు ఇది ఒక నిదర్శనమని అన్నారు. కలిసి పనిచేస్తే ఇరు దేశాల కంపెనీలకు కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. జావెలిన్ మిసైల్‌ను యూఎస్ ఆర్మీ ఇప్పటికే వినియోగిస్తోంది. అంతర్జాతీయంగా అనేక దేశాలు దీన్ని వినియోగిస్తున్నాయి. సైనికులు తమ భుజంపై నుంచి ప్రయోగించే ఈ మిసైల్స్ యుద్ధ ట్యాంకులతో పాటు అనేక ఇతర ఆర్మర్డ్ (రక్షణ కవచం) మిలిటరీ వాహనాలను, శత్రుస్థావరాలను ధ్వంసం చేస్తాయి.

# బంకుల్లో ఇథనాల్‌పై కోర్టుకెళ్లొచ్చు : సుప్రీం

పెట్రోల్ బంకుల్లో విక్రయించే ఇంధనంలో ఎంత శాతం ఇథనాల్ ఉందో తప్పనిసరిగా వెల్లడించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు స్వీకరించలేదు. అయితే ఈ అంశంపై పిటిషనర్ సంబంధిత హైకోర్టును, సంబంధిత అధికారిని ఆశ్రయించవచ్చని తెలిపింది. అడ్వొకేట్ నరేంద్ర కుమార్ గోస్వామి ఈ పిటిషన్ దాఖలు చేశారు. పెట్రోల్ బంకుల్లోని డిస్పెన్సింగ్ నాజిల్స్‌పై పెట్రోల్‌లో కలిపిన ఇథనాల్ శాతాన్ని స్పష్టంగా ప్రదర్శించాలని ఈ పిటిషన్‌లో నరేంద్ర కోరారు. వినియోగదారులకు ఇచ్చే పెట్రోల్ బిల్లులు, రసీదులపై కూడా ఇథనాల్ శాతాన్ని ముద్రించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. వినియోగదారులు తాము కొనుగోలు చేస్తున్న ఇంధనంలో అసలు ఏమి ఉందో తెలుసుకునే హక్కు కలిగి ఉన్నారని పిటిషనర్ వాదించారు. అయితే ఈ పిటిషన్ ప్రభుత్వ ఈ20 విధానాన్ని వ్యతిరేకించేది కాదని, కేవలం ఇంధనంపై పారదర్శకత, వినియోగదారుల అవగాహన కోసమేనని తెలిపారు. ఈ20 పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్, 80 శాతం పెట్రోల్ ఉంటుంది. దిగుమతి చేసుకునే ముడి చమురుపై భారత్ ఆధారపడటాన్ని తగ్గించడం, ఉద్గారాలను తగ్గించడం, దేశీయంగా ఉత్పత్తి చేసే బయోఫ్యూయల్స్ వినియోగాన్ని పెంచడం ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలు. అయితే ఈ20 ఇంధన వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో, ముఖ్యంగా అధిక ఇథనాల్ మిశ్రమాల కోసం రూపొందించని పాత వాహనాల విషయంలో ఎదురయ్యే సమస్యలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



# అమెరికాకు ఐఆర్‌జీసీ హెచ్చరిక



## ఇరాన్ లారక్ ఐలాండ్‌పై దాడి చేశారని ఆగ్రహం

ఇరాన్: హర్మూజ్ జలసంధిలోని లారక్ ఐలాండ్‌లో ఇరాన్‌కు చెందిన లాంచ్ సిస్టమ్స్ మీద అమెరికా దాడులు చేసింది. ఈ విషయాన్ని అమెరికా ఉన్నతాధికారి ధ్రువీకరించినట్లు అంతర్జాతీ య మీడియా సంస్థ రాయిటర్స్ పేర్కొంది. హర్మూజ్ జలసంధిలోని లారక్ ఐలాండ్‌లో ఇరాన్‌కు చెందిన రెండు లాంచర్స్ మీద అమెరికా సైన్యం సోమవారం తెల్లవారుజామున దాడులు చేసిందని కచ్చితంగా చెప్పగలను. ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ దళాలు హర్మూజ్‌లో సీమైన్స్ కలిగిన రాకెట్లను పేల్చడానికి సిద్ధమవుతుండగా అమెరికా దాడులు చేసింది’ అని ఆయన రాయిటర్స్‌తో తెలిపారు. అమెరికా దాడులను ఐఆర్‌జీసీ ధ్రువీకరించింది. లారక్ ఐలాండ్‌లో అమెరికా దాడులు చేసిందని.. పలువురు సైనికులు, సామాన్య ప్రజలు గాయపడ్డారని తెలిపింది. మరికొంతమంది ప్రాణాలు కోల్పోయారని వెల్లడించింది. అమెరికా దాడులపై ఐఆర్‌జీసీ తీవ్రంగా స్పందించినట్లు ఇరాన్ స్టేట్ మీడియా తెలిపింది. దాడికి కచ్చితమైన స్పందన ఉంటుందని, భారీ మూల్యం తప్పదని ఐఆర్‌జీసీ హెచ్చరించినట్లు పేర్కొంది. లారక్ ఐలాండ్ హర్మూజ్ ఐలాండ్‌కు దక్షిణాన, కేశమ్ ఐలాండ్‌కు ఉత్తరాన ఉంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు లారక్ 1100 కిలోమీటర్ల దూరంలో ఉంది.

# కనిపించని 93 మంది ఆచూకీ



ఖాట్మండూ: భారీ వరదలకు రసువా జిల్లాలోని రసువాగఢి జలవిద్యుత్ ప్రాజెక్టు టన్నెల్‌లో చిక్కుకున్న 93 మంది కార్మికుల కోసం తీవ్రంగా సహాయక చర్యలు కొనసాగాయి. అయితే కార్మికుల ఆచూకీ కోసం చేపట్టిన గాలింపు చర్యలు ఫలించలేదు. నేపాలీ ఆర్మీ, ఇంజినీర్లు, డ్రోన్ నిపుణులతో కూడిన ప్రత్యేక బృందం టన్నెల్ చివరి వరకు వెళ్లి థర్మల్ డ్రోన్లతో విస్తృతంగా తనిఖీలు చేసినప్పటికీ ఎక్కడా ప్రాణాలతో ఉన్నవారి జాడ కనిపించలేదు. ఆగస్టు 26న భోటే కోషి నదిలో వరద ఉధృతి ఒక్కసారిగా పెరగడంతో వరదలు సంభవించాయి. ఆ సమయంలో రసువా గఢి హైడ్రోపవర్ ప్రాజెక్టు టన్నెల్‌లో పనిచేస్తున్న కార్మికులు లోపలే చిక్కుకుపోయి ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. వరదల అనంతరం నేపాలీ ఆర్మీ ఆధ్వర్యంలో సహాయక బృందాలు టన్నెల్‌లోకి ప్రవేశించి గాలింపు చేపట్టాయి. టన్నెల్‌లోని అత్యంత ప్రమాదకర ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించడం కష్టంగా ఉండటంతో థర్మల్ డ్రోన్లను రంగంలోకి దించారు. డ్రోన్ల బృందం టన్నెల్ చివరి భాగం వరకు చేరుకుని లోపలి ప్రాంతాలను పరిశీలించింది. అయితే, మనుషులు ఉన్నట్లు ఎలాంటి సంకేతాలు లభించలేదు. దీంతో గాలింపు చర్యలను నిలిపివేసినట్లు నేపాల్ ప్రధానమంత్రి కార్యాలయం సోమవారం వెల్లడించింది. కాగా, అనేక జలవిద్యుత్ ప్రాజెక్టుల్లోని భూగర్భ టన్నెల్‌లలో వందలాది మంది కార్మికులు పనిచేస్తుండగా వరదలు ముంచెత్తాయి. దీంతో భారీగా ప్రాణనష్టం, గల్లంతైన వారి సంఖ్య పెరుగుతోంది. జలవిద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించిన 933 మంది కార్మికులు గల్లంతైనట్లు నేపాల్ ప్రభుత్వం తెలిపింది. అలాగే ఇప్పటివరకు వివిధ హైడ్రోపవర్ ప్రాజెక్టుల టన్నెల్‌ల నుంచి 279 మందిని రక్షించినట్లు వెల్లడించింది. అయితే, వరదలు వచ్చినప్పుడు మిగిలిన కార్మికులు టన్నెల్‌లోనే చిక్కుకున్నారా? సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నారా? వరద ప్రవాహంలో కొట్టుకుపోయారా? అన్నది స్పష్టంగా తెలియడం లేదు. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

# వారి వల్ల రూ.5 లక్షల కోట్ల నష్టం

**- కెనడాపై ట్రంప్ ఆగ్రహం**

అమెరికా: అమెరికా-కెనడా మధ్య వాణిజ్య యుద్ధం రోజురోజుకూ తీవ్ర రూపం దాల్చుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలకు కెనడా ప్రధాని మార్క్ కార్నీ సహా ఇతర నేతలు గట్టిగా బదులు ఇస్తుండటంతో రెండు దేశాలు సంబంధాలు దిగజారుతున్నాయి. ఈ క్రమంలోనే ట్రంప్ మరో సారి ఆ దేశంపై విరుచుకుపడ్డారు. తమకు కెనడా నుంచి ఏమీ వద్దని పేర్కొన్న ఆయన.. తమ సుంకాలను తప్పించుకునేందుకు అక్కడి కంపెనీలన్నీ అమెరికాకు తరలి వచ్చేయాలని సూచించారు. ఆ దేశం దారుణమైన దుర్వినియోగదారు అని మండిపడ్డారు. ఈ మేరకు ట్రూత్‌లో వరుస పోస్టులు పెట్టారు. “2024 అధ్యక్ష ఎన్నికల్లో నేను పోటీ చేస్తున్నానని ప్రకటించిన సమయంలోనే డెట్రాయిట్లోని కీలక ఫ్యాక్టరీని మూసివేయడానికి ఫోర్డ్ సిద్ధమైంది. ఎన్నికల్లో నేను ఆధిక్యంలోకి రావడంతో ఏం జరుగుతుందో చూద్దామని ఆ సంస్థ వేచి చూసింది. ఇప్పుడు నిరంతరాయంగా నడుస్తూ.. భారీగా లాభాలను ఆర్జిస్తోంది. జనరల్ మోటార్స్, ఇతర సంస్థల విషయంలో ఇలాంటి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. సుంకాల వల్లే ఇదంతా జరిగింది. మనకు కెనడియన్ కార్లు, పరికరాలు సహా ఏమీ వద్దు. కెనడాతో వాణిజ్యంలో అమెరికా ఏటా 60 బిలియన్ డాలర్లకు పైగా (రూ.5.7 లక్షల కోట్లకు పైగా)



నష్టపోతోంది. దశాబ్దాలుగా ఈ దోపిడీ జరుగుతోంది. ఏనాడో మన నుంచి లాగేసుకున్న వ్యాపారా లన్నీ సుంకాలను తప్పించుకోవడానికి ఇప్పుడు అమెరికాకు బారులు తీరుతున్నాయి. కెనడా పట్ల కఠిన వైఖరిని అవలంబించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయి” అని ట్రంప్ విమర్శలు చేశారు. అమెరికా-కెనడా మధ్య వాణిజ్య ఒప్పందం చివరి నిమిషంలో రద్దయింది. అమెరికా ఇప్పటికే 50 శాతం సుంకాలతో విరుచుకుపడగా... కెనడా సైతం అగ్రరాజ్యం పై తాజాగా ప్రతీకార సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. కెనడియన్ కార్లు, ట్రక్కులు, ఆటోమోటివ్ విడిభాగాలు, ఉక్కు దిగుమతులపై ట్రంప్ 50 శాతం టారిఫ్‌లు విధించారు.

# అమెరికాలో వరదలకు 20 మంది గల్లంతు

అమెరికా: అమెరికాలోని గ్రాండ్ కాన్యన్ నేషనల్ పార్కులో ఆకస్మిక వరదలు తీవ్ర విధ్వంసం సృష్టించాయి. బ్రైట్ ఏంజెల్ క్రీక్‌లో శనివారం మధ్యాహ్నం సుమారు 2:30 గంటలకు ఒక్కసారిగా వరద ఉద్ధృతి పెరగడంతో 20 మందికి పైగా గల్లంతైనట్లు సమాచారం. ఉద్ధృత ప్రవాహం కారణంగా.. పాదచారుల వంతెన లు, పెద్ద బండరాళ్లు, లోహ నిర్మాణాలు, ఇతర శిథిలాలు కొలరాడో నదిలోకి కొట్టుకుపోయాయి. వరద ప్రవాహం కారణంగా క్రీక్ రూపమే పూర్తిగా మారిపోయిన దృశ్యాలు వీడియోల్లో కనిపిస్తున్నాయి. గల్లంతైన వారి ఆచూకీ కోసం అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. వరద ప్రభావిత ప్రాంతం నుంచి ఫాంటమ్ రాంచ్‌లో ఉన్న 62 మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలపై అధికారిక సమాచారం వెలువడలేదు. అయితే భారీ వర్షాల కారణంగా మరిన్ని ఆకస్మిక వరదలు, శిథిలాల ప్రవాహాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. నష్టాన్ని అంచనా వేసేందుకు బ్రైట్ ఏంజెల్ క్యాంప్‌గ్రౌండ్, ఫాంటమ్ రాంచ్, నార్త్ కైబాబ్ ట్రైల్‌లోని కొన్ని ప్రాంతాలను మూసివేయడంతో పాటు కొలరాడో నదిపై రాఫ్టింగ్ యాత్రలను కూడా తాత్కాలికంగా నిలిపివేశారు.



# డార్క్ ఎనర్జీ నుంచి కొత్త గ్రహాల వరకు...

## విశ్వ రహస్యాల వేటలో నాసా కొత్త టెలిస్కోప్

అమెరికా: అంతరిక్ష పరిశోధనలో మరో కీలక ముందడుగు పడింది. నాసా రూపొందించిన నాన్సీ గ్రేస్ రోమన్ స్పేస్ టెలిస్కోప్‌ను ఆదివారం విజయవంతంగా ప్రయోగించారు. స్పేస్ ఎక్స్‌కు చెందిన ఫాల్కన్ హెవీ రాకెట్ ద్వారా ఫ్లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి ఈ ప్రయోగం జరిగింది. భారత కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం ఈ ప్రయోగం జరిగింది. ఈ రోమన్ టెలిస్కోప్ ప్రధానంగా డార్క్ ఎనర్జీ, డార్క్ మ్యాటర్, సౌర వ్యవస్థకు వెలుపల ఉన్న గ్రహాల (ఎగ్జో ప్లానెట్లు)పై పరిశోధనలు చేయనుంది. విశ్వం ఎలా విస్తరిస్తోంది? ఆ విస్తరణ వేగం ఎందు కు పెరుగుతోంది? విశ్వంలో పదార్థం ఎలా విస్తరించి ఉంది? వంటి కీలక ప్రశ్నలకు సమాధానాలు కనుగొనేందుకు రోమన్ టెలిస్కోప్ సహాయపడనుంది. ఇప్పటికే ఉన్న హబుల్ స్పేస్ టెలిస్కోప్‌తో పోలిస్తే కనీసం 100 రెట్లు ఎక్కువ ప్రాంతాన్ని ఈ రోమన్ టెలిస్కోప్ ఒకేసారి పరిశీలించగలదు. హబుల్‌కు సమాన మైన ఇమేజ్ రిజల్యూషన్‌తో చాలా విస్తృతమైన ఆకాశ ప్రాంతాలను వేగంగా స్కాన్ చేయగల సామర్థ్యం ఈ రోమన్ టెలిస్కోప్‌నకు ఉంది.

నాసా అంచనాల ప్రకారం రోమన్ టెలిస్కోప్ తన మిషన్‌లో బిలియన్ల కొద్దీ గెలాక్సీలను పరిశీలించ నుంది. విశ్వానికి సంబంధించిన భారీ 3డీ మ్యాప్‌ను రూపొందించడంలో ఇది కీలక పాత్ర పోషించనుంది. రోమన్ టెలిస్కోప్ మరో ముఖ్య లక్ష్యం ఎగ్జోప్లానెట్ల అన్వేషణ. మన సౌర వ్యవస్థకు వెలుపల ఉన్న గ్రహాలను గుర్తించేందుకు ఇది ప్రత్యేకమైన మైక్రో లెన్సింగ్ పద్ధతిని ఉపయోగించ నుంది. ఈ విశ్వం వేగవంతమైన విస్తరణ కు కారణంగా భావిస్తున్న ‘డార్క్ ఎనర్జీ’ ఇప్పటికీ అతిపెద్ద మిస్టరీగా ఉంది. విశ్వంలోని మొత్తం పదార్థం, శక్తిలో డార్క్ ఎనర్జీ వాటా సుమారు 68 శాతం ఉంటుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తు న్నారు. అయితే అది అసలు ఏమిటి, కాలక్రమంలో దాని ప్రభావం ఎలా మారింది అనే ప్రశ్నలకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానం లేదు. ఈ రోమన్ టెలిస్కోప్ దూర గెలాక్సీలు, సూపర్‌నోవాలు, గెలాక్సీ క్లస్టర్లను పరిశీలించడం ద్వారా డార్క్ ఎనర్జీ రహస్యాలను తెలుసుకోనుంది. ప్రయోగం అనంతరం రోమన్ టెలిస్కోప్ తన తుది కక్ష్యకు చేరుకునేందుకు సుమా రు మూడు నెలల సమయం పడుతుంది. దాదాపు 10 లక్షల మైళ్ల ప్రయాణం చేసి ‘సన్ ఎర్త్ ఎల్-2’ ప్రాంతంలో ఇది పనిచేయనుంది. అక్కడి నుంచి విశ్వాన్ని విస్తృతంగా పరిశీలిస్తూ డార్క్ మ్యాటర్, డార్క్ ఎనర్జీ, గెలాక్సీలు, నక్షత్రాలు, ఎగ్జో ప్లానెట్లపై భారీస్థాయిలో డేటాను సేకరించనుంది.



# థాయ్‌పై భారత్ ఘనవిజయం



మహిళల టీ20 ఆసియాకప్‌లో భారత జట్టు ఘనంగా బోణీ చేసింది. బ్యాటింగ్‌లో కాస్త తడబడినా.. బౌలర్లు మాత్రం అంచనాకు తగ్గట్టు రాణించారు. దీంతో ఆదివారం గ్రూప్ 'ఎ'లో భాగంగా థాయ్‌లాండ్‌తో జరిగిన ఆరంభ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన 94 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 159 పరుగులు చేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ (36 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 64) మాత్రమే అర్ధసెంచరీతో ఆకట్టుకుంది. స్పిన్నర్లు సలిపోర్న్‌కు మూడు, సునిదకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో థాయ్‌లాండ్ దారుణంగా విఫలమైంది. నన్నపట్ (41) మినహా ఎవరూ రెండంకెల స్కోర్లు కూడా సాధించలేదు. దీంతో థాయ్ 16.1 ఓవర్లలో 65 పరుగులకే కుప్పకూలింది. స్పిన్నర్ దీప్తి ఏడు బంతుల్లో ఒక్క పరుగివ్వకుండానే మూడు వికెట్లు తీసింది. నందనికి మూడు, శ్రీచరణికి రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా షఫాలీ నిలిచింది. ప్రతీకా రావల్ ఈ మ్యాచ్ ద్వారా పొట్టి ఫార్మాట్‌లో అరంగేట్రం చేసింది.

**టీ20ల్లో అత్యధిక వికెట్లు**

భారత మహిళా క్రికెట్ జట్టు సీనియర్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ అరుదైన ఘనత సాధించింది. మహిళల టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డు నెలకొల్పింది. థాయ్‌లాండ్‌పై 1.1 ఓవర్లు వేసిన దీప్తి.. ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా మూడు వికెట్లు పడగొట్టింది. దీంతో ఆమె టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో తన వికెట్ల సంఖ్యను 171కి పెంచుకుం ది. ఇప్పటివరకు ఈ రికార్డు థాయ్‌లాండ్ బౌలర్ తిపచ్చా పుత్తా వాంగ్ (170) పేరిట ఉండగా.. తాజాగా దీప్తి దాన్ని అధిగమించింది.

## యూఎస్ ఓపెన్.. జకోవిచ్ ఔట్



యూఎస్ ఓపెన్ టోర్నీలో టెన్నిస్ దిగ్గజం నొవాక్ జకోవిచ్‌కు ఊహించని పరాజయం ఎదురైంది. రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించాలన్న అతడి ఆశలకు ఆదిలోనే గండి పడింది. తొలి రౌండ్‌లో అర్జెంటీనా ఆటగాడు మరియానో నవోనే చేతిలో ఐదు సెట్ల పోరులో జకోవిచ్ ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించాడు. దాదాపు నాలుగు గంటల పాటు సాగిన ఉత్కంఠ భరిత పోరులో జకోవిచ్ 6-7, 7-5, 6-4, 2-6, 1-6తో నవోనే చేతిలో పరాజయం పాలయ్యాడు. ఆర్థర్ యాష్ స్టేడియం లో మ్యాచ్ మొదలైనప్పటి నుంచే జకోవిచ్ తీవ్ర అసౌకర్యానికి గురయ్యాడు. న్యూయార్క్‌లోని ఉక్కపోత వాతావరణం అతడిని ఇబ్బంది పెట్టింది. మ్యాచ్ మూడో సెట్‌కు చేరుకునేసరికి పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఆరో గేమ్‌లో జకోవిచ్ పలుమార్లు వాంతులు చేసుకున్నాడు. తొలి సెట్‌ను టై బ్రేక్‌లో కోల్పోయిన జకోవిచ్ అద్భుతంగా పుంజుకున్నాడు. రెండో సెట్‌ను 7-5తో, మూడో సెట్‌ను 6-4తో గెలుచుకుని మ్యాచ్‌లో 2-1 ఆధిక్యంలోకి వెళ్లాడు. అయితే నవోనే మాత్రం వెనక్కి తగ్గలేదు. నాలుగో సెట్‌లో జకోవిచ్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన అతడు 6-2తో సెట్‌ను సొంతం చేసుకున్నాడు. నిర్ణాయత్మక ఐదో సెట్‌లోనూ నవోనే 4-1 ఆధిక్యంలోకి వెళ్లడంతో జకోవిచ్ పూర్తిగా నీరసించి నట్టు కనిపించాడు. ఈ సమయంలో కోర్టులోనే కన్నీళ్లు పెట్టుకు న్నాడు. గంటల తరబడి వేడి ప్రత్యర్థి దూకుడుతో పోరాడిన అనంతరం మ్యాచ్ తన చేజారిపోతుండటాన్ని తట్టుకోలేక భావోద్వే గానికి గురయ్యాడు. చివరికి నవోనే ఐదో సెట్‌ను 6-1తో గెలిచి మ్యాచ్‌ను ముగించాడు.

**78 మ్యాచ్‌ల విజయ పరంపరకు తెర**

ఈ పరాజయంతో గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో జకోవిచ్ 78 వరుస తొలి రౌండ్ విజయాల పరంపరకు తెరపడింది. 2006 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పాల్ గోల్డ్‌స్టెయిన్ చేతిలో తొలి రౌండ్‌లో ఓడిన తర్వాత మళ్లీ ఇంత తొందరగా గ్రాండ్‌స్లామ్‌లో అతడు ఇంటి బాట పట్టడం ఇదే తొలిసారి.

# తొలి రౌండ్‌లోనే వీనస్ విలియమ్స్‌కు షాక్

అమెరికా టెన్నిస్ దిగ్గజం వీనస్ విలియమ్స్‌కు యూఎస్ ఓపెన్‌లో మరోసారి నిరాశే ఎదురైంది. మహిళల సింగిల్స్ విభాగంలో 46 ఏళ్ల వీనస్‌ను అమెరికాకు చెందిన మరో ప్లేయర్ సోఫియా కెనిన్ తొలి రౌండ్‌లోనే ఓడించింది. ఆర్థర్ యాష్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో కెనిన్ 6-2, 7-6(8/6)తో వీనస్‌పై విజయం సాధించింది. యూఎస్ ఓపెన్ ప్రధాన డ్రాలో వీనస్‌కు ఇది 26వ మ్యాచ్. అలాగే గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఆమెకు ఇది 96వ మెయిన్ డ్రా మ్యాచ్. ఓపెన్ ఎరాలో అత్యధిక గ్రాండ్‌స్లామ్ మెయిన్ డ్రా ప్రదర్శనలు చేసిన క్రీడాకారిణిగా ఆమె రికార్డు కొనసాగుతోంది.

**ఆరంభం నుంచే..**

మ్యాచ్ మొదటి నుంచే వీనస్‌కు కష్టాలు ఎదురయ్యాయి. ఆమె తొలి సర్వీస్ గేమ్‌ను కెనిన్ బ్రేక్ చేసింది. తర్వాతి సర్వీస్ గేమ్‌లోనూ బ్రేక్ సాధించి 3-0 ఆధిక్యంలోకి వెళ్లింది. వీనస్ అనవసర తప్పిదాలు, డబుల్ ఫాల్ట్‌లతో ఇబ్బంది పడగా.. కెనిన్ తన తొలి, రెండో సర్వ్‌లతో మెరుగ్గా రాణించింది. దీంతో తొలి సెట్‌ను 6-2తో సొంతం చేసుకుంది. రెండో సెట్‌లో వీనస్ పోరాటం చేసినప్పటికీ కెనిన్ ఆధిపత్యాన్ని కొనసాగించింది. చివరకు టై బ్రేక్‌లో సెట్‌ను ముగించి మ్యాచ్‌ను తన ఖాతాలో వేసుకుంది.



**ఇద్దరికీ చేదు సీజన్..**

కెనిన్, వీనస్ ఇద్దరూ ఈ ఏడాది ఆశించిన స్థాయిలో రాణిం చలేదు. 2020 ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత, అదే ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్ అయిన కెనిన్.. 2026లో తొలి 26 మ్యాచ్‌ల్లో కేవలం ఆరు విజయాలే సాధించింది. యూఎస్ ఓపెన్ తొలి రౌండ్ విజయంతో ఆమె ఆ సంఖ్యను మెరుగుపరుచుకుంది. మరోవైపు వీనస్ విలియమ్స్‌కు పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. ఈ ఓటమితో ఆమె వరుసగా 15 సింగిల్స్ మ్యాచ్‌ల్లో పరాజయం చవిచూసింది. 2026లో ఆడిన మొత్తం 12 సింగిల్స్ మ్యాచ్‌ల్లోనూ ఆమెకు విజయం దక్కలేదు. ఇదిలా ఉంటే, తొలి రౌండ్‌లో విజయం సాధించిన కెనిన్.. రెండో రౌండ్‌కు అర్హత సాధించింది. అక్కడ మూడో సీడ్ జెస్సికా పెగులాతో తలపడ నుంది.

# వైభవ్ సూర్యవంశీ సంచలన ప్రదర్శన

**- దులీప్ ట్రోఫీలో 57 ఏళ్ల రికార్డు బద్దలు**

**- పిన్న వయస్సులో అర్ధశతకం.. సెంచరీ మిస్**

భారత యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ మరో అరుదైన ఘనత సాధించాడు. కేవలం 15 ఏళ్ల 157 రోజుల వయసులోనే దులీప్ ట్రోఫీ చరిత్రలో అత్యంత పిన్న వయసులో అర్ధ శతకం చేసిన బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. దీంతో 57 ఏళ్లుగా చెక్కు చెదరకుండా ఉన్న రికార్డును బద్దలు కొట్టాడు. ప్రస్తుతం జరుగు తున్న దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ సెంట్రల్ జోన్‌తో ఈస్ట్ జోన్ తలపడుతోంది. ఈ మ్యాచ్‌లో సోమ వారం బ్యాటింగ్‌కు దిగిన వైభవ్ తనదైన దూకుడుతో విరుచుకు పడ్డాడు. కేవలం 42 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేశాడు. అయితే సెంచరీకి చేరువైన వైభవ్(92).. మరో 8 పరుగుల దూరంలోనే పెవిలియన్‌కు చేరాడు.

**57 ఏళ్ల రికార్డు బద్దలు**

దులీప్ ట్రోఫీలో అతి చిన్న వయసులో అర్ధ శతకం సాధించిన రికార్డు ఇంతకాలం లక్ష్మణ్ సింగ్ పేరిట ఉంది. 1969లో అతడు 16 ఏళ్ల 23 రోజుల వయసులో దులీప్ ట్రోఫీలో తొలి అర్ధ శతకం సాధించాడు. తాజాగా వైభవ్ ఆ రికార్డును అధిగమిం చాడు. అతడి తర్వాతి స్థానంలో పీయూష్ చావ్లా ఉన్నా డు. 2025లో 16 ఏళ్ల 307 రోజుల వయసులో చావ్లా దులీప్ ట్రోఫీలో హాఫ్ సెంచరీ చేశాడు. ఇక మ్యాచ్ విషయానికొస్తే.. తొలుత బ్యాటింగ్ చేసిన సెంట్రల్ జోన్ జట్టు 266 పరుగులకు ఆలౌటైంది. రింకు సింగ్(60) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఈస్ట్ జోన్ జట్టు 35 ఓవర్లకు 2 వికెట్లు కోల్పోయి 189 పరుగులు చేసింది. కుమార కుషాగ్రా(0) విఫలమయ్యాడు. వైభవ్ సూర్యవంశీ(92) త్రుటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. ఈ వార్త రాసే సమయానికి క్రీజులో అభిమన్యు ఈశ్వరన్(62), సుదీప్ కుమార్(17) ఉన్నారు. సెంట్రల్ జోన్ కంటే ఈస్ట్ జోన్ ఇంకా 77 పరుగుల వెనుకంజలో ఉంది.



# ఐపీఎల్‌లో ఇంపాక్ట్ ప్లేయర్ రూల్

***ఫ్రాంచైజీల అభిప్రాయాలు కోరిన బీసీసీఐ***

ఐపీఎల్‌లో కొన్నేళ్లుగా తీవ్ర చర్చకు దారితీస్తున్న ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనపై బీసీసీఐ మరోసారి పునరాలోచనకు సిద్ధమవుతోంది. ఐపీఎల్-2027 సీజన్‌కు ముందు ఈ నిబం ధనపై పది ఫ్రాంచైజీల నుంచి తాజాగా అభిప్రాయాలు సేకరించా లని బీసీసీఐ నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం లోగా తమ అభిప్రాయాలను తెలియజేయాలని జట్లను కోరి నట్లు వార్తలు వస్తున్నాయి. ఐపీఎల్-2026 ముగిసిన తర్వాత ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనను సమీక్షిస్తామని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా గతంలోనే ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ ప్రక్రియలో భాగంగానే ఫ్రాంచైజీల నుంచి అధికారికంగా అభిప్రాయాలు కోరినట్లు తెలుస్తోంది. ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి బ్యాటింగ్-బౌలింగ్ సమతూకంపై చర్చ జరుగుతూనే ఉంది. ముఖ్యంగా 2026 ఐపీఎల్ సీజన్‌లో భారీ స్కోర్లు నమోదవ్వడంతో ఈ నిబంధనపై మరోసారి విమర్శలు పెరిగాయి. ఇంపాక్ట్ ప్లేయర్ కారణంగా అదనపు బ్యాటర్‌ను తుది జట్టులోకి తీసుకునే అవకాశం ఉండటంతో బౌలర్ల పాత్ర, ప్రాధాన్యం తగ్గుతోందన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

ఐపీఎల్-2026 కెప్టెన్ల సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం.. టోర్నీ ముగిసిన తర్వాత క్రికెట్ కార్యకలాపాలకు సంబంధించిన కీలక అంశాలపై అన్ని ఫ్రాంచైజీల నుంచి అభిప్రాయాలు సేకరించనున్నట్లు బీసీసీఐ తెలిపింది. ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌తో పాటు ప్లేయర్లు, మ్యాచ్ అధికారుల ప్రాంతం (పీఎంఓఏ), అంపైరింగ్, ప్రాక్టీస్ సెషన్లు, ప్లేయింగ్ కండిషన్స్ తదితర అంశాలపైనా జట్ల నుంచి సూచనలు కోరింది. ఆయా జట్ల క్రికెట్ ఆపరేషన్స్ విభాగాలతో చర్చించి సమగ్ర అభిప్రాయాలను ఆగస్టు 31లోగా సమర్పించాలని బీసీసీఐ సూచించింది.

**ఐపీఎల్-2027లో ఈ రూల్ ఉంటుందా?**

ఇప్పటివరకు ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌ను మరో సీజన్ కొనసాగించాలనే ఆలోచనలో బీసీసీఐ ఉన్నట్లు సంకేతాలు ఇచ్చింది. అయితే పలు జట్ల కెప్టెన్ల నుంచి అభ్యంతరాలు రావడంతో సమీక్ష నిర్వహిస్తామని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. తాజాగా ఫ్రాంచైజీల నుంచి మరోసారి అభిప్రాయాలు కోరడంతో పరిస్థితి మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. పది జట్ల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను పరిశీలించిన తర్వాతే ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనలో మార్పులు చేయాలా? కొనసాగించాలా? అనే దానిపై బీసీసీఐ తుది నిర్ణయం తీసుకోనుంది. ప్రస్తుతం మాత్రం ఈ రూల్ అమల్లోనే ఉంది.

# దసరా రేసులో 'జైలర్ 2' పరిస్థితి ఏంటి?



సినిమా విడుదలకు పండుగ సీజన్ అంటే నిర్మాతలకు ప్రత్యేక ఆసక్తి ఉంటుంది. వరుస సెలవులు, ప్రేక్షకులకు అందుబాటులో ఉండే సమయం కారణంగా ఈ సమయంలో సినిమాలకు భారీ ఓపెనింగ్స్ వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే సంక్రాంతి, దసరా, వేసవి సెలవులను టార్గెట్ చేస్తూ పెద్ద సినిమాలు తమ రిలీజ్ డేట్లను ముందుగానే ఖరారు చేసుకుంటుంటాయి. ప్రస్తుతం దసరా సీజన్ విషయంలో టాలీవుడ్, కోలీవుడ్ సినిమాల మధ్య ఆసక్తికరమైన పోటీ నెలకొంటోంది. ముఖ్యంగా పాన్ ఇండియా సినిమాల లెక్క పెరగడంతో భాషలతో సంబంధం లేకుండా సినిమాలు ఇతర రాష్ట్రాల్లోనూ భారీగా విడుదలవుతున్నాయి. దీంతో ఒకే సమయంలో పలు భారీ చిత్రాలు థియేటర్లలోకి వస్తే స్క్రీన్ల కేటాయింపు విషయంలో సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ఇప్పుడు ఇదే పరిస్థితి దసరా సీజన్‌లో కనిపించేలా ఉంది. రజినీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'జైలర్ 2'ను అక్టోబర్ 15న విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు.

ఈ డేట్‌పై మేకర్స్ భారీ అంచనాలతో ఉన్నారు. అయితే ప్రస్తుతం కొన్ని తెలుగు సినిమాలు కూడా దసరా సెలవులను టార్గెట్ చేస్తూ రిలీజ్ డేట్లను ఖరారు చేసుకునే ప్రయత్నం చేస్తుండటంతో 'జైలర్ 2'కు తెలుగు రాష్ట్రాల్లో థియేటర్ల విషయంలో పోటీ తప్పదనే చర్చ మొదలైంది. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వెంకటేష్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' అక్టోబర్ 2న విడుదల కావాల్సి ఉండగా.. అక్టోబర్ 9కు మార్చారు. అదే సమయంలో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న 'రణబాలి' విషయంలోనూ రిలీజ్ డేట్‌పై మార్పులు చోటుచేసుకున్నాయి. తొలుత సెప్టెంబర్ 11న ఈ సినిమాను విడుదల చేయాలని భావించినప్పటికీ ఆ తేదీని ఆనంద్ దేవరకొండ నటిస్తున్న 'ఎపిక్' కోసం కేటాయించే ప్రయత్నాలు జరిగాయి. దీంతో 'రణబాలి'ని అక్టోబర్ 16న విడుదల చేయాలని మైత్రి మూవీ మేకర్స్ ఇప్పటికే ప్రకటించింది. దసరా సీజన్‌లో పలు భారీ తెలుగు సినిమాలు థియేటర్లలోకి వచ్చే పరిస్థితి కనిపిస్తుండటంతో స్క్రీన్స్ కేటాయింపుపై చర్చ మొదలైంది. ముఖ్యంగా 'జైలర్ 2' అక్టోబర్ 15న వస్తుండ గా.. అక్టోబర్ 16న మరో తెలుగు భారీ చిత్రం విడుదలైతే తెలుగు రాష్ట్రాల్లో థియేటర్ల పంపిణీ విషయంలో పోటీ తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 'జైలర్ 2' రిలీజ్ డేట్‌ను మేకర్స్ మార్చే ఆలోచనలో ఉన్నారనే ప్రచారం సోషల్ మీడియాలో జరుగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి సమాచారం లేదు. రజినీకాంత్ సినిమాకు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న మార్కెట్‌ను కూడా తక్కువగా అంచనా వేయలేం. 'జైలర్' తెలుగు వెర్షన్ కూడా మంచి విజయాన్ని అందుకోవడంతో 'జైలర్ 2'పై అంచనాలు భారీగా ఉన్నాయి. రజినీకాంత్‌కు ఉన్న స్టార్ ఇమేజ్, ఆయన సినిమాలకు తెలుగు ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్ కారణంగా పోటీ ఉన్నప్పటికీ ఈ సినిమాకు భారీ ఓపెనింగ్స్ వచ్చే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవల తమిళ సినిమాలు కూడా తెలుగు మార్కెట్‌లో మంచి వసూళ్లు సాధిస్తున్న నేపథ్యంలో డబ్బింగ్ చిత్రాలపై ప్రేక్షకుల ఆసక్తి పెరిగింది. దీంతో 'జైలర్ 2'కు సరైన థియేటర్లు లభిస్తే తెలుగు రాష్ట్రాల్లో కూడా భారీ వసూళ్లు సాధించే అవకాశం ఉంది. దసరా రేసులో తెలుగు సినిమాల సంఖ్య పెరుగుతున్న కొద్దీ 'జైలర్ 2'కు స్క్రీన్ల కేటాయింపు ఎలా ఉండబోతోందన్నది ఆసక్తికరంగా మారింది. పోటీని ఎదుర్కొంటూ రజినీకాంత్ సినిమా అదే తేదీన వస్తుందా? లేక విడుదల తేదీని మార్చుకుంటుందా? అనేది అధికారిక ప్రకటన వచ్చే వరకు సస్పెన్స్‌గానే ఉండనుంది.

# ఈసారి శ్రీవిష్ణు ఏడిపించేలా ఉన్నాడే



వర్సటైల్ నటుడు శ్రీవిష్ణు వరుస సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెల్సిందే. తాజాగా శ్రీవిష్ణు మరో కొత్త సినిమాను ప్రకటించాడు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెం ట్స్, ఫోర్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మి స్తోన్న ప్రొడక్షన్ నంబర్ 39లో శ్రీవిష్ణు హీరోగా నటిస్తున్నాడు. ఈ చిత్రానికి సన్నీ సంజయ్ దర్శకత్వం వహిస్తోన్న ఈ సిని మాను ఎస్.నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర నిర్మి స్తోంది. నేడు నిర్మాత సూర్యదేవర రాధాకృష్ణ (చిన్నబాబు) పుట్టినరోజు కావడంతో.. కుమార్తె హారిక, అన్న కొడుకు నాగవంశీ ఆయనకు ప్రొడక్షన్ నంబర్ 39 కాన్సెప్ట్ గ్లింప్స్‌ను రిలీజ్ చేసి ఆయనకు బర్త్ డే విషెస్ తెలిపారు. ఈ వీడియోలో ప్రతి సగటు మధ్యతరగతి యువకుడి జీవిత ప్రయాణాన్ని ఎంతో హృద్యంగా చూపించారు. చిన్నతనంలో స్కూల్‌లో ఎన్నో రకాల కలలు కనడం, ఆ తర్వాత స్తోమతకి తగ్గట్టు సాధారణ కాలేజీలో చదువుకోవడం, పెద్దయ్యాక కుటుంబ బాధ్యతల వల్ల నచ్చినా నచ్చకపోయినా ఏదో ఒక ఉద్యోగం చేస్తూ రోజూ లోకల్ ట్రైన్లు, మెట్రోలలో ప్రయాణించడం వంటి అంశాలను భావోద్వేగంగా ఆవిష్కరించారు. ఈ ప్రయాణంలో అసలు మనం ఏమవ్వాలనుకున్నామో మర్చిపోయి బతుకుతుంటామని, ఇది ప్రతీ ఒక్కరి కథ అని నేపథ్య వాయిస్ ఓవర్‌తో చెప్పడం ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసేలా ఉంది. ఇక ఈ సినిమాలో శ్రీవిష్ణు సూర్య అనే పాత్రలో కనిపించనున్నాడు. స్టోరీ ఆఫ్ ఎవ్రీ యంగ్‌స్టర్ అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ చిత్రానికి దీపిన్ శ్రీ నెట్టారా సంగీతం అందిస్తున్నాడు. ప్రతిసారి కామెడీతో నవ్వించే శ్రీవిష్ణు.. ఈసారి ఒక మంచి కుటుంబ కథతో ఏడిపించేలా ఉన్నాడని నెటిజన్స్ కామెంట్స్ పెడుతున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం అయింది. మరి ఈ సినిమాతో శ్రీవిష్ణు ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.

# హిట్లు.. ఫ్లాపులు.. సర్‌ప్రైజ్‌లు!

## ఆగస్ట్‌లో టాలీవుడ్ బాక్సాఫీస్ రిపోర్ట్

ఆగస్ట్ నెల టాలీవుడ్ బాక్సాఫీస్‌కి కాస్త ఊపిరి పోసిన నెలగా నిలిచింది. వరుసగా వచ్చిన సినిమాల్లో కొన్ని ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడమే కాకుండా మంచి వసూళ్లు సాధించాయి. మరికొన్ని భారీ అంచనాలతో వచ్చి పూర్తిగా నిరాశపరిచాయి. ముఖ్యంగా నాలుగు సినిమాలు బాక్సాఫీస్ వద్ద సందడి చేయగా.. ఒక భారీ చిత్రం మాత్రం అంచనాల భారాన్ని మోయలేక పోయింది. మొత్తంగా చూస్తే ఆగస్ట్ నెల టాలీవుడ్‌కి మిశ్రమ ఫలితాలతో పాటు కొత్త ఉత్సాహాన్ని కూడా అందించింది.

**'కొరియన్ కనకరాజు' యావరేజ్**

ఆగస్ట్ తొలి వారంలో వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' యావరేజ్ టాక్ తెచ్చుకుంది. సరైన విజయం కోసం ఎదురు చూస్తున్న వరుణ్ తేజ్‌కు ఈ సినిమా కాస్త ఊరటనిచ్చింది. కథలో కామెడీని చక్కగా మిక్స్ చేయడం సినిమాకు ప్లస్‌గా మారింది. ముఖ్యంగా సత్యతో వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులను నవ్వించాయి.

**లోకేష్ 'డీసీ'.. ఊహించని సక్సెస్**

ఆగస్ట్‌లో ప్రేక్షకులకు అసలు సర్‌ప్రైజ్ ఇచ్చిన సినిమా లోకేష్ కనకరాజు నటించిన 'డీసీ'. దర్శకుడిగా ఇప్పటికే తనకంటూ ప్రత్యేకమైన బ్రాండ్‌ను సొంతం చేసుకున్న లోకేష్.. నటుడిగా తొలిసారి తెరపైకి వచ్చి ఆశ్చర్యపరిచాడు. ఇంటెన్స్ కథ, టేకింగ్, మేకింగ్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. ముఖ్యంగా కథను నడిపించిన విధానం ప్రేక్షకులను ఆకట్టుకుంది. తెలుగులో ఈ చిత్రాన్ని రిలీజ్ చేసిన ఏషియన్ గ్రూప్‌కు కూడా మంచి లాభాలను తెచ్చిపెట్టింది. అంచనాలు లేకుండా వచ్చి బాక్సాఫీస్ వద్ద ప్రభావం చూపిన చిత్రంగా 'డీసీ' ఆగస్ట్ హైలైట్స్‌లో ఒకటిగా నిలిచింది.

**'విశ్వనాథ్ అండ్ సన్స్'.. చక్కని ఆదరణ**

ఆగస్టు 15 సందర్భంగా వచ్చిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' మరో మంచి విజయాన్ని అందుకుంది. సూర్య, వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో వచ్చిన ఈ





సినిమా ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకుంది. దర్శకుడు వెంకీ అట్లూరికి హ్యాట్రిక్ అందించిన చిత్రంగా ఇది నిలిచింది. పూర్తిగా తమిళంలో రూపొందినప్పటికీ.. తెలుగు ప్రేక్షకులకు కూడా ఎమోషన్ బాగా కనెక్ట్ అయింది. ముఖ్యంగా మదర్ సెంటిమెంట్, కుటుంబ బంధాలు, ఎంటర్‌టైన్‌మెంట్ సినిమాకు బలంగా మారాయి. త్రివిక్రమ్ మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్ అనే పబ్లిక్ రెస్పాన్స్ కూడా సినిమాకి బాగా హెల్ప్ అయ్యింది.మమితా బైజు ప్రెజెన్స్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఖాతాలో మరో పడింది.హిట్ పడింది.

**ఇరుముడి'.. బాక్సాఫీస్ కింగ్**

ఆగస్ట్ మూడోవారం వచ్చిన రవితేజ 'ఇరుముడి' మాత్రం బాక్సాఫీస్ లెక్కలను మార్చేసింది. ఈ సినిమా సాధించిన విజయాన్ని సాధారణ హిట్‌గా చూడలేం. ప్రేక్షకులు సినిమాను ఓన్ చేసుకున్నారు. కథలోని ఎమోషన్, భక్తి, యాక్షన్ అంశాలు కలిసి సినిమాకు బలమైన కనెక్ట్‌ను తీసుకొచ్చాయి.అయ్యప్ప స్వామి చుట్టూ ఉన్న భక్తి అంశాలు, పాటలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా మారాయి. ముఖ్యంగా రవితేజ తన ఇమేజ్‌కి భిన్నంగా కథను నమ్ముకుని చేసిన ప్రయత్నం ప్రేక్షకులకు నచ్చింది. చాలా కాలంగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న రవితేజకు 'ఇరుముడి' పెద్ద రిలీఫ్ ఇచ్చింది. విడుదలై రెండు వారాలు కావొస్తున్నా కొన్ని ప్రాంతాల్లో హౌస్‌ఫుల్ బోర్డులు కనిపించడం సినిమా ఏ రేంజ్ హిట్టు అయిందో తెలుస్తుంది.

**'టాక్సిక్' హైప్.. ఫలితం శూన్యం..**

యష్ 'టాక్సిక్' మాత్రం ఆగస్ట్‌లో అతిపెద్ద నిరాశగా నిలిచింది. టీజర్, ట్రైలర్ నుంచే సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. స్టైలిష్ మేకింగ్, భారీ బడ్జెట్, యష్ క్రేజ్‌తో సినిమా దేశవ్యాప్తంగా హైప్ తెచ్చుకుంది. కానీ థియేటర్లలోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కథ, కథనం, పాత్రల రూపకల్పన ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్టుగా లేకపోవడంతో సినిమా బలహీనపడింది. ఎంత భారీగా తెరకెక్కించినా.. కంటెంట్ కనెక్ట్ కాకపోతే బాక్సాఫీస్ వద్ద నిలబడటం కష్టమని 'టాక్సిక్' మరోసారి చూపించింది.

**చిన్న సినిమాల పరిస్థితి నిరాశే!**

ఆగస్ట్‌లో వచ్చిన చిన్న సినిమాలకు మాత్రం పెద్దగా కలిసి రాలేదు. 'కేజేక్యూ', 'ఎంఎస్ రాజు ఆగధ', 'హుషారు పిట్టలు', 'అమీర్ లోగ్', విశాల్ దర్శకత్వంలో వచ్చిన 'మకుటం' వంటి చిత్రాలు ప్రేక్షకులను థియేటర్లకు రప్పించలేకపోయాయి. చివరి వారంలో వచ్చిన నయనతార 'హాయ్' సినిమా పరిస్థితి కూడా అంతే. సినిమాపై ముందుగా సరైన బజ్ లేకపోవడం, థియేట ర్లలో కంటెంట్ ప్రేక్షకులను ఆకట్టుకోకపోవడంతో సినిమా పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. ఫైనల్‌గా చూస్తే.. భారీ బడ్జెట్, స్టార్ క్రేజ్ కంటే కంటెంట్, ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్ ఉన్న సినిమాలకే ప్రేక్షకులు ఓటేశారు. 'కొరియన్ కనకరాజు' మంచి ఓపెనింగ్ ఇచ్చింది. 'డీసీ' అంచనాలను మించి సర్‌ప్రైజ్ చేసింది. 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఫ్యామిలీ ఆడియన్స్‌ను థియేటర్లకు రప్పించింది. ఇక 'ఇరుముడి' మాత్రం ఆగస్ట్ బాక్సాఫీస్‌కు అసలైన జోష్ తీసుకొచ్చింది. అదే సమయంలో 'టాక్సిక్'లాంటి భారీ చిత్రం కంటెంట్ విషయంలో తడబడితే ఎంతటి హైప్ ఉన్నా ప్రేక్షకులు ఆదరించరని నిరూపించింది.